

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 7-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 191 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ. 9.48 తదుపరి పంచమి; నక్షత్రం: అనూరాధ రా. 2.25 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: శేషం ఉ.6.18; దుర్ముహూర్తం: మ.12.26-1.13, మ.2.47-3.34; అమృతఘడియలు: మ.3.02-4.47; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 5.55 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమ్మాయిలు గెలిచారు


షఫాలీ (32)

ఆరు వికెట్లతో పాకిస్థాన్ ఓటమి
మెరిసిన అరుంధతి, షఫాలీ

టీ20 వరల్డ్ కప్


అరుంధతి రెడ్డి (3/19)

దుబాయ్: కివీస్‌తో ఓటమి దరిమిలా.. టోర్నమెంట్‌లో కొనసాగాలంటే మిగిలిన ప్రతి మ్యాచూ గెలవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో టీ20 వరల్డ్ కప్‌లో హర్మన్‌ప్రీత్‌సేన తొలి విజయం అందుకుంది కానీ..ఆశించిన స్థాయిలో విజృంభించలేకపోయింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై తన ఆధిపత్యం నిలబెట్టుకొన్నా..స్వల్ప లక్ష్య ఛేదనలో బ్యాటర్లు మళ్లీ తడబాటుకు లోనయ్యారు. అయితే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (29 రిటైర్డ్ హర్ట్) అండతో గట్టెక్కింది. దాంతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్లతో పాకిస్థాన్‌ను ఓడించి పాయింట్ల ఖాతా తెరిచింది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ 20 ఓవర్లలో 105/8 స్కోరు చేసింది. హైదరాబాద్ పేసర్ అరుంధతీ రెడ్డి (3/19) మూడు వికెట్లతో ప్రత్యర్థిని కట్టడి చేసింది. నిదా దర్ (28), మునీబా (17) పర్లేదనిపించారు. స్పిన్నర్ శ్రేయాంక (2/12) రెండు వికెట్లు పడగొట్టింది. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 18.5 ఓవర్లలో 108/4తో కానీ ఛేదించలేకపోయింది. ఓపెనర్ షఫాలీ (32), జెమీమా (23) రాణించారు. ఫాతిమా 2 వికెట్లు సాధించింది. అరుంధతి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. బుధవారం జరిగే తదుపరి మ్యాచ్‌లో శ్రీలంకను మనోళ్లు ఢీకొంటారు.

ఆ జోరు లేకపాయె: ఈ మ్యాచ్‌కు ముందు భారత్ రన్‌రేట్ -0.290. సెమీస్‌కు చేరాలంటే అన్ని మ్యాచ్‌ల్లో నెగ్గడంతోపాటు రన్‌రేట్‌ను గణనీయంగా పెంచుకోవడం మనోళ్లకు అవశ్యమైంది. కానీ భారత బ్యాటర్లు ఆ దూకుడు ప్రదర్శించలేకపోయారు. ఫలితంగా రన్‌రేట్ (-1.217) పెద్దగా మెరుగుపడలేదు. పాకిస్థాన్ (0.555) కంటే వెనుకంజలోనే ఉంది. దాంతో గ్రూప్ 'ఎ'లో పాకిస్థాన్ తర్వాత నాలుగో స్థానంలో ఉన్నారు. వికెట్ స్పిన్‌కు అనుకూలించడంతో పాకిస్థాన్ కూడా స్లో బౌలర్లతో మనోళ్లకు కళ్లెం వేసింది. దాంతో ఇన్నింగ్స్ మొత్తంలో భారత్ ఐదు బౌండరీలే కొట్టగలిగింది. మంధాన (7) మరోసారి విఫలం కావడంతో..షఫాలీ, జెమీమా సింగిల్స్‌కు ప్రాధాన్యమిస్తూ నెమ్మదిగా ఇన్నింగ్స్ నడిపించారు. షఫాలీని స్పిన్నర్ సొహైల్ పెవిలియన్ చేర్చింది. ఆపై కెప్టెన్ హర్మన్, జెమీమా మ్యాచ్‌ను ముగిస్తారనే దశలో..పేసర్ ఫాతిమా 16వ ఓవర్లో వరుస బంతుల్లో జెమీమా, రిచా(0)ను అవుట్ చేయడంతో భారత్ ఒత్తిడిలో పడినట్టు కనిపించింది. 19వ ఓవర్లో మెడ నొప్పితో హర్మన్ మైదానం వీడగా.. సజన బౌండరీతో మ్యాచ్‌ను ముగించింది.

అరుంధతి అదుర్స్: అంతకుముందు భారత బౌలింగ్ విభాగం సమష్టిగా రాణించి పరుగులు చేయకుండా పాక్‌ను నిరోధించింది. మన బౌలర్లు ఏకంగా 58 డాట్ బంతులు వేయడం విశేషం. ఓపెనర్ ఫిరోజా (0)ను రేణుకా సింగ్ డకౌట్ చేస్తే..సిద్రా (8)ను దీప్తి శర్మ పెవిలియన్ చేర్చింది. ఆపై పేసర్ అరుంధతి రెడ్డి మూడు వికెట్లతో చెలరేగి ప్రత్యర్థి భరతం పట్టింది. శ్రేయాంక రెండు వికెట్లతో తన వంతు పాత్ర పోషించింది.

స్కోరుబోర్డు

పాకిస్థాన్: మునీబా (స్టంప్డ్) రిచా (బి) శ్రేయాంక 17, గుల్ ఫిరోజా (బి) రేణుక 0, సిద్రా (బి) దీప్తి శర్మ 8, ఒమైమా (సి) షఫాలీ (బి) అరుంధతి 3, నిదా దర్ (బి) అరుంధతి 28, అలియా (ఎల్బీ) అరుంధతి 4, ఫాతిమా (సి) రిచా (బి) శోభన 13, తుబా హసన్ (సి) షఫాలీ (బి) శ్రేయాంక 0, సయిదా (నాటౌట్) 14, నష్రా (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 105/8; వికెట్లపతనం:** 1-1, 2-25, 3-33, 4-41, 5-52, 6-70, 7-71, 8-99; **బౌలింగ్:** రేణుక 4-0-23-1, దీప్తి 4-0-24-1, అరుంధతి 4-0-19-3, శ్రేయాంక 4-1-12-2, శోభన 4-0-24-1

భారత్: షఫాలీ (సి) అలియా (బి) ఒమైమా 32, మంధాన (సి) తుబా (బి) సాదియా 7, జెమీమా (సి) మునీబా (బి) ఫాతిమా 23, హర్మన్‌ప్రీత్ (రిటైర్డ్ హర్ట్) 29, రిచా (సి) మునీబా (బి) ఫాతిమా 0, దీప్తిశర్మ (నాటౌట్) 7, సజన (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.5 ఓవర్లలో 108/4; వికెట్లపతనం:** 1-18, 2-61, 3-80, 4-80; **బౌలింగ్:** ఫాతిమా 4-0-23-2, సాదియా 4-0-23-1, నిదా దర్ 1.5-0-10-0, ఒమైమా 3-0-17-1, నష్రా 4-0-21-0, తుబా హసన్ 2-0-14-0.

మహిళల వరల్డ్ కప్‌లో నేడు
ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా
రాత్రి 7.30 నుంచి
స్టార్ నెట్‌వర్క్, డిస్నీ హాట్‌స్టార్‌లో

అవలీలగా..


హార్దిక్ పాండ్యా (16 బంతుల్లో 39 నాటౌట్)

తొలి టీ20లో బంగ్లాపై భారత్ ఘనవిజయం
అర్ష్‌దీప్, వరుణ్‌లకు మూడేసి వికెట్లు ● హార్దిక్ మెరుపు ఇన్నింగ్స్

1 టీ20ల్లో ఎక్కువ బంతులు (49) మిగిలి ఉండగానే నెగ్గడం భారత్‌కిదే తొలిసారి.


అర్ష్‌దీప్ (3/14)

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్: పర్వేజ్ (బి) అర్ష్‌దీప్ 8; లిట్టన్ దాస్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 4; షంటో (సి అండ్ బి) సుందర్ 27; హ్రిదయ్ (సి) హార్దిక్ (బి) వరుణ్ 12; మహ్మదుల్లా (సి) సుందర్ (బి) మయాంక్ 1; జకీర్ (బి) వరుణ్ 8; మిరాజ్ (నాటౌట్) 35; రిషాద్ (సి) హార్దిక్ (బి) వరుణ్ 11; టస్కిన్ (రనౌట్) 12; షోరిఫుల్ (బి) హార్దిక్ 0; ముస్తాఫిజుర్ (బి) అర్ష్‌దీప్ 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.5 ఓవర్లలో 127 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-40, 4-43, 5-57, 6-75, 7-93, 8-116, 9-117, 10-127; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.5-0-14-3; హార్దిక్ 4-0-26-1; వరుణ్ 4-0-31-3; మయాంక్ 4-1-21-1; నితీశ్ 2-0-17-0; సుందర్ 2-0-12-1.

భారత్: సంజూ శాంసన్ (సి) రిషాద్ (బి) మిరాజ్ 29; అభిషేక్ (రనౌట్) 16; సూర్యకుమార్ (సి) జకీర్ (బి) ముస్తాఫిజుర్ 29; నితీశ్ (నాటౌట్) 16; హార్దిక్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 11.5 ఓవర్లలో 132/3. వికెట్ల పతనం:** 1-25, 2-65, 3-80. **బౌలింగ్:** షోరిఫుల్ 2-0-17-0; టస్కిన్ 2.5-0-44-0; ముస్తాఫిజుర్ 3-0-36-1; రిషాద్ 3-0-26-0; మిరాజ్ 1-0-7-1.

2 సుదీర్ఘ విరామం (86 మ్యాచ్‌లు) తర్వాత టీ20 మ్యాచ్ ఆడిన రెండో భారత క్రికెటర్‌గా వరుణ్ చక్రవర్తి. ఖలీల్ అహ్మద్ (104) ముందున్నాడు.

3 టీ20 అరంగేట్రంలోనే తొలి ఓవర్‌ను మెయిడెన్‌గా వేసిన మూడో భారత బౌలర్‌గా మయాంక్. అగార్కర్, అర్ష్‌దీప్ ముందున్నారు.

గ్వాలియర్: బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను భారత్ ఏకపక్ష విజయంతో ఆరంభించింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ముందుగా బౌలర్లు చెలరేగి ప్రత్యర్థిని స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. పేసర్ అర్ష్‌దీప్ సింగ్ (3/14)తో పాటు మూడేళ్ల తర్వాత బరిలోకి దిగిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (3/31) దెబ్బతీశాడు. అనంతరం హార్దిక్ (16 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 39 నాటౌట్), సూర్యకుమార్ (14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 29) మెరుపులతో భారత్ 7 వికెట్ల తేడాతో సునాయాసంగా నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 19.5 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. మెహిదీ హసన్ మిరాజ్ (35 నాటౌట్), షంటో (27) మాత్రమే రాణించారు. ఛేదనలో భారత్ 11.5 ఓవర్లలో 3 వికెట్లకు 132 పరుగులు చేసి గెలిచింది. సంజూ శాంసన్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 29) ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌తో మయాంక్ యాదవ్, తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి అరంగేట్రం చేశారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అర్ష్‌దీప్ నిలిచాడు. రెండో మ్యాచ్ బుధవారం ఢిల్లీలో జరుగుతుంది.

ధనాధన్ ఆటతో..: స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన భారత్ ఇన్నింగ్స్ రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ బ్యాట్ ఝుళిపించాడు. చివర్లో హార్దిక్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో మరో ఎనిమిది ఓవర్లుండగానే విజయం వశమైంది. ఓపెనర్ శాంసన్ తొలి ఓవర్‌లోనే రెండు ఫోర్లు బాదగా.. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ అభిషేక్ (16) 6,4,4తో సత్తా చాటాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ తన సహజశైలిలో చెలరేగాడు. ఐదో ఓవర్‌లో 4,4,6తో 14 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనూ లాంగాన్‌లో భారీ సిక్సర్ బాదిన అతడిని ముస్తాఫిజుర్ అవుట్ చేశాడు. అయితే అప్పటికే పవర్‌ప్లేలో జట్టు అత్యధికంగా 71 పరుగులు చేసింది. అటు ఓపిగ్గా ఆడుతున్న శాంసన్‌ను ఎనిమిదో ఓవర్‌లో మిరాజ్ పెవిలియన్‌కు చేర్చాడు. ఆల్‌రౌండర్లు నితీశ్ (16 నాటౌట్), హార్దిక్ బంగ్లా బౌలర్లను మరింత దీటుగా ఎదుర్కొంటూ లక్ష్యాన్ని వేగంగా కరిగించారు. రిషాద్ ఓవర్‌లో నితీశ్ సిక్సర్‌తో విజృంభించగా, పదో ఓవర్‌లో హార్దిక్ రెండు ఫోర్లు సాధించడంతో స్కోరు వంద పరుగులు దాటింది. ఆ తర్వాత హార్దిక్ 12వ ఓవర్‌లో వరుసగా 4,4,6 బాదేసి మ్యాచ్‌ను ముగించాడు.

బౌలర్ల హవా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాను భారత బౌలర్లు కుదురుకోనీయలేదు. పేసర్ అర్ష్‌దీప్ ఆరంభంతో పాటు ఫినిషింగ్‌లోనూ పాలుపంచుకోగా.. కమ్‌బ్యాక్ స్పిన్నర్ వరుణ్ సత్తా చాటుకున్నాడు. అరంగేట్ర బౌలర్ మయాంక్ తన తొలి ఓవర్‌నే మెయిడెన్‌గా వేసి ఓ వికెట్ కూడా సాధించాడు. దీంతో బంగ్లా స్వల్ప స్కోరుకే పరిమితమైంది. తొలి ఓవర్‌లోనే లిట్టన్ (4)ను అవుట్ చేసిన అర్ష్‌దీప్.. తన తర్వాతి ఓవర్‌లో మరో ఓపెనర్ పర్వేజ్ (8)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో 14 పరుగులకే జట్టు రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ షంటో, తౌహిద్ (12) కాసేపు క్రీజులో నిలువగలిగారు. దీనికితోడు వరుణ్ మొదటి ఓవర్‌లో తౌహిద్ రెండు ఫోర్లు, షంటో సిక్సర్‌తో 15 రన్స్ వచ్చాయి. కానీ ఈ జోడీని తనే విడదీసి జట్టుకు రిలీఫ్‌నిచ్చాడు. కెప్టెన్‌కు సహకరిస్తున్న తౌహిద్‌ను ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 26 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తర్వాతి ఓవర్‌లోనే పేసర్ మయాంక్ మహ్మదుల్లా (1)ను పెవిలియన్ చేర్చి కెరీర్‌లో తొలి వికెట్ సాధించాడు. కాసేపటికే షంటోను సుందర్ అవుట్ చేయడంతో బంగ్లా ఇన్నింగ్స్ తడబడింది. అటు లోయర్ విడిలార్డర్‌లో మిరాజ్ పోరాడినా అతడికి సహకారం కరువైంది. వరుణ్, హార్దిక్ టెయిలెండర్లను ఇబ్బందిపెట్టారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో వికెట్ తీసిన అర్ష్‌దీప్.. ఆఖరి ఓవర్‌లోనూ ఐదో బంతికి ముస్తాఫిజుర్ (1)ను అవుట్ చేసి బంగ్లా ఇన్నింగ్స్‌కు చెక్ పెట్టాడు.


అరంగేట్రం కుర్రాళ్లు మయాంక్, నితీష్

స్కాట్లాండ్‌పై విండీస్ గెలుపు

దుబాయ్: మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో వెస్టిండీస్ బోణీ చేసింది. ఆదివారం గ్రూప్-బిలో జరిగిన మ్యాచ్‌లో కరీబియన్ జట్టు ఆరు వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌పై విజయం సాధించింది. తొలుత స్కాట్లాండ్ 20 ఓవర్లలో 99/8 స్కోరు చేసింది. ఫ్లెచర్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో విండీస్ 11.4 ఓవర్లలో 4 వికెట్లకు 101 పరుగులు చేసి గెలిచింది. ఈ విజయంతో రన్‌రేట్‌ను భారీగా మెరుగుపర్చుకొన్న వెస్టిండీస్ టోర్నీలో సెమీస్ ఆశలు సజీవంగా నిలబెట్టుకోగా.. వరుసగా రెండో ఓటమితో స్కాట్లాండ్ పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

కోచ్‌గా శ్రీజేష్‌కు తొలి పరీక్ష

జొహార్ కప్‌నకు భారత జూ.హాకీ జట్టు ఎంపిక

బెంగళూరు: సుల్తాన్ ఆఫ్ జొహార్ కప్ కోసం భారత జూనియర్ హాకీ జట్టును ఆదివారం ప్రకటించారు. 18 మంది సభ్యుల జట్టుకు అమీర్ అలీని కెప్టెన్‌గా, రోహిత్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. మలేసియాలో ఈనెల 19 నుంచి జొహార్ కప్ జరగనుంది. ఇటీవలే అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన గోల్ కీపర్ శ్రీజేష్‌కు హెడ్ కోచ్‌గా ఇదే తొలి టోర్నీ కానుంది.



ముకేష్ అదరహో

షూటింగ్ వరల్డ్‌కప్‌లో ఏడో పతకం కైవసం

లిమా (పెరు): జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్‌లో గుంటూరు యువ షూటర్ నేలవల్లి ముకేష్ వరుస పతకాలతో సంచలనం సృష్టిస్తున్నాడు. ఇప్పటికే 5 స్వర్ణాలు, ఓ కాంస్యం నెగ్గిన ముకేష్ తాజాగా మరో కాంస్యం దక్కించుకొని పతకాల సంఖ్యను ఏడుకు పెంచుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల పిస్టల్ 50 మీటర్ల విభాగంలో ముఖేష్ 548 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచాడు. ఇమ్రాన్ (అజర్‌బైజాన్) 552 పాయింట్లతో అగ్రస్థానం సాధించగా, లూకా జోల్దియా (రొమేనియా) 550 పాయింట్లతో ద్వితీయ స్థానం పొందాడు. జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్ ఒకే టోర్నీలో ఏడు పతకాలు సాధించిన తొలి ఏపీ షూటర్ ముకేషే. ఇక, ఈ వరల్డ్‌కప్‌లో భారత్ ఇప్పటివరకు 13 స్వర్ణాలు సహా 23 మెడల్స్ నెగ్గి పతకాల పట్టికలో టాప్‌లో కొనసాగుతోంది.

సింగపూర్ ఓపెన్ విజేత పంకజ్

న్యూఢిల్లీ: భారత ఏస్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీ సొంగే సింగపూర్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో పంకజ్ 5-1తో జేడెన్ ఓంగ్ (సింగపూర్)పై గెలిచాడు. తుది పోరుకు చేరే క్రమంలో క్వార్టర్స్‌లో వరల్డ్ స్నూకర్ చాంపియన్ డెచావత్ పూమ్‌జేంగ్ (థాయ్‌లాండ్)ను అడ్వాణీ 4-3తో ఓడించాడు.

బిజినెస్

ఎస్‌బీఐలో 10,000 కొలువులు

ఈ ఆర్థిక సంవత్సరంలోనే నియామకాలు
బ్యాంక్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా దాదాపు 10,000 మంది ఉద్యోగులను నియమించుకోనుంది. సాధారణ బ్యాంకింగ్ అవసరాలను తీర్చుకోవడానికే కాకుండా తన సాంకేతిక సామర్థ్యాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి గాను ఈ నియామకాలకు సిద్ధమవుతోంది. మెరుగైన కస్టమర్ సర్వీస్ సహా తన డిజిటల్ చానల్స్ బలోపేతానికి టెక్నాలజీపై బ్యాంకు భారీగా పెట్టుబడి పెట్టింది. "టెక్నాలజీ వైపే కాకుండా సాధారణ బ్యాంకింగ్‌లో మా సిబ్బందిని పెంచుకుంటున్నాం. ప్రవేశస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు దాదాపు 1,500 మంది టెక్నాలజీ సిబ్బంది నియామకానికి సంబంధించి ఇటీవలే ప్రకటన చేశాం" అని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. ఈ నియామకాల్లో డేటా సైంటిస్టులు, డేటా ఆర్కిటెక్ట్స్, నెట్‌వర్క్ ఆపరేటర్స్ వంటి ప్రత్యేక ఉద్యోగాలున్నట్టు తెలిపారు. మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమకు 8,000 నుంచి 10,000 మంది అవసరం ఉందని ఉందన్నారు. మారుతున్న కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా అన్ని స్థాయిల్లోని ప్రస్తుత ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నట్టు శెట్టి పేర్కొన్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 600 శాఖలను దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు శెట్టి తెలిపారు. 2024 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఎస్‌బీఐకి 22,542 శాఖలున్నాయి. ఈ ఏడాది మార్చి నాటికి బ్యాంకు మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,32,296గా ఉంది.

ఈసారీ వడ్డీ రేట్లు యథాతథమే!

నేటి నుంచి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ

ముంబై: దేశంలో కీలక వడ్డీ రేట్లు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన జరిగే ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలోనూ కీలక రెపో రేటు తగ్గించే అవకాశం లేదని ఆర్థిక నిపుణుల అంచనా. ఈ నెల 9న (బుధవారం) ఆర్‌బీఐ గవర్నర్ దాస్.. ఎంపీసీ భేటీ వివరాలను మీడియాకు వివరిస్తారు. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగిస్తోంది. పరిస్థితులు అనుకూలిస్తే డిసెంబరులో జరిగే ఎంపీసీ సమావేశంలోనే రెపో రేటు పావు శాతం మేర తగ్గించే అవకాశం ఉందని నిపుణుల అంచనా.

హైదరాబాద్‌లో ఉత్పత్తి యూనిట్

ఎక్సికామ్

న్యూఢిల్లీ: దేశీయ ఈవీ చార్జింగ్ సొల్యూషన్స్ కంపెనీ ఎక్సికామ్ హైదరాబాద్‌లో డీసీ ఫాస్ట్ చార్జర్ల యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇటీవల కొనుగోలు చేసిన అమెరికా డీసీ ఫాస్ట్ చార్జింగ్ టెక్నాలజీ సంస్థ ట్రిటియం రూపొందించిన టెక్నాలజీతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని ఎక్సికామ్ ఎండీ అనంత్ నహతా చెప్పారు. వచ్చే ఏడాది చివరికల్లా ఈ యూనిట్ ఏర్పాటు పూర్తవుతుందన్నారు. ఎక్సికామ్.. ట్రిటియం టెక్నాలజీని 3.7 కోట్ల డాలర్లకు (సుమారు రూ.310 కోట్లు) కొనుగోలు చేసింది.

నిధుల వేటలో రిలయన్స్ గ్రూప్

రూ.17,600 కోట్ల సమీకరణ షురూ



న్యూఢిల్లీ: ఇన్వెస్టర్లు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలను నిండా ముంచిన అనిల్ అంబానీ నిర్వహణలోని రిలయన్స్ గ్రూప్ మళ్లీ నిధుల వేటలో పడింది. వ్యాపార అభివృద్ధి కోసమంటూ ఈ గ్రూప్‌లోని రెండు లిస్టెడ్ కంపెనీలు.. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ పవర్ లిమిటెడ్ రూ.17,600 కోట్లు సమీకరిస్తున్నాయి. గత రెండు వారాల్లో ఈ కంపెనీలు ఈక్విటీ షేర్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా రూ.4,500 కోట్లు, వర్డే పార్ట్‌నర్స్ అనే అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థకు ఈక్విటీ లింక్ ఫారిన్ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్స్ (ఎఫ్‌సీసీబీ) జారీ చేయడం ద్వారా మరో రూ.7,100 కోట్లు సమీకరించాయి. తాజాగా క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ఇష్యూ ద్వారా మరో రూ.6,000 కోట్లు సమీకరించేందుకు ఈ రెండు కంపెనీలు సిద్ధమయ్యాయి.

రూ.50,000 కోట్ల పెట్టుబడులు: తండ్రి ధీరూభాయ్ అంబానీ మరణానంతరం ఆస్తుల పంపకం దగ్గర అన్న ముకేశ్ అంబానీతో గొడవపడి అనిల్ అంబానీ దాదాపు అన్ని వ్యాపారాల్లోనూ దివాలా తీశారు. ఈ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లు కొన్న మదుపరులతో పాటు ఈ కంపెనీలకు అప్పులిచ్చిన బ్యాంకులూ, ఆర్థిక సంస్థలూ తీవ్రంగానే నష్టపోయాయి. ఇప్పుడు ఈ కంపెనీలన్నీ అన్నీ అనిల్ అంబానీ పట్టు నుంచి వెళ్లి పోయాయి. ప్రస్తుతం రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ మాత్రమే అనిల్ చేతిలో ఉన్నాయి. పాత బకాయిలు వసూలు కావడం, రుణాల పునర్ వ్యవస్థీకరణతో ఇప్పుడు ఈ రెండు సంస్థల మీద పెద్దగా అప్పుల బాధ లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రూ.50,000 కోట్లతో వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఈ రెండు కంపెనీలను మళ్లీ పట్టాలెక్కిస్తామని రిలయన్స్ గ్రూప్ చెబుతోంది

వాటాదారుల ఆమోదమే తరువాయి: నిధుల సమీకరణకు సంబంధించిన తీర్మానాలకు రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ కంపెనీల డైరెక్టర్ల బోర్డులు ఇప్పటికే ఆమోదం తెలిపాయి. అప్పుల భారం లేకపోవడంతో వాటాదారులు కూడా ఈ నెలాఖరుకల్లా ఇందుకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని రెండు కంపెనీల అధికార వర్గాల అంచనా. తండ్రి అనిల్ స్థానంలో కొడుకు అన్మోల్ బాధ్యతలు చేపట్టినా దేశీయ ఇన్వెస్టర్లు ఎవరూ రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో బాగా రిస్క్ తీసుకునేందుకు సిద్ధపడే విదేశీ పీఈ సంస్థలు మాత్రమే ఈ రెండు కంపెనీల ఈక్విటీలో వాటా తీసుకునేందుకు ముందుకు వస్తున్నట్టు సమాచారం.

అంతా అన్మోల్ మహత్యం

కొగా రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ కంపెనీల బోర్డుల నుంచి సెబీ.. అనిల్ అంబానీని సాగనంపింది. ఆయన క్యాపిటల్ మార్కెట్ నుంచి కొత్తగా నిధులు సమీకరించేందుకూ వీల్లేదని వేటు వేసింది. దీంతో కుమారుడు జై అన్మోల్ అంబానీ ఈ రెండు కంపెనీల నాయకత్వ బాధ్యతలు చేపట్టి కొంతమేరకు గాడిలో పెట్టి నిధుల సేకరణకు పూనుకున్నారు. అయితే తండ్రిలా ఈయనకి లగ్జరీ కార్లంటే మహా పిచ్చి. ఈ పిచ్చిలో పడి తండ్రిలా వ్యాపారాల్ని మళ్లీ భ్రష్టుపట్టిస్తారా? లేక గట్టెక్కిస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

25,400 పైన బుల్లిష్

(అక్టోబరు 7-10 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 26,135-24,967 పాయింట్ల మధ్యన కదలాడి 1,130 పాయింట్ల నష్టంతో 25,015 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,375, 25,769, 25,729, 25,435 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25,400 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,600
నిరోధ స్థాయిలు: 25,225, 25,325, 25,400 (25,125 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,800, 24,700, 2,4600 (24,900 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	523	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	120
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	124
కర్నూలు	114	నెల్లూరు	124
విశాఖపట్నం	115	అనంతపురం	124
గోదావరి	120		

అంతర్జాతీయ పరిణామాలతోనే దిశ!

అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులతో క్రూడాయిల్ ధరలు ఇప్పటికే పెరిగాయి. మరోవైపు ఉద్దీపన పథకంతో చైనా మార్కెట్లకు విదేశీ సంస్థాగత మదుపరులు తరలిపోతున్నారు. కాబట్టి ఇన్వెస్టర్లు బలమైన ఫండమెంటల్స్‌తో ఆకర్షణీయ ధరల్లో లభించే షేర్లను కొనుగోలు చేయాలి. గత వారం సెన్సెక్స్, నిఫ్టీ 4 శాతం మేర పతనం కావటంతో అన్ని రంగాల సూచీలు కూడా నష్టాల్లోనే క్లోజయ్యాయి.

స్టాక్ రికమండేషన్స్

జొమాటో: టర్న్ అరౌండ్ అయిన తర్వాత ఈ షేరు జోరును ప్రదర్శిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా 12 శాతం మేర కరెక్షన్ జరిగింది. ప్రతి త్రైమాసికంలో ఈపీఎస్, సేల్స్ పెరుగుతుండటం గమనార్హం. గత శుక్రవారం 2.34 శాతం లాభంతో రూ.275 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.270 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ పవర్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాల్లో కొనసాగుతోంది. సెప్టెంబరు స్వింగ్ లో పాయింట్ నుంచి చక్కటి మూమెంటమ్ కనబరుస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 1.77 శాతం లాభంతో రూ.1,890 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి 1,860 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,840 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేకే పేపర్: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో కరెక్షన్ జరిగింది. దాదాపు 30 శాతం మేర పతనమైంది. ఆగస్టు నుంచి కన్సాలిడేషన్ జరగటంతో చక్కని బేస్ ఏర్పడింది. గత శుక్రవారం భారీ వాల్యూమ్‌తో ఈ షేరు 5.3 శాతం లాభంతో రూ.490 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు రూ.475 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.550/600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.540 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

స్ట్రైడ్స్ ఫార్మా: టర్న్ అరౌండ్ తర్వాత ఈ షేరు దూసుకుపోతోంది. ఈ మధ్యనే పదేళ్ల నాటి గరిష్ఠాన్ని అధిగమించింది. జీవితకాల గరిష్ఠాల్లో కన్సాలిడేషన్ జరుగుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ పతనమైన దశలోనూ ఈ షేరు బలం ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం 2.32 శాతం లాభంతో రూ.1,475 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,450/1,430 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,550/1,590 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,400 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పాలసీ బజార్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన అనంతరం ఈ కౌంటర్‌లో ఒక్కసారిగా డౌన్‌ట్రెండ్ కనబరిచింది. మళ్లీ ఈ షేరు పుంజుకోవటం మొదలైంది. నిఫ్టీతో పోలిస్తే రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,713 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,700 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,675 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

25,000 వద్ద నిలదొక్కుకోవడం కీలకం


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం 26,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై వారం అంతా కరెక్షన్ ధోరణిలోనే ట్రేడయి చివరికి 1,160 పాయింట్ల నష్టంతో వారం కనిష్ఠ స్థాయిలో 25,000 చేరువలో క్లోజయింది. గత మూడు వారాల రికార్డు పరుగు అనంతరం బలమైన కరెక్షన్‌లో ప్రవేశించిన నిఫ్టీ రెండు వారాల లాభాలన్నింటినీ తుడిచిపెట్టింది. రెండేళ్లలో ఏర్పడిన (2022 జూన్ తర్వాత) భారీ కరెక్షన్ ఇదే. మిడ్‌క్యాప్ సూచీ కూడా గత వారం 1,900 పాయింట్లకు పైగా నష్టపోయి 58,000 స్థాయిలో ముగియగా స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 480 పాయింట్లు నష్టపోయింది. ఈ రివర్సల్‌తో మార్కెట్ స్వల్పకాలిక ర్యాలీకి విరామం ఇచ్చినట్టయింది. గత వారం నిట్టనిలువుగా దిగజారినందు వల్ల సానుకూలత కోసం మరింత నిలదొక్కుకోవడం అవసరం. నిఫ్టీ ప్రస్తుతం కీలక స్థాయి 25,000 వద్ద ఉంది.

బుల్లిష్ స్థాయిలు: సానుకూల ధోరణిలో ట్రేడయితే మరింత పురోగమించేందుకు ప్రధాన నిరోధం 25,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 25,550, 25,800. మార్కెట్ తీవ్ర ఆటుపోట్లలో ఉన్నందు వల్ల తొలుత నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: భద్రత కోసం ప్రస్తుత మద్దతు స్థాయి 25,000 కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనత ముప్పు ఎదుర్కొంటుంది. దిగువన మద్దతు స్థాయిలు 24,700, 24,450. గత కొద్ది వారాల్లో ఏర్పడిన బాటమ్ స్థాయిలివే.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం 2,370 పాయింట్ల మేరకు భారీ కరెక్షన్ సాధించి 5,1460 వద్ద క్లోజయింది. గతంలో ఏర్పడిన ప్రధాన టాప్ 53,300 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమయింది. ఇది స్వల్పకాలిక బలహీనత సంకేతం. సానుకూలత కోసం ఇండెక్స్ ప్రధాన నిరోధం 52,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 51,300కన్నా పైన నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 50,800.

పాటర్న్: నిఫ్టీ గత వారం దిగువకు రివర్సల్ పాటర్న్ సాధించింది. అప్రమత్తత అవశ్యం. గత వారం తీవ్రమైన ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకుంది. 25 డీఎంఏ కన్నా దిగజారి 50 డీఎంఏకు చేరువవుతోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,100, 25,160
మద్దతు	24,950, 24,860

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మెరీనా బీచ్‌లో విషాదం

చెన్నై ఎయిర్ షోలో అపశ్రుతి.. ఐదుగురి దుర్మరణం

100 మంది ఆస్పత్రి పాలు.. ఎండ వేడి, ఉక్కపోతతో సొమ్మసిల్లిన వైనం

ఆదివారం కావడంతో ఉదయం నుంచే ప్రదర్శనకు పోటెత్తిన జనం

15 లక్షల మందికి పైగా రావడంతో జనసంద్రంగా మారిన తీరం

2

సోమవారం | 7-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 191 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్



యువతికి నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్, సీఎస్ శాంతికుమారి. చిత్రంలో మంత్రులు పొన్నం, పొంగులేటి, కోమటిరెడ్డి, సురేఖ

ఎవరు అడ్డొచ్చినా ఆగదు

మూసీ ప్రక్షాళన చేసి తీరతాం

తరాల తరబడి పేదలు మురికిలోనే జీవించాలా?

వారి జీవన విధానంలో మార్పు రావద్దా?

ఇళ్లు కోల్పోయేవారి బాధలు నాకు తెలియవా?

హరీశ్, కేటీఆర్, ఈటలను వారం రోజులు పేదల మధ్య ఉంచితే సమస్యలు అర్థమవుతాయి

రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ఏమైందో చూశాం

నోటిఫికేషన్లు ఇచ్చి నియామకాల్ని విస్మరించారు

పది నెలల్లో 60 వేల నియామకాలు చేశాం

ముఖం చెల్లక కేసీఆర్ ఎక్కడున్నారో!: సీఎం

1635 మందికి నియామక పత్రాల అందజేత

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మూసీలో మురికిని తొలగించేందుకే ప్రక్షాళన కార్యక్రమం చేపట్టామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎవరు అడ్డొచ్చినా ఇది ఆగదని స్పష్టం చేశారు. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నవారు.. ఏళ్ల తరబడి మూసీ మురికి కూపంలో జీవిస్తున్న వారి గురించి ఆలోచించాలన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో దుర్భర జీవితం గడుపుతున్న పేదల బాధలు అర్థం చేసుకోరా? తరాలన్నీ మూసీ మురికిలోనే జీవించాలా? వారి జీవన విధానంలో మార్పు రావద్దా? అని ప్రశ్నించారు. తాను జడ్పీటీసీ నుంచి ఇక్కడిదాకా వచ్చానని, పేదల మధ్యనే ఉంటూ.. వారి ఇబ్బందులు తెలుసుకోలేనా? అని అన్నారు. ఇల్లు కోల్పోయిన నిరుపేద కుటుంబాల బాధలు తనకు అర్థమవుతాయన్నారు. ఆదివారం.. రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, సివిల్, ఈఎన్‌సీ, మిషన్ భగీరథ, ప్రజారోగ్య, మునిసిపల్, గిరిజన సంక్షేమ, ఆర్‌అండ్‌బీ విభాగాలకు సంబంధించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైన 1,635 మందికి ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా శిల్ప కళా వేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "గంగా, యమున, సరస్వతి, కావేరి వంటి నదుల పేర్లను మన ఆడబిడ్డలకు పెట్టుకుంటున్నాం. మూసీ నది కంపు కొడుతూ, విషం చిమ్ముతుంది కాబట్టే ఆ పేరు ఎవరూ పెట్టుకోవడంలేదు. ఆ మూసీ మురికిని నేను

మిగతా 9వ పేజీలో...

బ్యాక్‌లాగ్‌కు చెక్



ముందు స్కూల్ అసిస్టెంట్.. తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్ల జాబితా

ఎవరైనా రెండింటికీ ఎంపికైతే వారికి స్కూల్ అసిస్టెంట్ కొలువు

ఎస్జీటీ పోస్టుకు రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికి దక్కనున్న అవకాశం

ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా నేడు.. 9న ఎల్బీ స్టేడియంలో పత్రాలు ఇవ్వనున్న సీఎం

10

మోదీజీ.. రుణమాఫీ లెక్కలివిగో..

రైతుల ఖాతాల్లో 17,869 కోట్లు వేశాం

22 లక్షలమందిని రుణ విముక్తుల్ని చేశాం

మాఫీపై మీ వ్యాఖ్యలు చాలా బాధాకరం

రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు

ప్రధానికి సీఎం రేవంత్ బహిరంగ లేఖ

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు తప్పుడు హామీలు ఇస్తాయని.. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇచ్చిన హామీలు అమలు చేసి చూపుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తామని రైతులకు హామీ ఇచ్చామని, అధికారంలోకి వచ్చాక దాన్ని నిలబెట్టుకున్నామని తెలిపారు. కేవలం 27 రోజుల వ్యవధిలోనే 22,22,067 మంది రైతుల ఖాతాల్లో రూ. 17,869.22 కోట్లు జమచేసి రైతులను రుణవిముక్తులను చేశామని వివరించారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్రలో శనివారం నిర్వహించిన

మిగతా 9వ పేజీలో...

ఢిల్లీ చేరిన ముఖ్యమంత్రి రేవంత్

ఉగ్రవాదంపై సదస్సులో పాల్గొననున్న సీఎం

వరద సాయంపై కేంద్ర మంత్రుల వద్దకు..!

9

50% రైతులకు కూడా రుణమాఫీ కాలేదు

మాఫీపై తప్పుదారి పట్టిస్తున్నారు

సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ

యువత నిలదీయాలని పిలుపు

9



ఆహార భద్రతా విభాగం ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వీధి వ్యాపారులు

ఇడ్లీ బండికీ రిజిస్ట్రేషన్

వీధి ఆహార విక్రయదారులందరికీ తప్పనిసరి

వ్యాపారులు ఎఫ్ఎస్ఎస్ చట్టంలోకి.. భోజన పదార్థాల శుచి, శుభ్రతపై శిక్షణ

రూ.100తో ధ్రువపత్రం!.. తొలుత హైదరాబాద్‌లో, తర్వాత రాష్ట్రమంతటా..

25 వేల మందికి ప్రయోజనం.. దేశంలోనే తొలిసారి.. ప్రభుత్వ కీలక నిర్ణయం

హైదరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉదయం అల్పాహారం.. మధ్యాహ్నం భోజనం.. వీలైతే రాత్రికి కూడా.. బయటే తింటున్న రోజులివి..! దీనికితగ్గట్లే ఆన్‌లైన్ ఆహార పదార్థాల పంపిణీ సేవలు..! ఈ క్రమంలో రాష్ట్రంలో రోజురోజుకు ఆహారాన్ని విక్రయించేవారి సంఖ్య పెరుగుతోంది. వీరిలో వీధుల్లో అమ్మేవారూ ఉన్నారు. హైదరాబాద్‌లో అయితే గల్లీకో టిఫిన్ సెంటర్.. బజారుకో కర్రీ పాయింట్..! ఇలాంటి పరిస్థితుల్లో మరి శుచి, శుభ్రత సంగతి..? ఈ నేపథ్యంలోనే ప్రజలకు సురక్షిత ఆహారాన్ని అందించే విషయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వీధుల్లో ఆహారాన్ని విక్రయించే (స్ట్రీట్ ఫుడ్ వెండర్స్) వ్యాపారులందరినీ ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (ఎఫ్ఎస్ఎస్ యాక్ట్) పరిధిలోకి తేనుంది. వీరందరికీ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేసింది. అంటే.. మన వీధిలోని ఇడ్లీ బండి నుంచి మార్కెట్లోని గప్‌చిప్ బండి వ్యాపారి వరకు అందరూ

మిగతా 10వ పేజీలో...

మళ్లీ వీఆర్‌వోల సేవలు

ప్రతి రెవెన్యూ గ్రామానికి ఓ అధికారి

కొత్త చట్టం రాకముందే పునరుద్ధరణ

దేశానికి రోల్‌మోడల్‌గా రూపకల్పన

ఉద్యోగుల జాబ్ చార్టుకు కమిటీ

12

17 మంది అధికార్లకు ఐఏఎస్ హోదా

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లతో భేటీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి వెల్లడి

విద్యలో ప్రపంచంతో పోటీపడదాం

రాష్ట్రంలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు

20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు

9

ఈ నెల 11న భూమి పూజ

వచ్చే దసరాకు నిర్మాణం పూర్తి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సామాన్యులే సమిధలు..

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి నేటితో ఏడాది



- ఇంకా 97 మంది బందీలు హమాస్ చెరలోనే
- యుద్ధంలో దాదాపు 42 వేల మంది మృతి

ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు మెరుపుదాడి చేసి నేటికి సరిగ్గా ఏడాది! పగబట్టిన పాములా.. హమాస్‌ను నిర్మూలించడమే లక్ష్యంగా.. సంవత్సర కాలంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సేనలు బాంబుల వర్షం కురిపిస్తూనే ఉంది!! హమాస్‌కు అండగా నిలిచిన హిజ్బుల్లా, హౌతీ తదితర ఉగ్రమూకలకూ ఊపిరిసలపని రీతిలో పోరాటాన్ని కొనసాగిస్తోంది! ఏడాది కాలంగా ఆరని చిచ్చులా కొనసాగుతున్న ఈ యుద్ధానికి కారణాలేంటంటే.. ఎవరి వాదన వారిది! ఎవరి వాదన ఎలా ఉన్నా.. దున్నల పోరులో దూడలు నలిగిపోయినట్టు.. యుద్ధంలో అంతిమంగా ఓడిపోయేది, అత్యధికంగా చచ్చిపోయేది.. అభం శుభం తెలియని సామాన్య ప్రజలే! మరీ ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ప్రధాన బాధితులు! ఈ యుద్ధంలోనూ అదే జరుగుతోంది. సరిగ్గా ఏడాది క్రితం 2023, అక్టోబరు 7న.. 'సింహత్ తోరా' సెలవు దినాన్ని ఆనందంగా గడపడానికి ఇజ్రాయెలీలందరూ సిద్ధమై ఉండగా హమాస్ మిలిటెంట్లు ఆ దేశంపై 4300కుపైగా రాకెట్ల వర్షం కురిపించారు!! కొంతమంది మిలిటెంట్లు వాహనాల్లో భూమార్గాన.. మరికొందరు పారా గ్లైడర్ల సాయంతో గగనతలం గుండా.. సరిహద్దు దాటి ఇజ్రాయెల్‌లోకి చొరబడి దొరికినవారిని దొరికినట్టు చంపేసి ఊచకోత కోశారు! దాదాపు 7000 మంది మిలిటెంట్లు 119 చోట్ల సరిహద్దులను దాటి విధ్వంస కాండ కొనసాగించారు. వారి దాడుల్లో 1139 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 38 మంది చిన్నారులు సహా 695 మంది ఇజ్రాయెల్ పౌరులు, 71 మంది విదేశీయులు, 373 మంది ఇజ్రాయెల్ భద్రతా సిబ్బంది ఉన్నారు. చనిపోయినవారిలో ఎక్కువ మంది (364 మంది) సరిహద్దులకు సమీపంలో జరిగిన నోరా ఫెస్టివల్‌కు హాజరైనవారే! అలా యుద్ధం మొదలుపెట్టిన హమాస్ మిలిటెంట్లు.. ఇజ్రాయెల్ వద్ద బందీలుగా ఉన్న పాలస్తీనియన్లను విడిపించుకోవడానికి 30 మంది చిన్నారులు సహా 251 మందిని తమతోపాటు బందీలుగా గాజా స్ట్రిప్‌కు తీసుకెళ్లిపోయారు. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ ఏడాదికాలంగా చేస్తున్న యుద్ధంలో.. కురిపించిన బాంబుల వర్షంలో.. ఆదివారం (2024, అక్టోబరు 6) నాటికి 41,825 మంది పాలస్తీనా ప్రజలు చనిపోయారు! వారిలో 16 వేల మంది చిన్నారులు, 6 వేల మందికి పైగా మహిళలు ఉన్నారు. 19 వేల మంది పిల్లలు అనాథలయ్యారు. 1000 మందికిపైగా పిల్లలు దివ్యాంగులయ్యారు. గాజాస్ట్రిప్‌లో ఉంటున్న ప్రజల్లో 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు! తినడానికి తిండి లేక.. కట్టుకోవడానికి బట్ట లేక.. ప్రాణాలు అరచేతపట్టుకుని బిక్కుబిక్కుమంటూ ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి, స్వచ్ఛందసంస్థల దాతృత్వంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎప్పుడేం జరుగుతుందో తెలియని ఉద్విగ్నభరిత, భయానక వాతావరణంలో ఉండే గాజా స్ట్రిప్‌లో ఇప్పుడు ఎటు చూసినా భారీ భవనాల శిథిలాలే! ఏ క్షణాన ఎటు నుంచి మృత్యువు వచ్చి పడుతుందో తెలియని మహా శ్మశానం అది!! అక్కడే.. ఆ భవనాల్లోనే.. ఏదో ఒక మూలన ఉన్న గది లోంచి తవ్వుకున్న నేలమాళిగలు, సొరంగమార్గాల్లో తలదాచుకున్న హమాస్ మిలిటెంట్లలో దాదాపు 60 శాతం మందిని ఏరిపారేశామని ఇజ్రాయెల్ సేనలు సగర్వంగా ప్రకటించుకున్నాయి.

60% గాజా ధ్వంసం

ఏడాదికాలంగా ఇజ్రాయెల్ జరుపుతున్న గగనతల దాడుల కారణంగా గాజా స్ట్రిప్‌లో 60% మేర ధ్వంసమైపోయినట్టు శాటిలైట్ డేటా ఆధారంగా తెలుస్తోంది. అలాగే.. 90% దాకా ప్రజలు నిరాశ్రయులై గాజాలో ఒక మూలకు పరిమితమయ్యారు. స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్తు, వైద్య సౌకర్యాలకు దూరమయ్యారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 2,27,591 గృహాలు ధ్వంసమయ్యాయని.. 68% రోడ్లు నాశనమయ్యాయని యూఎన్ శాటిలైట్ సెంటర్ విశ్లేషించింది. గాజా స్ట్రిప్‌లోని 36 ఆస్పత్రుల్లో ప్రస్తుతం 17 మాత్రమే.. అదీ పాక్షికంగా పనిచేస్తున్నాయి.

బహు ముఖ యుద్ధం...

హమాస్ కిరాతకదాడితో మొదలైన ఈ యుద్ధంలో ఇప్పుడు తాము ఏడుగురు శత్రువులతో పోరాడుతున్నామని ఇజ్రాయెల్



ఆదివారం గాజాలో ఇజ్రాయెల్ మహిళా సైనికుల సెల్ఫీ

ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం అన్నారు! ఆ ఏడుగురు శత్రువులూ.. గాజాలో హమాస్, లెబనాన్‌లో హిజ్బుల్లా, యెమెన్‌లో హౌతీలు, వెస్ట్‌బ్యాంక్‌లో ఉగ్రవాదులు, ఇరాన్, ఇరాక్, సిరియాలకు చెందిన షియా మిలిటెంట్లని ఆయన పేర్కొన్నారు. కిందటివారమే ఇరాన్ తమపై 200కు పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. వీరిలో హమాస్‌పై ఏడాదికాలంగా ఇజ్రాయెల్ సేనలు నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గాజా స్ట్రిప్‌లో ఎందరో సామాన్యపౌరులు ప్రాణాలు కోల్పోతున్నా వారు వెనక్కి తగ్గట్లేదు. ఇక, హమాస్ తర్వాత ఐడీఎఫ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నది హిజ్బుల్లాపై. లెబనాన్‌కు చెందిన ఈ మిలిటెంట్ గ్రూపు నేతల పేజర్లను ఏకకాలంలో పేల్చేయడం ద్వారా ఇజ్రాయెల్ సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. అంతటితో ఆగక.. హిజ్బుల్లా అగ్రనాయకత్వంపైనా దృష్టి పెట్టి తొలుత ఆ సంస్థ చీఫ్ నస్రల్లాను, అతడి తర్వాత పగ్గాలు చేపట్టిన మరో నేతను కూడా మట్టుబెట్టి ఇజ్రాయెల్ సంచలనం సృష్టించింది. ఇక.. దక్షిణ దిక్కున యెమెన్ నుంచి డ్రోన్లు, మిసైళ్లతో విరుచుకుపడుతున్న హౌతీలనూ ఇజ్రాయెల్ వదిలిపెట్టట్లేదు. ఇరాక్, సిరియాల నుంచి దాడులు చేస్తున్న షియా మిలీషియా బేస్‌లను ధ్వంసం చేస్తోంది. వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఇరాన్ అండతో చెలరేగుతున్న పాలస్తీనా ఉగ్రవాదులపైనా దాడులు చేస్తోంది. నేరుగా తమపై దాడికి దిగిన ఇరాన్‌ను దీటుగా ఎదుర్కొంది. ఆ దేశం ప్రయోగించిన ఖండాంతర క్షిపణులను సైతం తన యారో-3 రక్షణ వ్యవస్థతో కుప్పకూల్చింది.

\- సెంట్రల్ డెస్క్

బందీలెక్కడ?

ఏడాది క్రితం హమాస్ చెరబట్టిన 251 మంది బందీల్లో.. ఇప్పటిదాకా 117 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో 108 మందిని.. ఇజ్రాయెల్ జైళ్లల్లో ఉన్న 240 మంది పాలస్తీనావాసుల విడుదలకు బదులుగా హమాస్ మిలిటెంట్లే ఆరు దశలుగా విడిచిపెట్టారు. తొమ్మిది మంది ఐడీఎఫ్ రెస్క్యూ ఆపరేషన్లలో బయటపడ్డారు. మరో 37 మంది చనిపోయారు. ఇంకా 97 మంది హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. వారిలోనూ 64 మంది మాత్రమే ప్రాణాలతో ఉన్నట్టు.. 33 మంది చనిపోయినట్టు సమాచారం. అయితే.. ఇజ్రాయెల్ మాత్రం బందీల సంఖ్య 101 అని (నిరుడు హమాస్ చేతికి చిక్కిన 97 మందితోపాటు, గతంలో బందీలైన మరో నలుగుర్ని కూడా కలిపి) ప్రకటిస్తోంది. అయితే, ఆ నలుగురిలోనూ ఇద్దరు చనిపోయినట్టు సమాచారం. అంటే.. మొత్తం 35 మంది మృతదేహాలు ఇంకా హమాస్ వద్దనే ఉన్నట్టు.

లోకం తీరు



గాజాలో మసీదుపై దాడి 26 మంది మృతి

లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ఐఆర్‌జీసీ ఖుద్స్ ఫోర్స్ చీఫ్ ఖానీ హతం!

టెల్ అవీవ్, గాజా, అక్టోబరు 6: సెంట్రల్ గాజా డెయిల్ అల్ బలాహ్ పట్టణంలోని అల్ అక్సా ఆసుపత్రికి సమీపంలో ఉన్న మసీదుపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 26 మంది చనిపోయారు. మరోవైపు హమాస్ దాడి జరిపి ఏడాది అయిన సందర్భంగా గాజా సమీప ప్రాంతాల్లో ఇజ్రాయెల్ అదనపు బలగాలను మోహరించింది. అయినా గాజా నుంచి ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు దూసుకువచ్చాయని ఐడీఎఫ్ తెలిపింది. ఇజ్రాయెల్ దక్షిణభాగంలోని బీర్షెబా ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదులదాడిలో ఒకరు చనిపోయారు. పలువురు గాయపడ్డారు. ఉగ్రవాదిని ఇజ్రాయెల్ బలగాలు కాల్చి చంపాయి. మరోవైపు, ఇరాన్‌కు మరో కోలుకోలేని దెబ్బ తగిలింది. బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఇరానియన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) ఖుద్స్ ఫోర్స్ చీఫ్ ఇస్మాయిల్ ఖానీ హతమయ్యాడు. నస్రల్లా మరణం తర్వాత హిజ్బుల్లా కొత్త చీఫ్‌గా బాధ్యతలు హాషిమ్ సఫీద్దీన్‌తో ఇస్మాయిల్ ఖానీ భేటీ అయినప్పుడే ఇజ్రాయెల్ దాడి చేసి ఇద్దరినీ మట్టుబెట్టిందని ప్రచారం జరుగుతోంది. ఇరాన్ తరఫున ఇజ్రాయెల్‌పై పోరాడుతోన్న హిజ్బుల్లా, హమాస్, హౌతీ, ఇతర మిలీషియా గ్రూపుల సమన్వయ పనులను ఇస్మాయిల్ ఖానీయే చూస్తున్నారు. అయితే దీనిపై ఇరాన్, హిజ్బుల్లాల నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా, గాజాలో దాడుల నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఇజ్రాయెల్‌కు ఆయుధాల సరఫరాను నిలిపివేయాలన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మ్యాక్రాన్‌పై నెతన్యాహు మండిపడ్డారు. ఇరాన్ ప్రేరేపిత అరాచక శక్తులతో తాము ఏకకాలంలో ఏడు చోట్ల పోరాటం చేస్తుంటే ఆయుధాల సరఫరా నిలిపివేస్తామనడం సిగ్గుచేటన్నారు.

డిజిటల్ అరెస్టు ఉత్తదే!

- వీడియో కాల్‌తో సీబీఐ, ఈడీ, పోలీసులు అరెస్టు చేయరు
- ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ స్పష్టం

న్యూఢిల్లీ, అక్టోబరు 6 : సీబీఐ, పోలీసులు, కస్టమ్స్ విభాగం, ఈడీ లేదా జడ్జిలు వీడియో కాల్ ద్వారా ఎవరినీ అరెస్టు చేయరని భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్టు పేరిట దేశంలో పెరిగిపోతోన్న మోసాలను దృష్టిలో ఉంచుకుని ఈమేరకు ప్రజలను అప్రమత్తం చేస్తూ శనివారం వివరణ జారీ చేసింది. డిజిటల్ అరెస్టు అనేది మోసం అని తెలిపింది. వాట్సాప్, స్కైప్ వంటి వీడియో కాల్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. వీటిపై ప్రజలు సెంట్రల్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ తెలియజేసింది. మోసగాళ్లు బాధితులకు ఎస్ఎమ్మెస్ పంపడం లేదా వీడియో కాల్ చేయడం ద్వారా తాము ఫలానా ప్రభుత్వ ఏజెన్సీ అధికారులమని నమ్మిస్తున్నారు. తర్వాత ఆ వ్యక్తి లేదా అతని కుటుంబసభ్యులను డ్రగ్స్ లేదా మనీ లాండరింగ్ వంటి నేరాల్లో పట్టుకున్నట్లు చెప్పి డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే ఆన్‌లైన్‌లో డబ్బు పంపించమని

మహిళా సర్పంచ్‌ను తొలగించడం చిన్న విషయం కాదు: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 6: ప్రజలు ఎన్నుకున్న ఓ మహిళా సర్పంచ్‌ను తొలగించడం సాధారణ విషయం కాదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఆమెపై అనర్హతను కొట్టివేస్తూ, సదరు మహిళ సర్పంచ్‌గా కొనసాగేలా ఆదేశాలిచ్చింది. మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలోని విచ్‌ఖేడా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మనీశ్ రవీంద్ర పంపాటిల్ అనే మహిళ సేవలందిస్తున్నారు. ఆమె తన అత్తతో కలిసి ప్రభుత్వ భూమిలో కట్టిన ఇంట్లో నివాసం ఉంటోందని కొందరు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దాంతో ఆమెను సర్పంచ్‌గా తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. తనపై వచ్చిన ఆరోపణలను పంపాటిల్ ఖండించారు. తాను తన భర్త పిల్లలతో కలిసి అద్దె ఇంటో ఉంటున్నాని వెల్లడించారు. దీనిపై ఆ మహిళా సర్పంచ్ రిట్ పిటిషన్ వేయగా బాంబే హైకోర్టు కొట్టివేసింది. దాంతో ఆమె సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఓ మహిళ సర్పంచ్‌గా ఎన్నికవ్వడాన్ని ఆ గ్రామస్థులు కొంతమంది జీర్ణించుకోలేకపోయారని విచారణ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

భోపాల్‌లో రూ.1,814 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

- 907 కేజీల మెఫెడ్రోన్ సీజ్ చేసిన గుజరాత్ ఏటీఎస్

అహ్మదాబాద్, అక్టోబరు 6: దేశ రాజధాని ఢిల్లీలో రూ.6,500 కోట్ల విలువైన డ్రగ్స్ కుంభకోణం కలకలం ఇంకా సర్దుమణక ముందే.. భోపాల్‌లో మరో మాదకద్రవ్యాల వ్యవహారం వెలుగుచూసింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ శివార్లలోని ఓ ఫ్యాక్టరీలో రూ.1,814 కోట్ల విలువైన మెఫెడ్రోన్ (ఎండీ), దాని ముడిసరుకు భారీస్థాయిలో పట్టుబడింది. బగ్రోడా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ఫ్యాక్టరీలో శనివారం గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), ఢిల్లీలోని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సంయుక్తంగా నిర్వహించిన సోదాల్లో ఘన, ద్రవ రూపాల్లో ఉన్న 907.09 కేజీల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు ఆదివారం వెల్లడించారు. సోదాల సందర్భంగా అమిత్ చతుర్వేది (57), సన్యాల్ ప్రకాశ్ బానె (40) అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.



వెయిటర్ ఉద్యోగానికి వేల సంఖ్యలో బారులు!

- కెనడాలో రెస్టారెంట్ ముందు భారత విద్యార్థుల భారీ క్యూ

న్యూఢిల్లీ, అక్టోబరు 6: కెనడాలో ఉన్నత చదువులు చదవడానికి వెళ్లిన భారత విద్యార్థులు ఓ రెస్టారెంట్ ముందు వేల సంఖ్యలో బారులు తీరారు! ఆ రెస్టారెంట్‌లో ఫుడ్ అంత బాగుంటుందా? అనుకుంటున్నారా? అయితే పప్పులో కాలేసినట్లే. వారంతా పొట్ట నింపుకోవడానికి కాదు.. పొట్టకూటి కోసం వెళ్లారు!! భారీ సంఖ్యలో బారులు తీరింది ఉద్యోగం కోసం..! అది కూడా వెయిటర్, సర్వీస్ స్టాఫ్ పోస్టుల కోసం..! కెనడాలోని 'తందూరి ఫ్లేమ్' అనే రెస్టారెంట్ ముందు కనిపించిందీ దృశ్యం. వేల సంఖ్యలో భారతీయ విద్యార్థులు చిన్న కొలువుల కోసం క్యూలో నిలబడి పడిగాపులు పడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "ఇక్కడ ఒక్కరికి కూడా సరైన కొలువు దొరకడం లేదు. చాలా బాధగా ఉంది" అని క్యూలో ఉన్న ఓ విద్యార్థి చెప్పాడు. దీనిపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లే విద్యార్థులు ఒక్కసారి ఆలోచించుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు.

రెండు యుద్ధాలు జరుగుతుంటే.. ఐక్యరాజ్యసమితి ఎక్కడ?



న్యూఢిల్లీ, అక్టోబరు 6: ప్రపంచంలో నేడు రెండు యుద్ధాలు జరుగుతుంటే.. ఐక్యరాజ్యసమితి ఎక్కడుందని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ప్రశ్నించారు. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో మూడు రోజులు నిర్వహించిన కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్‌లో చివరి రోజైన ఆదివారం ఆయన ప్రసంగించారు. యుద్ధాలు జరుగుతుంటే ఐక్యరాజ్యసమితి ప్రేక్షక పాత్రకే పరిమితమైందని, మార్కెట్‌లో మనుగడలేని ఒక పాత కంపెనీ లాగా దాని తీరు ఉందని జైశంకర్ వ్యాఖ్యానించారు. సంక్షోభాలను పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేకపోతోందని పేర్కొన్నారు. భద్రతామండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల సంఖ్యను పెంచడం సహా ఐక్యరాజ్యసమితిని సంస్కరించాలని గత కొన్నేళ్లుగా భారత్ డిమాండ్ చేస్తోంది.

నవరాత్రులు కదా! ఉపవాసం చేస్తున్నా..

ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, హంగేరియన్-అమెరికన్ బిలియనీర్ జార్జ్ సోరోస్‌లలో ఎవరితో డిన్నర్‌కు ప్రాధాన్యం ఇస్తారనే ప్రశ్నకు జైశంకర్ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూ సందర్భంగా జైశంకర్‌ను ఈ విధంగా ప్రశ్నించగా.. 'ప్రస్తుతం నవరాత్రులు కదా!.. నేను ఉపవాసంలో ఉన్నా' అని నవ్వుతూ జైశంకర్ సమాధానం ఇచ్చారు. కాగా, జార్జ్ సోరోస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తీవ్రంగా విమర్శిస్తుంటారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు జార్జ్ సోరోస్ నిధులు సమకూరుస్తున్నారని బీజేపీ తరచుగా ఆరోపిస్తోంది.

బీజేపీ రాష్ట్రాల్లో ఉచిత కరెంటు ఇస్తారా?

- ఇస్తే మీ తరఫున ప్రచారం చేస్తా
- ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్



న్యూఢిల్లీ, అక్టోబరు 6: దేశంలో బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో ఉచిత కరెంటు ఇస్తారా అని ప్రధాని మోదీకి ఆప్ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఆయా రాష్ట్రాల్లో ఉచితంగా కరెంటు ఇస్తే బీజేపీ తరఫున తాను ఎన్నికల ప్రచారం చేస్తానని ప్రకటించారు. ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని.. దమ్ముంటే మహారాష్ట్ర, జార్ఖండ్‌లతో పాటే ఢిల్లీకీ నవంబరులో ఎన్నికలు జరపాలని మరో సవాల్ విసిరారు. ఆదివారం ఆయన ఢిల్లీలో నిర్వహించిన 'జనతా కీ అదాలత్' ర్యాలీలో ప్రసంగించారు. తన చేతిలో ఆరు స్వీట్ల ప్యాకెట్ పట్టుకున్నారు. ఈ ఆరూ ఢిల్లీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పథకాలు.. ఉచిత విద్యుత్, ఉచిత నీరు, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, వృద్ధులకు ఉచిత యాత్ర, ఉచిత ఆరోగ్యం, ఉచిత విద్య. తన చేతిలో ఉన్నటువంటి ప్యాకెట్లే ప్రజలకు పంచుతామని.. వాటిని వారు ప్రసాదంగా స్వీకరించాలని పిలుపిచ్చారు. పొరపాటున బీజేపీకి ఓటేస్తే ఈ ఉచిత ప్రయోజనాలు ఆగిపోతాయని హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీ రవాణా సంస్థ, ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను ప్రైవేటుకు అప్పగిస్తారని అన్నారు. రాష్ట్రాల్లో బీజేపీ 'డబుల్ ఇంజన్' ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. 'డబుల్ ఇంజన్ ప్రభుత్వాలంటే.. రెట్టింపు దోపిడీ, రెట్టింపు అవినీతి.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగమే' అని కేజ్రీవాల్ అన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు ఇన్సులిన్ ఆపేశారని.. కిడ్నీలు దెబ్బతిని తాను మరణించేవాడినని అన్నారు.

తెలంగాణ సహా 9 రాష్ట్రాల్లో ఈడీ సోదాలు

- భారీ చిట్‌ఫండ్ కుంభకోణంలో దర్యాప్తు

న్యూఢిల్లీ, అక్టోబరు 6: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఈడీ ఆకస్మిక తనిఖీలు చేపట్టడం కలకలం రేపింది. శుక్రవారం ఏకంగా 9 రాష్ట్రాల్లోని 44 ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించింది. ఇందులో తెలంగాణతో పాటు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఉన్నాయి. పెరల్స్ ఆగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్(పీఏసీఎల్)కు సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు నిర్వహించినట్టు ఈడీ తెలిపింది. తనిఖీల్లో భాగంగా పలువురి నుంచి నేరారోపణ పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు శనివారం 'ఎక్స్'లో వెల్లడించింది. కాగా, దాదాపు 5 కోట్ల మంది నుంచి సుమారు రూ. 50 వేల కోట్లు వసూలు చేసిన పీఏసీఎల్.. వారికి డిపాజిట్లు చెల్లించకుండా మోసం చేసింది. గత కొన్నేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతూనే ఉంది. పెరల్స్ గ్రూపు వ్యవస్థాపకుడు నిర్మల్‌సింగ్ ఇటీవల తిహాడ్ జైలులో కన్నుమూశారు.

చెన్నై మెరీనా బీచ్‌లో విషాదం

ఐఏఎఫ్ ఎయిర్ షోకు 15 లక్షల మంది

- ఎండ వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- ఐదుగురి మృతి.. వంద మంది ఆస్పత్రి పాలు



చెన్నై, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): అసలే ఆదివారం..పైగా బీచ్‌లో మెగా ఎయిర్‌షో..! ఇంకేముంది ఉదయం 8గంటల నుంచే చెన్నై మెరీనా బీచ్‌కు జనం పోటెత్తారు. చెన్నైతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల వారూ లక్షలాదిగా తరలిరావడంతో బీచ్‌కు వెళ్లే దారులన్నీ జనంతో కిటకిటలాడాయి. చూస్తుండగానే ఇసుకేసినా రాలనంతగా సుమారు 15లక్షల మంది పోగయ్యారు..! మరోవైపు విపరీతమైన ఎండ.. భరించలేని ఉక్కపోత.. సరిగా ఊపిరి కూడా తీసుకోలేని పరిస్థితి..! ఈ పరిస్థితుల్లో ఎయిర్‌షో ప్రారంభమైన కొద్దిసేపటికే చూస్తుండగానే సుమారు 230 వరకూ సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో వైద్య సిబ్బంది కొందరికి అక్కడే చికిత్స అందించారు. సుమారు వంద మందిని మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌ల్లో ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురై ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వంద మంది వరకూ చికిత్స పొందుతున్నారు. ఎయిర్‌షో మధ్యాహ్నమే ముగిసినప్పటికీ.. జనం లక్షలాదిగా తరలిరావడంతో ట్రాఫిక్ సాయంత్రం వరకూ కొనసాగింది. సొమ్మసిల్లి పడిపోయినవారిని అంబులెన్సుల్లో ఆస్పత్రికి తరలించడం కష్టంగా మారింది. బీచ్ సమీపంలోని లైట్ హౌస్ మెట్రో స్టేషన్, వెళచ్చేరి వద్ద ఉన్న ఎంఆర్‌టీఎస్ రైల్వేస్టేషన్లు జనంతో కిక్కిరిసిపోయాయి. కాగా, అంతకుముందు మీడియాలో మెరీనా బీచ్ వద్ద తొక్కిలాట జరిగినట్టు వదంతులు వ్యాపించడంతో ఒకింత ఆందోళన నెలకొంది. ఎయిర్‌షోకు లక్షలాదిమంది వస్తారని తెలిసినా... డీఎంకే ప్రభుత్వం తగిన వసతులు కల్పించకపోవడం వల్లే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి. జయకుమార్ ఆరోపించారు. వారి మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

కన్నులపండువగా ఎయిర్ షో

భారత వైమానిక దళం 93వ ఏట అడుగిడిన సందర్భంగా చెన్నై మెరీనా తీరంలో ఆదివారం నిర్వహించిన విన్యాసాలు కన్నుల పండుగలా సాగాయి. ఈ ప్రదర్శనను వీక్షించేందుకు సుమారు 15 లక్షల మందికిపైగా తరలివచ్చారు. దీంతో ఇదొక ప్రపంచ రికార్డుగా 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకుంది. ఆదివారం 11 గంటలకు ప్రారంభమైన ఈ విన్యాసాలు రెండు గంటలపాటు చూపరులను కట్టిపడేశాయి. తొలుత ఎం17 రకానికి చెందిన రెండు హెలికాప్టర్లు మెరుపువేగంతో ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. ఆ తర్వాత ఆకాశ్‌గంగా బృందం సభ్యులు ఉగ్రవాదుల నుంచి బందీలను విడిపించే విన్యాసాన్ని ప్రదర్శించారు. ఆరుగురు వీరులు పారాచూట్ల సాయంతో 2వేల అడుగుల ఎత్తు నుంచి జాతీయ పతకాన్ని చేతపట్టుకుని కిందకు దూకడం విస్మయపరచింది. రఫేల్, హార్వర్డ్, తేజస్, మిగ్ రకం యుద్ధ విమానాలతో చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. త్వరలో వైమానిక దళంలో చేరనున్న హెచ్‌టీటీ 40 రకం విమానం చేసిన విన్యాసం కూడా చూపరులను సంభ్రమపరిచింది. ఈ విన్యాసాలను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన సతీమణి దుర్గా స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, వైమానిక దళం ఉన్నతాధికారి చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రత్యేక వేదికపై నుంచి తిలకించారు.

భారత్‌కు ముయిజ్జు

ఐదు రోజుల పర్యటన.. నేడు ప్రధానితో సమావేశం



న్యూఢిల్లీ, అక్టోబరు 6: మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ద్వైపాక్షిక చర్చల కోసం తొలిసారి భారత్‌లోకి అడుగుపెట్టారు. సుమారు 12 మంది మంత్రులు, సీనియర్ అధికారులతో ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్న ముయిజ్జును కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ స్వాగతించారు. ఇంతకు ముందు జూన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముయిజ్జు హాజరయ్యారు. ఈసారి భారత్‌లో ఐదు రోజులు పర్యటించనున్న ముయిజ్జు.. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోదీతో సమావేశంకానున్నారు. ముంబై, బెంగళూరులో జరిగే పలు కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. ప్రధానిమోదీతో ముయిజ్జు సోమవారం సమావేశంకానున్నారు. గతేడాది నవంబరులో ముయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్‌తో ఆ దేశ సంబంధాలు దెబ్బతిన్నాయి. చైనా మద్దతుదారుగా పేరొందిన ముయిజ్జు.. తమ దేశంలోని భారత సైనికులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా న్యూఢిల్లీ బయలుదేరే ముందు బీబీసీతో మాట్లాడిన ముయిజ్జు.. ఆర్థిక సంక్షోభంలో ఉన్న మాల్దీవులకు భారత్ అండగా ఉంటుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

ఒక్కొక్కరు 10 దొంగ ఓట్లేయండి

ఎలాన్ మస్క్ తల్లి మాయె మస్క్ వివాదాస్పద ట్వీట్



న్యూయార్క్, అక్టోబరు 6: అసలే అమెరికా ఎన్నికలు.. అందులోనూ వివాదాస్పద వ్యాఖ్యలు, ప్రకటనలు చేసే మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రిపబ్లిక్ పార్టీ మరోసారి పోటీ..! ఆయనకు అపర కుబేరుడు, సామాజిక మాధ్యమం ఎక్స్ యజమాని ఎలాన్ మస్క్ మద్దతు..! ఇలాంటి పరిస్థితుల్లో మస్క్ తల్లి మాయె (76) చేసిన ట్వీట్ సంచలనం రేపింది..! 'నకిలీ పేర్లతో ఒక్కొక్కరు 10దొంగ ఓట్లేయండి.. పోలింగ్ రోజున పది బూత్‌లకు వెళ్లి హక్కును వినియోగించుకోండి.. అప్పుడు 100ఓట్లు అవుతాయి. ఇదేమీ తప్పు కాదు' అని సూచించారు. మాయె ట్వీట్‌ను 2.5 లక్షల మంది చూశారు. అయితే చాలామంది దీనిపై తీవ్రంగా స్పందించారు. అమెరికా కేంద్ర దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ), ఫెడరల్ ఎన్నికల సమాఖ్య జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మాయె ఎన్నికల్లో అక్రమాలను ప్రోత్సహిస్తున్నారంటూ మండిపడ్డారు. ఎఫ్‌బీఐని ట్యాగ్ చేస్తూ ట్వీట్లు పెట్టారు. కాగా, మాయె ట్వీట్ అమెరికా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉందంటూ 'ఎక్స్' కమ్యూనిటీ నోట్ జారీ చేసింది. అనంతరం మాయె ట్వీట్‌ను ఉపసంహరించుకున్నారు.

ట్రంప్ సభలో మస్క్

పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో జూలైలో తనపై తుపాకీ కాల్పులు జరిగిన ప్రదేశంలోనే డొనాల్డ్ ట్రంప్ తాజాగా బహిరంగ సభ నిర్వహించారు. ఇందులో ఎలాన్ మస్క్ పాల్గొన్నారు. "మేక్ అమెరికా గ్రేట్ అగైన్-మాగా (అమెరికాను మళ్లీ గొప్పగా చేద్దాం)" అనే శీర్షిక ఉన్న టోపీ, "మార్స్‌ను ఆక్రమిద్దాం" అని రాసిన టీ షర్ట్ వేసుకున్న ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.


దుబాయ్‌లో బతుకమ్మ ఉత్సవాలు

పూల పండుగ.. మన సంస్కృతికి ప్రతీక

- బతుకమ్మ మహిళా శక్తిని చాటుతుంది
- దుబాయ్ బతుకమ్మ వేడుకల్లో మంత్రి జూపల్లి
- మరో కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అర్వింద్

హైదరాబాద్/చంపాపేట(ఆంధ్రజ్యోతి)/(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)అక్టోబరు 6: ప్రపంచంలో పువ్వులను పూజించే సంస్కృతి ఒక్క తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బతుకమ్మ పండుగ మన సంస్కృతికి ప్రతీక అని తెలిపారు. దుబాయ్‌లోని క్రైరో స్ట్రీట్ ఇత్తెహాద్ స్కూల్ గ్రౌండ్‌లో తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో లెవల్ నెక్స్ట్ గోల్డ్ ఈవెంట్స్ దుబాయ్, గల్ఫ్ తెలంగాణలు సంయుక్తంగా నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బతుకమ్మ పండుగ మహిళా శక్తిని చాటుతుందని, తెలంగాణ ఉద్యమాన్ని సంఘటిత శక్తిగా మార్చడంలో బతుకమ్మ వేడుకలు ప్రత్యేక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. కాగా దుబాయ్ పర్యాటక శాఖ అధికారి జాసిం మొహమ్మద్ అల్ అవాదీతో మంత్రి జూపల్లి భేటీ అయ్యారు. ఆ దేశ పురోగతిలో పర్యాటక రంగ భూమిక గురించి మంత్రి తెలుసుకున్నారు. దుబాయ్‌లోని ఐపీఎఫ్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. సౌత్ ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు స్థానిక మహిళా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ప్రభుత్వ జేఎల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల(జేఎల్) సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పి.మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సంఘం 3వ.. రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరిస్థితులు, బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న 10+2+3 విద్యా విధానాన్ని కొనసాగించాలని, జూనియర్ కళాశాలల్లో ఉచిత విద్య కోసం నిధులను కేటాయించాలని, మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలనే తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు. అనంతరం జూనియర్ లెక్చరర్ల సంఘం ప్రతినిధులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా బలరాం జాదవ్, సంయుక్త కార్యదర్శిగా విజయశేఖర్, ఆర్థిక కార్యదర్శిగా శివప్రసాద్ ఎన్నికయ్యారు.

మా ఎమ్మెల్యే కేసీఆర్ కనబడుట లేదు

- గజ్వేల్ పోలీసులకు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

గజ్వేల్, అక్టోబరు 6: మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ పది నెలలుగా కనిపించడం లేదని, వెతికి పెట్టాలని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పోలీసులకు స్థానిక కాంగ్రెస్ నేతలు ఆదివారం ఫిర్యాదు చేశారు. కేసీఆర్ ఆచూకీని కనిపెట్టి నియోజకవర్గ ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, పార్టీ కార్యకర్తలతో కలిసి గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదాకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండారు శ్రీకాంత్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ మీరెక్కడా? అని ప్రశ్నించారు. వారం రోజుల్లో కేసీఆర్ జాడ తెలియకపోతే తామే వెతుకుతామని తెలిపారు. ఎన్నికల్లో గెలిచి పది నెలలు కావస్తున్నా నియోజకవర్గంలో ఆయన జాడలేదని పేర్కొన్నారు. ప్రజల కాలిలో ముల్లు దిగితే పంటితో తీస్తానని చెప్పి మరిచిపోయారా? అని గుర్తుచేశారు. కేసీఆర్ యోగక్షేమాలు తెలుసుకోవాల్సిన బాధ్యత ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన గజ్వేల్ ప్రజల మీద ఉందన్నారు. పోలీసులు కేసీఆర్ ఆచూకీ చెప్పకపోతే.. తామే కేసీఆర్ ఫామ్‌హౌస్‌కి స్వయంగా వెళ్లి యోగక్షేమాలు తెలుసుకుంటామని అన్నారు.

సీబీఐకి చిక్కిన పోర్టు కస్టమ్స్ అధికారి

విశాఖపట్నం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు కస్టమ్స్ హౌస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వై.శ్రీనివాస్ లంచం తీసుకుంటూ సీబీఐ అధికారులకు పట్టుబడ్డారు. దీనిపై శనివారం కేసు నమోదుచేసిన అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. కాకినాడ పోర్టు కస్టమ్స్‌హౌస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వై.శ్రీనివాస్ కాకినాడకు చెందిన శ్రీచంద్ర బల్క్ కార్గో సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సహాయపడేందుకు రూ.3.18 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఈమేరకు సీబీఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఈ నెల 5న పథకం ప్రకారం మాటువేసి కార్గో సంస్థ ప్రతినిధి పంతం భరత్‌కుమార్ నుంచి శ్రీనివాస్ లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శ్రీనివాస్‌తోపాటు లంచం ఇచ్చిన పంతం భరత్‌కుమార్‌పై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. అనంతరం శ్రీనివాస్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కస్టమ్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో రూ.22.74 లక్షలు, మరికొందరు కస్టమ్స్ అధికారుల నుంచి రూ.ఐదు లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

డబ్బు కోసం వలపు వల... ఆపై మోసాలు !

- ముఠాతో చేతులు కలిపిన విశాఖ యువతి
- తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అనేక మంది బాధితులు
- బాధితుల ఫిర్యాదుతో నిందితురాలి అరెస్టు

విశాఖపట్నం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): డబ్బున్న యువకులను లక్ష్యంగా చేసుకుని వలపు వల విసురుతూ పక్కా మోసం చేస్తున్న యువతిని విశాఖ పోలీసులు అరెస్టు చేశారు. ప్రేమ పేరుతో యువకులకు దగ్గరై.. తర్వాత బ్లాక్ మెయిల్‌చేసి డబ్బులు గుంజుతున్నట్టు గుర్తించారు. యువతి వెనుక ఓ ముఠా కూడా ఉందని పోలీసులు తెలిపారు. ఈమె బాధితుల్లో విశాఖవారే కాకుండా ఏపీ, తెలంగాణకు చెందిన వారు కూడా ఉన్నారని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఠా వివరాలు వెల్లడించారు. విశాఖలోని మురళీనగర్ ఎన్జీవో కాలనీకి చెందిన యువతి.. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో బంధువులు దత్తత తీసుకున్నారు. ఉన్నత చదువు చదివించారు. అయితే జల్సాలకు అలవాటు పడిన ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. తర్వాత ఓ ముఠాను కలిసి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో డబ్బున్న యువకులు, ఎన్ఆర్ఐలను గుర్తించి వారితో చాటింగ్ చేయడం, డిజిటల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు చేయడం నేర్చుకుంది. విదేశాల్లో ఉన్నవారు నగరానికి వచ్చినపుడు వారిని రిసీవ్ చేసుకుని రహస్య ప్రదేశాలకు తీసుకువెళ్లేది. పెర్‌ఫ్యూమ్ పేరుతో మత్తుమందు స్ప్రే చేసి, డ్రింకుల్లో మత్తుమందు కలిపి ఇచ్చి, వారితో ఏకాంతంగా గడిపినట్టు ఫొటోలు, వీడియోలు తీసి ట్రాప్‌లోకి దింపుతోంది. ఆ తర్వాత తనను పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయడం, ఏకాంతంగా ఉన్నప్పుడు తీసిన ఫొటోలు, వీడియోలను బయటపెడతామని ముఠాలోని ఇతర సభ్యులతో కలసి బ్లాక్‌మెయిల్ చేయించేది.

నక్సలిజంపై కేంద్రం ఉక్కుపాదం

280 రోజుల్లో 202 మంది నక్సల్స్ హతం.. 2026కి మావోయిస్టు రహితంగా భారత్

- నేడు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో అమిత్ షా సమీక్ష
- ఎనిమిది రాష్ట్రాల సీఎంలు, సీఎస్‌లు, డీజీపీలతో భేటీ
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ హోంమంత్రి అనిత హాజరు


మావోయిస్టుల మృతదేహాల తరలింపులో మహిళా కమాండోలు

న్యూఢిల్లీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వామపక్ష తీవ్రవాదంపై కేంద్రం ఉక్కుపాదం మోపింది. 2026 మార్చి నాటికి భారత్‌ను వామపక్ష తీవ్రవాద రహిత దేశంగా ప్రకటిస్తామన్న కేంద్రం గత పదేళ్లలో నక్సల్స్ ఏరివేతే లక్ష్యంగా ఎన్నో ఆపరేషన్లు చేసింది. మావోయిస్టుల కుంచుకోటైన ఛత్తీస్‌గఢ్‌పై ప్రత్యేకంగా గురి పెట్టింది. నక్సలిజం వైపు ప్రజలు ఆకర్షితులు కాకుండా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసింది. జనజీవన స్రవంతిలో కలిసిన వారికి భారీగా నజరానాలు ప్రకటించింది. మావోయిస్టుల వల్ల నష్టపోయిన కుటుంబాలను అక్కున చేర్చుకుంది. అందులో భాగంగానే సెప్టెంబర్ 20న ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 55 మంది మావోయిస్టు బాధితులతో సమావేశం అయ్యారు. బాధితులు షా ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా షా కీలక వ్యాఖ్యలు చేశారు. "31 మార్చి 2026 మావోయిస్టులకు చివరి రోజు. అప్పటికి వామపక్ష తీవ్రవాద రహిత భారత్‌ను చూస్తాం. బస్తర్ మళ్లీ అందంగా, శాంతియుతంగా మారుతుంది." అన్నారు. షా ప్రకటన చేసి నెలరోజులు కాకముందే ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గత శుక్రవారం నారాయణ్‌పూర్- దంతేవాడ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన కేంద్రం తన ఆపరేషన్లను ముమ్మరం చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 5 వరకు 202 మంది నక్సల్స్ హతమయ్యారని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 14,400 కి.మీ పొడవైన రోడ్లతోపాటు 6,000 మొబైల్ టవర్లు నిర్మించినట్టు కేంద్రం వెల్లడించింది.

నేడు అమిత్ షా కీలక భేటీ

దేశంలోని వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం సమావేశంకానున్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, అధికారులు హాజరవుతారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమల రావు హాజరుకానున్నట్టు సమాచారం. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు సీఎస్, డీజీపీ, ఏపీ హోమంత్రి అనితతోపాటు సీఎస్, డీజీపీ ఆదివారం రాత్రికే ఢిల్లీ చేరుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం సాయంత్రానికి ఢిల్లీ చేరుకునే అవకాశం ఉంది.

దంతేశ్వరి ఫైటర్స్.. బ్యాకప్

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో దంతేశ్వరి ఫైటర్స్. ఎన్‌కౌంటర్లలో కీలక పాత్ర పోషిస్తున్నారు. డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్)గా పిలిచే ఈ మహిళా కమెండోలు సాయుధ బలగాలకు బ్యాకప్‌గానూ పనిచేయడం విశేషం. మూడు రోజుల కిందట నారాయణపూర్, దంతెవాడ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో సుమారు 1200 మంది జవాన్లు పాల్గొన్నారు. వీరిలో దంతెవాడ జిల్లాకు చెందిన దంతేశ్వరి ఫైటర్స్ కూడా పాల్గొన్నారు. యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా దంతెవాడ జిల్లాలో 60 మంది మహిళా కమెండోలతో దంతేశ్వరి ఫైటర్స్‌ను ఏర్పాటు చేశారు. వీరిలో లొంగిపోయిన నక్సల్స్‌తో పాటు స్థానిక యువత ఉన్నారు. శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఈ మహిళా కమెండోలు కూడా పాల్గొన్నారు. ఎన్‌కౌంటర్ ముగిసిన తర్వాత మావోయిస్టుల మృతదేహాల తరలింపులోనూ మహిళలు కీలక పాత్ర పోషించినట్లు తెలిసింది.

మరో ఏడుగురు మావోయిస్టుల మృతదేహాల గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన 31 మంది మావోయిస్టుల్లో మరో ఏడుగురిని దంతెవాడ పోలీసులు ఆదివారం గుర్తించారు. ఈ ఏడుగురిలో రూ.5 లక్షల చొప్పున రివార్డు ఉన్న సుక్కు యాదవ్, విజయ్, సోహన్, సుదర్ దౌడైతో పాటు క్రారమ్ సోనూ, జమ్లీ ఉన్నారు. శనివారమే 16 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించి వారిపై ఉన్న రివార్డులను పోలీసులు వెల్లడించారు. ఇప్పటి వరకు మొత్తం 23 మందిని గుర్తించగా.. మరో 8 మందిని గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. వారి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు మిగిలిన 8 మంది మృతదేహాల్లో ముఖ్య నేతలు ఎవరైనా ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


సెక్స్‌టార్షన్, డిజిటల్ మోసాలకు పాల్పడుతున్న 18 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

- దేశవ్యాప్తంగా 319 కేసులు, తెలంగాణలో 45
- రూ. 5 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, హార్డ్‌డిస్కులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రోజుకో కొత్తరకం మోసంతో అమాయకులను బురిడీ కొట్టించి కోట్లు కొల్లగొడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా 319 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న 18 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. తెలంగాణలో వీరిపై 45 కేసులున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి రూ. 5 లక్షల నగదు, 26 సెల్‌ఫోన్‌లు, 16 ఏటీఎం కార్డులు, హార్డ్‌డిస్కులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల కోసం ఆరు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి... కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించి పట్టుకున్నాయి. వారి ఖాతాల్లో ఉన్న రూ. 1.61 కోట్లు ఫ్రీజ్ చేశాయి. నేరగాళ్లు డిజిటల్ మోసాలు, సెక్స్‌టార్షన్(మార్ఫింగ్ చేసి బెదిరించి డబ్బు డిమాండ్ చేయడం), ఓటీపీ ఫ్రాడ్, ఇన్సూరెన్స్ మోసాలు వంటి పలు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, తెలంగాణలో ఈ తరహాలోనే బాధితుల నుంచి రూ. 6.94 కోట్లు కాజేశారని హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు.

కాలస్వభావాన్ని నవల సమగ్రంగా దర్శించగలదు

– బండి నారాయణ స్వామి



బండి నారాయణ స్వామి సమకాలీన నవలా రచయితల్లో నాకు అత్యంత ఇష్టుడు. 'మీ రాజ్యం మీరే లండి', 'శప్తభూమి', 'రెండు కలల దేశం' నేను బాగా ఇష్టపడిన తెలుగు నవలల్లో ప్రముఖంగా ఉన్నాయి. మూడు భిన్నమైన నేపథ్యాల నుంచి ఒకే రచయిత రాసిన మూడు నవలలు పాఠకుల మన్ననలు సమంగా పొందడం సర్వసాధారణంగా జరగదు. అటువంటి అసాధారణ ప్రభావం వేసినందు వలన రచయితగా స్వామి నాకు అత్యంత ఇష్టుడయ్యాడు. స్వీయాత్మక, సామాజిక, చారిత్రక జీవన వైవిధ్యాన్ని భిన్న రీతుల్లో లోలోతుల నుంచి వెలికి తీసిన రచయితగా నారాయణస్వామి స్థానం తెలుగు నవలా ప్రపంచంలో అతి విశిష్టం.

ఇంటర్వ్యూ ■ **అంబటి సురేంద్ర రాజు**

మీరు కథ, కవిత, వ్యాసం ఈ ప్రక్రియలు దేనిలోనూ చేయలేనిది నవలలో మాత్రమే చేయగలిగేది ఏమిటి అంటే ఏం చెప్తారు?

వస్తువును ఒకవైపు చూడటం కథ. వస్తువును అన్నివైపులా తిప్పిచూడటం నవల.

కొన్ని సందర్భాల అల్లిక కథ. అనేక జీవితాల సమాహారం నవల.

ఏకానుభూతి కథ. వివిధానుభూతులకు పట్టుకొమ్మ నవల.

తాడుమీద నడవడం వంటిది కథ. మైదానంలో గుర్రపు స్వారీ నవల.

ఒక్కొక్క శతాబ్దానికి ఒక్కొక్క కాలస్వభావం వుంటుంది. ఈ కాలస్వభావాన్ని సమగ్రంగా దర్శించే పని నవల చేయగలదు. శరత్‌బాబు శ్రీకాంత్, విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలు, ఉన్నవ మాలపల్లి, ఈ కాలస్వభావాన్ని పట్టుకోగలిగినాయి.

మీ మొదటి కవితల్లోనూ, 'చమ్కీదండ' వంటి కథల్లోనూ స్పిరిచువల్ ఎలిమెంట్ కనిపిస్తుంది. అటునుంచి తర్వాతి నవలల్లో సామాజిక వాస్తవికత వైపు వచ్చారు. ఈ ప్రయాణం ఎలా జరిగింది?

అది ప్రయాణం కాదు. ప్రయాణం లేదక్కడ. అధిభౌతికమూ, భౌతికమూ నా అస్తిత్వంలో రెండు పార్శ్వాలు. నా జీవితంలో మాదిరే నా సృజనలోనూ సమాంతరంగా ప్రయాణించినాయి. 'సావుకూడు' కథ రాసినప్పుడు కాళీపట్నం, శ్రీపతి, రాజేశ్వరరావు వంటివారు అట్లాంటి కథలే రాయమని లేఖలో రాసినారు. 'చమ్కీదండ' రాసినప్పుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మ, ఖాశీ సీసాల స్మైల్, రామలింగం వంటివారు ప్రత్యేకంగా సంతోషపడినారు. సమస్య ఎక్కడ వచ్చిందంటే నా కమ్యూనిస్టు మిత్రులకు స్పిరిచువల్ ఎలిమెంట్ గురించి, నా స్పిరిచువల్ మిత్రులకు సామాజిక వాస్తవికత గురించి సంజాయిషీ ఇచ్చుకోవలసిన పరిస్థితిలోకి నెట్టబడినాను. 'మీరాజ్యం మీరేలండి'లో పండమేటి స్వామి, 'శప్తభూమి'లో తిక్కస్వామి నా రెండు పార్శ్వాల సమాంతర ప్రయాణానికి తార్కాణాలు.

> **నిజం చెప్పాలంటే నవల రాస్తున్న క్రమంలో ఒక మేజిక్ జరుగుతుంది. సబ్జెక్టివ్ ఎలిమెంట్‌కు, ఆబ్జెక్టివ్ ఎలిమెంట్‌కు మధ్య సరిహద్దు రేఖ చెరగిపోయి; స్వీయానుభవమా లేక సామాజిక అనుభవమా... అనేది అప్రధానం అయిపోయి మొత్తం ఒక మానవానుభవంగా పాఠకులకు అందుతుంది.**

'రెండుకలల దేశమ్' వంటి పూర్తి ఆటోబయోగ్రాఫికల్ ఎలిమెంట్స్ గల నవలతోపాటు 'మీరాజ్యం మీరేలండి'లాంటి కంప్లీట్ ఆబ్జెక్టివ్ దృష్టికోణం కల నవల కూడా రాశారు. ఈ రెండు రకాల పద్ధతుల్లో రాస్తున్నపుడు రచనా ప్రక్రియలోనూ, రచనానుభవంలోనూ ఎలాంటి తేడా గమనించారు?

ఆటో బయోగ్రాఫికల్ నవలకు ఇంట్రాస్పెక్షన్ అవసరం. ఆబ్జెక్టివ్ నవలకు పరకాయప్రవేశం అవసరం. రెండింటికీ మెడిటేటివ్ మైండ్ వుండటం ఒక కామన్ అవసరం.

ఆటోబయోగ్రాఫికల్ నవల ఉత్తమ పురుష (నేను) ప్రక్రియకు దగ్గర. ఆబ్జెక్టివ్ నవల ప్రథమ పురుష (అతడు) ప్రక్రియకు దగ్గర. ఇది స్థూలమైన అభిప్రాయం మాత్రమే. ఆటోబయోగ్రాఫికల్ నవలను ప్రథమ పురుషలోనూ, ఆబ్జెక్టివ్ నవలను ఉత్తమ పురుషలోనూ రాయవలసిన సాహితీ సందర్భాలు కూడా కొన్ని వుంటాయి.

కథానాయకుడు ఆదర్శపాత్ర అయినప్పుడు ఉత్తమ పురుషలో రాస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. కథానాయకుడు దుష్టపాత్ర అయినప్పుడు కూడా ఉత్తమ పురుషలో రాయలేము. ఒకవేళ రాస్తే ఆ దుష్టపాత్రకు ఉత్తమ పురుష ద్వారా సామాజిక ఆమోదం లభించినట్లు అవుతుంది. ఇటీవల 'కల్లోల కలల కాలం' అనే నవల వచ్చింది. రచయిత పరవస్తు లోకేశ్వర్. నిజానికి అది రచయిత ఆత్మకథ. ప్రథమ పురుషలో రాయడం వల్ల మాత్రమే ఆ ఆత్మకథ నవలీకరణలో విజయం సాధించింది.

'ఆకాశగానం' నవల ఆత్మకథ కాదు, ఆత్మాశ్రయ నవల. కానీ దానిని ప్రథమ పురుషలోనే రాయవలసివచ్చింది. కథానాయకుని సంకీర్ణ సంక్లిష్ట స్వభావం వల్ల (సామాజిక నీతికి దూరంగా వుండటంవల్ల) ఉత్తమ పురుషలో రాయవలసిన నవలను ప్రథమ పురుషలో రాయవలసి వచ్చింది.

నిజం చెప్పాలంటే నవల రాస్తున్న క్రమంలో ఒక మేజిక్ జరుగుతుంది. సబ్జెక్టివ్ ఎలిమెంట్‌కు, ఆబ్జెక్టివ్ ఎలిమెంట్‌కు మధ్య సరిహద్దు రేఖ చెరగిపోయి; స్వీయానుభవమా లేక సామాజిక

నవలా శిల్పం

అనుభవమా... అనేది అప్రధానం అయిపోయి మొత్తం ఒక మానవానుభవంగా పాఠకులకు అందుతుంది.

కేవలం ఆబ్జెక్టివ్‌గా రాస్తే కథ పత్రికా రిపోర్టు మాదిరి తయారవుతుంది. కేవలం సబ్జెక్టివ్‌గా రాస్తే అది కథ కాదు, ఆత్మకథ అవుతుంది. కథలోకానీ, నవలలోకానీ అస్వీయానుభవాన్ని సబ్జెక్టివ్‌లోకి మార్చడం వల్ల అనుభూతి కలుగుతుంది. స్వీయాత్మకతను ఆబ్జెక్టివ్‌లోకి మార్చడం వల్ల సార్వత్రికత కలుగుతుంది. అనుభవాన్ని అనుభూతిగా వడగట్టడంలో ఈ రచనాక్రమం అంతా జరుగుతుంది.

కొన్ని నవలల విషయంలో ఇతివృత్తం గురించి చేయాల్సివచ్చే పరిశోధన ఆ తర్వాత నవలా రచనలో నెరేటివ్‌ను డామినేట్ చేయకుండా వుండటానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

ఎక్కడికి అక్కడ మైండ్‌ను ట్యూన్ చేసుకుంటూ జాగ్రత్తపడటమే! ఒక నవల నుండీ ఇంకొక నవలకు మారుతున్నప్పుడల్లా ఈ జాగ్రత్త తప్పదు. ఒక నవల రాసినట్లు ఇంకొక నవల రాయకూడదు అని తీర్మానించుకున్నప్పుడు దానికి భాష, వాక్యం, శిల్పం... వీటిపట్ల ప్రత్యేకమైన కసరత్తు తప్పనిసరి.

'శప్తభూమి', 'అర్ధనారి' తదితర నవలల్లో ఎన్నో పాత్రలు సృష్టించడం, దేనికది నిలబెట్టడం, వాటిమధ్య సమన్వయం సాధించడం... ఇది ఎలా సాధ్యమయ్యింది?

పేపర్ వర్క్ ఎక్కువగా జరుగుతుంది. పాత్ర తాలూకు మోడల్ వ్యక్తిని స్పష్టంగా నిర్ణయించుకుంటాను. చరిత్రలో సామాన్యులు రికార్డు కాలేరు. చారిత్రక నవల రాసేటప్పుడు ఆ సామాన్యులకు మోడల్ వ్యక్తులు దొరకరు. ఆ సందర్భంలో వారి కొనసాగింపును కార్యకారణాలకు వదిలిపెడతాను. ఆ కార్యకారణాలే ఆ పాత్రలను పోషిస్తాయి. ఒక పాత్ర ఇంకొక పాత్రతో ఏ సందర్భాలలో ఇంటరాక్ట్ అవుతుంది, ఏయే సందర్భాలలో సంఘర్షిస్తుంది, వాటివల్ల నవలా ప్రయోజనం ఎంతవరకూ నెరవేరుతుంది. వీటి చుట్టూ పథకాలు రచించుకుంటాను.

కథలకు భిన్నంగా నవలాకారులకు మాత్రమే వుండాల్సిన లక్షణాలు ఏమైనా వున్నాయా? అవేమిటి?

నవల కంటే కథ రాయడమే కష్టం. కథ రాసినవారందరూ నవల రాయగలరు. కథా ప్రక్రియలో మేధోశ్రమ ఎక్కువ. కత్తెర ఉపయోగం కూడా ఎక్కువ. నవలాప్రక్రియలో మేధోశ్రమ తక్కువ. నవలారచనలో కాయకష్టం ఎక్కువ.

మీరు ఇరవైల వయస్సులో రాసిన 'ఆకాశగానం' నవల గురించి ఇప్పుడేమనిపిస్తుంది?

నా ఆధ్యాత్మిక లోకాలకు ద్వారాలు తెరిచింది ఆ ఇరవయ్యేళ్ల వయసులోని ప్లెటోనిక్ లవ్. తెలుగు సాహిత్యంలో తాత్విక ప్రేమ నవలలకు పెద్ద ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీని పూరించే ప్రయత్నం కూడానూ ఈ నవలారచన. ఇటువంటి నవలను ఇప్పుడు ఈ వయస్సులో అయితే అస్సలు రాయలేను. ■

నవల, కథా సంపుటాలకు ఆహ్వానం

గోవిందరాజు సీతాదేవి జాతీయ స్థాయి స్మారక సాహితీ పురస్కారం 2024 కొరకు 2023లో ప్రచురితమైన నవల ఇంకా కథా సంపుటులను ఆహ్వానిస్తున్నాం. ఎంపికైన నవలకి, కథా సంపుటికి రూ.5వేల నగదు బహుమతితో పాటు సన్మానం జరుపబడును. మీ రచనలు 3 కాపీలను డిసెంబర్ 31లోపు చిరునామా: గోవిందరాజు సుభద్రా దేవి, డోర్‌నం. 26.15.494, స్నేహ నగర్, ప్రసాద్ అవెన్యూ, కొండయ్ పాలెం రోడ్డు, నెల్లూర్ – 524004, ఫోన్: 98486 27158కు పంపాలి.

గోవిందరాజు సుభద్రా దేవి

సురవరంపై కవితలకు ఆహ్వానం

ఆధునిక వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి మూర్తిమత్వంపై కవితలను ఆహ్వానిస్తున్నాం. అక్టోబర్ 30లోగా ఈ కవితలను 9492765358 నంబరుకు వాట్సాప్‌గానీ, vanapatlasubbaiah1972@gmail.comకు ఈమెయిల్ గానీ పంపగలరు. కవితలను నవంబర్ 2024లో సంకలనంగా ముద్రిస్తాం.

వనపట్ల సుబ్బయ్య

తెలంగాణ సాహితి

నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా సాహిత్య సమాలోచన అక్టోబరు 8 ఉ.10గంటలకు నిర్వహించబడును. వి. భానుచందర్ అధ్యక్షతన నిర్వహించబడే కార్యక్రమంలో కోయి కోటేశ్వర్ రావు, తెలుగు శాఖాధిపతి, సిటీ కళాశాల హైదరాబాద్; వెంకట్ పరిమళ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల ప్రసంగిస్తారు. తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన పాల్గొంటారు. వివరాలకు: 94412 36242.

వి. భానుచందర్

'సుప్రభాత భావనలు' వ్యాసాలు

పొత్తూరి సుబ్బారావు 'సుప్రభాత భావనలు' వ్యాస సంపుటి అక్టోబర్ 8 సా.5.30 నుంచి జి.వి.ఆర్.కల్చరల్ ఫౌండేషన్ హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గాన సభ కళాసుబ్బారావు కళావేదికలో జరుగుతుంది. కార్యక్రమంలో కె.వి. రమణాచారి, పెద్దూరి వెంకటదాసు, రమణ వెలమకన్ని, కళా వి.ఎస్.జనార్దన మూర్తి, భైస దేవదాసు, వై. రామకృష్ణా రావు తదితరులు పాల్గొంటారు. పి.వి.ఎల్. నరసింహా రావు అతిథి సత్కారం చేస్తారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం జరుగుతుంది.

జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్

గంటా కమలమ్మ పురస్కారం

గంటా కమలమ్మ సాహితీ పురస్కారం కోసం 2022, 2023 సంవత్సరాలలో ప్రచురితమైన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. మీ కవితా సంపుటాలు 3 ప్రతులను అక్టోబరు 15లోగా మాకు అందేలా పంపాలి. ఉత్తమ కవితా సంపుటానికి రూ.10వేలు నగదుతోపాటు, పురస్కార ప్రదానం జరుగుతుంది. చిరునామా: గంటా మోహన్, టీచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బంగారు పాళ్యం, బంగారు పాళ్యం మండలం, చిత్తూరు జిల్లా – 517416. వివరాలకు: 9440467311

గంటా మోహన్

జ్ఞాపకాల నీడలలో కన్నీటి జాడలు

తన నిజమైన ప్రేమను నిర్దాక్షిణ్యంగా తిరస్కరించింది. కళ్ళ ఎదుటనే నడయాడుతూ కడదాకా హింసించింది. తాను బ్రతికున్నంత కాలమూ ఇతడిని విరహాగ్నిలోనే కాల్చి వేసింది. కఠినాత్మురాలు ఆ ప్రేయసి. ఈమె అప్రాప్త మనోహరి, అవాస్తవ మనోహరి కాదు. ఇది వాస్తవం. అయినా ఆ ప్రేయసిని పల్లెత్తు మాట అనని సిసలైన ప్రేమికుడు అసలైన ఈనాటి భావకవి నెల్లూరు నివాసి షేక్ మహబూబ్ బాషా.

చదువుకుంటున్న రోజుల్లో ప్రేమలో పడి, తిరస్కృతుడై మనసు జార్చుకున్నా గుండె జార్చుకోకుండా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడై ఉద్యోగిస్తూ భావకవిత్వంలో పడి ఉపశాంతి పొందుతూ కరుణశ్రీ ప్రభృతుల ప్రోత్సాహంతో పద్య శిల్పానికి మెరుగులు దిద్దుకొని విరహ వేదన పుక్కిలించిన పదాలతో పద్యాలు అల్లి అందని ఆమని పేరిట ఒక సప్తశతిని సంతరించి అప్పటికి బతికే ఉన్న తన ప్రేయసికి (2008) అంకితం చేసిన మనస్వి ఈ బాషా.



ఇది ప్రియా పరాఙ్ముఖ తప్త హృదయ కవిత
ఇది చిరవియోగ కరుణార్ద్ర హృదయ కవిత
ఇది ప్రణయ సౌరభ పరీత హృదయ కవిత
కలికి! నా ప్రేమ చిహ్నమీ కాన్క గొనుము

అప్పటి నుంచీ విరహ కవిత్వం రాస్తూనే ఉన్న ఈ కవి ప్రస్తుతం అశీతివసంతాల (80) వృద్ధుడు అలవాటు ప్రకారం వసంతాలన్నానే కానీ వీరి పద్యాలలో ప్రజ్వరిల్లే విరహాగ్ని వేడిమిని చూస్తే అశీతిగ్రీష్మాల వృద్ధుడనాలి. ఇప్పుడు వీరి విరహాగ్నికై వార్ధకాగ్ని తోడయ్యింది. 'జ్ఞాపకాల నీడలతో' సేద తీరుతూ రాసుకున్న ప్రణయ గీతాలను అదే శీర్షికతో పాఠకులకు అందించారు (జనవరి 2024). ఆనాటికీ ఈనాటికీ అదే అంకితగీతి– కలికి! నా ప్రేమ చిహ్నమీ కాన్క గొనుము. ఆమె జీవించి ఉండటం మరణించడం అనేవి అప్రధానాలు. తన ప్రేమ మాత్రం శాశ్వతం. ఆమె తిరస్కరణ వాస్తవం. తన విరహ వేదన అంతకన్నా వాస్తవం శాశ్వతం. కోపంలేని, ద్వేషం రాని విరహ వేదన.

'అకట! కనుచూపునకును నోచుకొనకుండా మనము కన్నుమూయుదు మేమొ'యని ఈ కవికి అలనాటి ఆవేదన. విషాదభరితమైన ఊహ. హృదయము భరింపజాలని వ్యథ (732). ఈ ఊహ కూడా సడలి పోయిన దశ వచ్చేసింది.

చంద్రునకు శుక్ల కృష్ణ పక్షముల లీల
మర్త్యునకు యౌవనము జర మరణ మెసగు;
అస్తమించియు ఉదయించు అమృతకరుడు
కాని కనుమూసిన నరుండు కను దెరవడు (737)

"శిశువు పుట్టినప్పుడేడ్చి మోదంబు చేకూర్చు. తరలిపోవు నాడు తనవారి నేడ్పించు తాను మౌనమూని" (738). ఇంతటి పరిణతి వచ్చిన ఈ దశలోనూ వీరు ప్రేయసిని మెచ్చుకుంటూనే ఉన్నారు. "నీవు దక్కని లోటును నీ వియోగ బాధ పూరించె అక్కున వాల్చి నన్ను. నిన్ను కరగింప జాలక నేను కరగిపోతి. దుఃఖాగ్ని కీలల పొందులోన" (741) అని అంగీకరించే ఔదార్యం, "గగన కుసుమమైపోయె నీ కరుణ కాన అచటికే ఏగి అద్దాని నందు కొందరు" (743) అనే ధీమా అపూర్వంగా ఏర్పడ్డాయి. ఆ జ్ఞాపకాలూ ఆ విరహ బాధలూ ఆ తపనలూ అన్నింటినీ ఇప్పుడిలా దిగమింగుతూ రోజురోజుకూ తరిగిపోతున్న ఆరోగ్యం దాపురించిన అనారోగ్యం "నన్ను తరలించు నైరూప్య నరకమునకు" (744) అనే ఎరుకతో కూడిన సంసిద్ధత వీరిలో ఏర్పడింది. "ఒడిదుడుకులెన్నో తలదాల్చి బడలినాను ఇక వెడలు వేళ కావచ్చెనిల్లు వదలి అయిన ఆగిపోలేదు సఖి! నాదు అంతరంగ మథన మిపుడు నీ మీది మరుల వలన; ఇక రచన నాపవలెనని యెంతు గాని అది వినక చాటుగా వచ్చి యెదను మీటు" (750). దీని ఫలితం ఏమిటంటే– "ప్రేయసీ! జీవితమె నాకు లేకుండ చేసినావు, వ్యథను పలికించి ప్రయణ కావ్యముగ మలిచి సాహితీ జీవితము నీ కొసంగి నాను" (754). ఇలా అనగలిగిన భావకవి మరొకడు కనపడడు.

వ్యాధులకు గురి గావించి బాధ పెట్టి
బంధువుల నేడిపించి చంపంగనేల?
మృత్యువా! క్లేశముక్తమౌ మృతి ఘటించి
మంచి పేర్వడసి భువి జీవించ రాదొ! (767)

– అప్పుడు గదా నీకు మృత్యు దేవత అనే పేరు సార్థకమవుతుందంటూ సంభాషించడం వేదన తీవ్రతకు పరాకాష్ఠ. "నేడు ధాత్రికేను పరాయివాడ నైతి." గతం గతః వదిలెయ్యండి అని చెబుతారుగానీ అది అంత సులువా? "పాము కుబుసము త్యజియించు పగిది గతము మరువజాలునె మానవ మాత్రుడెందు?!" (778).

ప్రేయసీ! ఇంతకీ ఇప్పుడు నువ్వు ఈ లోకంలో ఉన్నావో? లేవో? తెలీదు. ఒకవేళ నువ్వు ఉన్నప్పటికీ ఎగసి నీ చెంతకు ఉరకలేను. అలసి రెక్కలాడవు నేడు. అడుగు పడదు.



అతినిగూఢము సృష్టిరహస్య పథము
అందినట్లుండి ముందున కరుగుచుండు
కల్పములెన్ని దరలినగాని– పుడమి
రహస్యము అందని ఆకసమ్మె.

ఇదే వస్తువుతో రాసిన వీరి తొలి కావ్యం 'అందని వసంతం', ఈ మలి కావ్యం ముగింపు – "ఏనగ వసంత మాదిగా ఋతువులైదు జీవితాధ్యానము స్పృశించె శిశిరమిపుడు. ఇంతటి శిశిరంలో కూడా వీరికి ప్రేయసి స్వప్నంలో సాక్షాత్కరిస్తూనే ఉంది. హృదయ వీణ మీటుతోంది. పాపం ఆమె వేళ్ళు కందిపోతున్నాయేమో అని ఈ విరహి తపిస్తున్నాడు.

జ్ఞాపకాల నీడలలోన నడుము వాల్చి
గుండె బరువు తొలగంగ కునుకు తీయ–
స్వప్నమున – రాగ రంజిత భగ్న హృదయ
వీణ మీటావు మానస వీధి మెరయ
చెలియ! నీ మృదులాంగుళు లలసెనేమొ?!

ఇలాంటి రసార్ద్రమైన కావ్యాలను చదవడం కొంచెం కష్టమే. ఎక్కడో చటుక్కున ఉబికి వచ్చే కన్నీటిని తుడుచుకుంటూ చదవాలి. అలిసిపోయిన మనస్సుకు విశ్రాంతి ఇస్తూ చదవాలి. విరమించలేక మళ్ళీ మళ్ళీ చదవాలి. ఇంత కష్టపెట్టిన కవినీ అతడి అప్రాప్త మనోహరినీ మనస్సుకు హత్తుకోవాలి.

■ **బేతవోలు రామబ్రహ్మం**

✆ 98481 69769

నా మొదటి పుస్తకం




నా గుండె దండోరా!

■ హెచ్చార్కె

ఏ కవికైనా మొదటి పుస్తకం అచ్చేయడం మొదటి రాత్రి వంటి గొప్ప అనుభవమే. అదే భయం, అదే సందేహం, అదే ఆశ, అదే... బయటికి కనిపించని(వ్వని) ఆరాటం. నా తొలి పుస్తకం పేరు 'గుండె దండోరా'. అబ్బే, 'మాదిగ దండోరా' అనే సంస్థ అప్పటికి... అంటే, అనగనగా 1979 జనవరి నాటికి... లేదు. నిజానికి అలాంటి ఆలోచనలు కూడా మంద కృష్ణకు గాని పొనుగోటి కృపాకర్‌కు గాని లేవు. అప్పటికి చాల కాలంగా రాస్తున్నప్పటికీ, నా చుట్టూ పదుగురికి నేను కవినని తెలిసినప్పటికీ, పుస్తకం వేయాలనే ఊహ నాకు రాలేదు. విమోచన పత్రిక కోసం రాయడం, ప్రెస్సు పనులు చూడ్డంతో బిజీబిజీ. కవితా సంపుటి అచ్చేయకపోవడానికి కారణం అది కాదు. 'నీ కవిత్వం పుస్తకం వెయ్యొచ్చు కదా' అని కామ్రేడ్ మధుసూదన రాజ్ అడిగే వరకు ఆ ఆలోచన కూడా రాలేదు. 'పుస్తకం వేయాలంటే డబ్బు కావాలి కదా' అని నవ్వేశాను. డబ్బు సంగతి నేను చూసుకుంటానులే, నువ్వు పుస్తకం పని చూడు అన్నాడు మధు. ఇంకేం! అప్పటికే తెలిసిన ప్రెస్సు ఎలాగూ ఉంది. నక్షత్ర సప్తకం శాండిల్య గారు ఎడిట్ చేస్తూ ఉండిన 'వెండితెర' సినిమా పత్రిక అచ్చయ్యే ప్రెస్సు లోనే విమోచన అచ్చయ్యేది. 'గుండె దండోరా' కూడా అక్కడే పుట్టింది. దానికి బొమ్మ వేసిన చిత్రకారుడు కామ్రేడ్ నమ్ము (శేషం నరసింహా చారి). తను కవిగా అందరికి తెలుసు గాని, తనను చిత్రకారుడిగా పరిచయం చేసింది 'గుండె దండోరా' యే అనుకుంటా. మీరే చూడండి అట్ట మీద బొమ్మ ఎంత బాగా వేశాడో.



'ఇది రహదారి కాదు' అనే హెడింగ్ తో మరో కామ్రేడ్ యాధాటి కాశీపతి దానికి ముందుమాట రాశాడు. అచ్చుపని ఎంత హాయిగా గడిచిపోయిందో, పంపిణీ పని అంతకన్న హాయిగా నాకు తెలీకుండా జరిగిపోయింది. విమోచన ఆఫీసే అప్పుడు మా ఇల్లు. ఆఫీసుకు వచ్చే సహచరులకే వెయ్యి కాపీలు చాలలేదు. నా దగ్గర ఒక్క ప్రతి కూడా లేదని అంగలారుస్తుంటే, ఆ మధ్య ప్రసిద్ధ విమర్శకుడు అశోక్ కుమార్ ఇంటికి వెళ్లినప్పుడు, ఆయన ఎంచక్కా అట్టలు వేసి దాచిన పుస్తకం ఇచ్చాడు. దాన్నే ఏ దేశమేగినా ఎందుకాలిడినా నాతో ఉంచుకుంటున్నా. ఇంతకూ ఆ పుస్తకానికి అయిన ఖర్చు ఎంతో తెలుసా? అక్షరాలా మూడొందల రూపాయలు. అంత డబ్బు లేకనే మధు ఇచ్చే వరకు అచ్చేయలేకపోయాను. 52 పేజీల 30 కవితల పుస్తకం ఖరీదు రూ.2/–. కవితలు అన్నాను గాని, అందులో ఐదారు తప్ప అన్నీ ఉద్యమావసరాల కోసం రాసిన... 'తూర్పు చేని గట్టుకాడ', 'కలలు గనే వేళ కాదు' లాంటి పాటలే. ఆ ఐదారు కూడా విప్లవ రచనలే గాని కవితలని అనుకోను. రాసిన కవితల్లో స్వీయ మనస్కత ఉన్నదని పక్కన పెట్టేశాను. అలా ఉండడం మంచి కవిత్వమని తెలియక వాటిని పుస్తకంలో చేర్చలేదు. బై ది బై – ముఖచిత్రంలో పేరు చూసి అదేంటని అనుకోకండి. అప్పటికి ఇంకా నా పేరు నా పేరే. ఇప్పటి తిక్క పేరు అప్పటికి లేదు. ■



జగబంధపు బండ

మూడమేసిన మొగులు
గుబురు చింతనీడనార్పింది
మేసండం మబ్బుల ఏడుపు
వాకిలిని పాకిరి బండచేసింది

ఉప్ప కడలి ఆబగ తాగి
మత్తెక్కిన తెప్పలు
మతి సుతిలేని తాళంతో
లేమి వాకిళ్ళలో
పూనకంతో ఊగుతున్నయి

ముండ్ల కుసుమ సుంకు
చిత్తగాలికి ఏ మురిపమో కాని
కమిలిన తనువుల కొప్పెరలా
జొరబడి కోలాటమేస్తున్నది

రాలుతున్న పసుపు కుంకుమలు
కురిసే తుంపరకు అట్టగట్టి
జగబంధపు బండలపై
రంగు వెలసిన పరదాలై
దిగులును పెంచుతున్నాయి

చెదల మునుము కోతకు
సూరుల మొదల్లు రాలి మెదలవుతున్నయి
ఆవిరితో సెమటలు కక్కే కుంపటులు
సిలుమెక్కి కునికి పాట్లు పడుతున్నవి

ఇగం వచ్చిన కుదురు అరుగు
సుట్ట మీది కూరాడులో
మక్కిన వాసనొంపుతున్నది
పాకమేదైన వాకరే

నిలిపే నిట్టాడు నేలను
కూలవేసె తొలికారు దురాశ కొరివికి
తావినొదిరి చెదిరిన మంద
రెక్కలుడిగిన ఉసిల్ల కుప్పలయినయి

పీడగొంతు గుడ్లగూబ
పడావు పడ్డ గోడలకు
తన ముక్కుకంటిన
మరకలనద్ది పోతున్నది

కల్లమైన లూటిడిసిన కంచె
పశువుల తొక్కులాటలో

ఆశలు పాలిపోయిన
అలం పోసలైనయి

సెగలింకి ఆరిన కొలుముల
పొలమారిన మొఖాల గాంచి
మోరలెత్తిన ఊర కుక్కల
ఎడతెగని ఏడుపూ ఏ కీడుకు
సంకేతమో అంతుపట్టకున్నది

ఆకలి రుచినే మరిసి
బూకటికి మరిగిన దండు
తాటి బెల్లానికి తలకిందులుగ
వేలాడే గబ్బిలాల గుంపయింది

దయా నీతి గుణాల రేఖలుగ
దిద్దుకున్న ఆదిరూపాలు
తమ నొసటి దీపాలను
తామే ఆర్పుకుంటున్నయి

బాటల కూడలి భుజాలపై
మోటు రాళ్ళ మొలుపు
చావిడి గోడలకు సాలీడు పూత

దర్వాజ రెప్పలకు జిల్లేడు జిగురు
విసిరే పొలి రాళ్ళ వీరంగానికి
గూడు చెదిరిన పక్షి వలపోత

కొమ్మలను కలిపి ఉంచే ఆశల తీగలు
బూజు చీడకు లేతలోనె కోతబడుతున్నవి
ఆకులనదుముకొని పసిమిని పంచె నీరెండ
ఏ సౌరగాలి కలయిక మరిగిందొ
నీడల మింగి వేడిని పెంచుతున్నది

గాయపడిన మూపురాలపై
ముసురుటీగల వీరంగం.
తోకలతో అదిలింప చూసిన
అంటిన పరిశం కాయ కోతలే తప్ప
పైన వాలినవి తొలుగకున్నవి

పాసి తీగలు చుట్టుకున్న చేటు తోవ
మనిషిని జీకి పిట్టని చేసి తిప్పుతున్నది
సెంగల్లో అంటూ ఎగిసిన కసురు గాలి
విసిరిన రేణువులతో సెవులు
మూతలు పడుతున్నవి
ఏడుపు వేడుక బంతిలా వినపడుతున్నది

■ **గోరటి వెంకన్న**

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
సోమవారం 7 అక్టోబరు 2024



మళ్లీ 'రెవెన్యూ' యోగం!

తెరపైకి మళ్లీ వీఆర్‌వో, వీఆర్‌ఏలకు వ్యవస్థ

- పాత వ్యవస్థను పునరుద్ధరించేందుకు సర్కారు అడుగులు
- పరీక్ష నిర్వహించి తీసుకుంటామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు
- ఆందోళనలో వీఆర్‌వో, వీఆర్‌ఏలు
- ఇప్పటికే సీనియారిటీ పోయిందని ఆవేదన

హనుమకొండ టౌన్, అక్టోబరు 6: గతంలో రెవెన్యూశాఖలో కీలకంగా వ్యవహరించి గ్రామాల్లో ప్రతీ ప్రభుత్వ కార్యక్రమానికి అన్నీ తామై నడిపించి ఓ వెలుగు వెలిగిన వీఆర్‌వో, వీఆర్‌ఏల వ్యవస్థను పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. గ్రామస్థాయిలో రెవెన్యూశాఖను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో తిరిగి వారి సేవలను వినియోగించుకోవాలనే ఆలోచన చేస్తోంది. రెవెన్యూశాఖలో వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థను పునరుద్ధరించి తద్వారా గ్రామస్థాయిలోని రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. ప్రభుత్వం ఆలోచనలను స్వాగతిస్తూ వివిధ శాఖల్లో పనిచేస్తున్న వీఆర్‌వో, కొంత మంది వీఆర్‌ఏలు మాతృశాఖలో వెళ్లి హాయిగా విధులు నిర్వర్తించుకోవచ్చనే ఉత్సాహంలో ఉన్నారు.

2007 నుంచి వీఆర్‌వోల ప్రస్థానం

2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు సమయంలో (విలేజ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) వీఏవోలకు అదనంగా గ్రామ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించి వేతనం పెంచారు. 2007లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వారిని వీఆర్‌వోలుగా గుర్తించి గ్రామ రెవెన్యూ బాధ్యతలను అప్పగించారు. అనాటి నుంచి వీఆర్‌వోలుగా కొనసాగుతూ వస్తున్నారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ధరణిని తీసుకొచ్చింది. ఈ క్రమంలో రెవెన్యూ శాఖలో జరిగిన అనేక మోసాలు, అవినీతిపై కుప్పలు తెప్పలుగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖలోని వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థను 2020 సంవత్సరంలో రద్దు చేసింది. వారందరినీ ప్రభుత్వంలోని ఇతర 36 శాఖల్లోకి సర్దుబాటు చేసింది. ఈ విషయంపై వీఆర్‌వోలు కోర్టుకు వెళ్లగా ఇప్పటికీ తీర్పు రిజర్వులోనే ఉంది.

బదలాయింపుల్లో అన్యాయం

2023 ఆగస్టులో జరిగిన వీఆర్‌ఏల బదలాయింపుల్లో వారి విద్యార్హతను బట్టి రెవెన్యూతో పాటు మున్సిపాలిటీ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్‌గా, అటెండర్స్‌గా ఆవకాశం కల్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 726 మంది వీఆర్‌వోలు ఉండగా, 713 మంది వివిధ శాఖల్లోకి జాయిన్ అయి విధులు నిర్వర్తిస్తుండగా 9 మంది మాత్రం వేరే శాఖలోకి వెళ్లకుండా రెవెన్యూశాఖలో ఉండిపోయారు. నిరక్షరాస్యులతోపాటు వయస్సు పైబడిన వారిని రెవెన్యూశాఖలోనే కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. వయస్సు పైబడటంతో వాళ్లంతా పిల్లలకు వారసత్వ ఉద్యోగాల ఇవ్వాలని ఎదురుచూస్తున్నారు.

సర్వీసు కోల్పోయి పదోన్నతులకు దూరం

వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేయడంతో వారందరినీ ఇతర శాఖల్లోకి సర్దుబాటు చేయగా, జూనియర్ అసిస్టెంట్ హోదాలో ఆయా శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే రెవెన్యూశాఖలో కొన్నేళ్లుగా పని చేసినప్పటికీ వారందరూ ఆయా శాఖల్లో జీరో సర్వీసు నుంచి ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టారు. రెండేళ్ల ప్రొహిబిషన్ కాలవ్యవధి తర్వాత ఇటీవలే వారి రెగ్యుల రైజేషన్ మొదలైంది. దీంతో పదిహేను, పదహారు యేళ్ల నుంచి చేసిన సర్వీసు అంతా వృథా అయిపోయింది. కొద్దిరోజుల్లో వీఆర్‌వో నుంచి సీనియర్ అసిస్టెంట్స్‌గా పదోన్నతులు పొందుతారన్న తరుణంలో గత ప్రభుత్వం వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దుచేయడంతో అర్హత ఉన్న వారంతా సర్వీసులను కోల్పోయి పదోన్నతులకు దూరమయ్యారు.

మంత్రి వ్యాఖ్యలతో ఆందోళన

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థ పునరుద్ధరణపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలతో వీఆర్‌వోలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వీఆర్‌వో, వీఆర్‌ఏల నియామకాలకు సంబంధించి అభ్యర్థుల సామర్థ్యాలను పరీక్షించడానికి పరీక్ష నిర్వహిస్తామని, రెవెన్యూ సర్వీసులోకి రావాలంటే పరీక్ష రాయాల్సిందేనని స్పష్టం చేయడంతో ఇప్పటి వరకు నూతన ఉత్తేజంతో ఉన్న వీఆర్‌వోలు ఆందోళనకు గురవుతున్నారు.

సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోవాలి..

- సర్వేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ రెవెన్యూశాఖ



వీఆర్‌ఏగా రెవెన్యూశాఖలో 16 యేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాను. 2020లో మా సహచరులంతా ఇతరశాఖలకు వెళ్లినప్పటికీ నేను మాత్రం మాతృశాఖలోనే ఉండిపోయాను. కొన్నేళ్లుగా రెవెన్యూశాఖలో విధులు నిర్వర్తించిన వీఆర్‌వోలు అంతా వేరే శాఖల్లో చేరి జీరో సర్వీసుతో కొనసాగుతున్నారు. రెవెన్యూ శాఖలోకి ప్రభుత్వం రీపోస్టింగ్ ఇచ్చినా, ఇవ్వకున్నా.. ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ సర్వీసును పరిగణలోకి తీసుకొని వీఆర్‌వో, వీఆర్‌ఏలకు న్యాయం జరిగేలా చూడాలి.

మా ఉద్యోగాలు మాకు ఇవ్వడానికి పరీక్షలు ఎందుకు?

- రాజయ్య, జూనియర్ అసిస్టెంట్, విద్యాశాఖ



సుంకరి నుంచి వీఆర్‌వో వరకు కొన్నేళ్లుగా రెవెన్యూ శాఖలో పనిచేశాను. ఆకస్మాత్తుగా వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి ఇతరశాఖలకు పంపించారు. అక్కడ సర్వీసుల్లో జూనియర్స్ అయ్యాం. చాలాకాలంగా రెవెన్యూ వ్యవస్థలో పనిచేశాం కాబట్టి మమ్మల్ని తీసుకుంటే ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. పరీక్ష పేరుతో మమ్మల్ని రెవెన్యూశాకు దూరం చేయాలనకుంటే ప్రభుత్వానికే నష్టం జరుగుతుంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న సర్వీసు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి.



మహాలక్ష్మి దేవిగా భద్రకాళి

నాలుగో రోజుకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 6: ఓరుగల్లులోని భద్రకాళి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం నాటికి వేడుకలు నాలుగో రోజుకు చేరాయి. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. నవదుర్గా కల్పోక్త నవరాత్ర పూజా విధానాన్ని అనుసరించి కుష్మాండి గిరిజా క్రమంలో ఉదయం సూర్యప్రభవాహనంపై ఊరేగించారు. సాయంత్రం సావిత్రిమాత బ్రాహ్మీ మాతగా పూజలు నిర్వహించి అమ్మవారిని హంసవాహనంపై ఊరేగించారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శించుకున్నారు. దీంతో దేవాలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. హరికథ, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. అమ్మవారిని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు సతీమణి జూపల్లి సృజన, రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్, జిల్లా అడిషనల్ జడ్జి, ఇతర అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించగా, ప్రధానార్చకులు భద్రకాళిశేషు మహాపూజలు నిర్వహించారు.



ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ 38వ వార్షికోత్సవ సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

అంబానీ, అదానీలకు సంస్థలను కట్టబెట్టే కుట్ర

- బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం..
- మధ్య తరగతి ప్రజల ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ విధించడం తగదు
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

బాలసముద్రం, అక్టోబరు 6: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు కట్టబెట్టాలని చూస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య ఆరోపించారు. అదివారం హనుమకొండ బాలసముద్రంలోని ఎల్ఐసీ వరంగల్ డివిజన్ కార్యాలయంలో లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ 38వ వార్షికోత్సవ సదస్సును ఐసీఈయూ యూనియన్ ప్రెసిడెంట్ బి.శ్రీహరి, జనరల్ సెక్రటరీ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ కడియం కావ్య హాజరై మాట్లాడుతూ.. 1956లో ప్రభుత్వరంగ సంస్థగా ఆవిర్భవించిన ఎల్ఐసీ.. అనేక మైలురాళ్లను అధిగమించి పల్లె ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుని స్వచ్ఛమైన సంస్థగా పెరుతెచ్చుకుందని అన్నారు. కేంద్రంలోని దేశంలో పేద ప్రజలు పేదలుగానే ఉన్నారని, ధనవంతులు మాత్రం మరింత ధనవంతులుగా మారుతున్నారని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఇన్సూరెన్స్ చేసుకోవడానికి ముందుకు రాకుండా బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ విధించడం దుర్మార్గమని అన్నారు. లోటు బడ్జెట్‌ను పూరించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం స్వార్థపూరితంగా వ్యవహరించిందన్నారు. సంస్థను నిర్వీర్యం చేసేందుకు, అప్రతిష్టపాలు చేసేందుకు అనేక శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఎల్ఐసీ ఉద్యోగులు చేపట్టే పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను రాహుల్‌గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటోందన్నారు. పేద ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం చేస్తుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ కావ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



తుది ఘట్టానికి వీసీ ఎంపిక ప్రక్రియ

- ముగ్గురిని ఎంపిక చేసిన సెర్చ్ కమిటీ
- ఒక్కరిని ఎంపిక చేయనున్న గవర్నర్

కేయూ క్యాంపస్, అక్టోబరు 6: కాకతీయ యూనివర్సిటీ కొత్త వీసీ ఎంపిక ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర సచివాలయంలో ఆదివారం సెర్చ్ కమిటీ సమావేశమై కేయూ కొత్త బాస్ ఎంపికను ఖరారు చేసింది. కేయూ వీసీకి దరఖాస్తులు చేసిన 158మంది ప్రొఫెసర్లలో వారికున్న అర్హతల మేరకు ముగ్గురి పేర్లను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపారు. వీరి ముగ్గురిలో ఒక్కరిని కేయూ వైస్‌చాన్స్‌లర్‌గా సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు రాష్ట్ర వర్సిటీల చాన్స్‌లర్ అయిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదముద్ర వేసి అధికారికంగా ప్రకటిస్తారు.

ఇదిలా ఉండగా, రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా గుర్తింపు పొందిన కాకతీయ యూనివర్సిటీకి ఈ దఫా కొత్త బాస్ ఎవరు వస్తారనే విషయం హాట్‌టాపిక్‌గా మారింది. వర్సిటీ వాట్సాప్ గ్రూపుల్లోనూ ఫలానా ప్రొఫెసర్ వీసీగా వస్తున్నారని పోస్టులు వెలువడుతున్నాయి. అయితే కేయూలో కీలక పదవిలో కొనసాగుతున్న ప్రొఫెసరే వర్సిటీకి వీసీగా వస్తున్నారని కొందరు.. ఉస్మానియా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీ నుంచి వస్తున్నారని మరికొందరు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా గతంలో ఎప్పుడూలేని విధంగా ఈ దఫా వర్సిటీలో కొత్త బాస్‌పై విస్తృతంగా చర్చ సాగుతోంది. అలాగే కాకతీయ యూనివర్సిటీ నుంచి ఒక్కరిద్దరు ప్రొఫెసర్లను రాష్ట్రంలోని ఇతర వర్సిటీలకు వీసీలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తోందనే ప్రచారం తీవ్రస్థాయిలో ఊపందుకుంది. ఇప్పటికే రాష్ట్రంలో పలు వర్సిటీలల్లో కేయూ నుంచి ఒక్కరిద్దరు ప్రొఫెసర్లు వీసీలుగా పని చేశారు. త్వరలోనే రాష్ట్రంలో పలు వర్సిటీలకు వీసీలను అధికారికంగా ప్రకటిస్తారని వర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి.

ఏడుగురు సీఐలు బదిలీ

హనుమకొండ టౌన్, అక్టోబర్ 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏడుగురు సీఐలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎ.మహేందర్	సీసీఎస్ వరంగల్	గీసుగొండ
జి. బాబులాల్	గీసుగొండ	టాస్క్‌ఫోర్స్
ఎస్. రవికుమార్	టాస్క్‌ఫోర్స్	కేయూసీ
బి. సంజీవ్	కేయూసీ	సీఎస్‌బీ వరంగల్
ఓ. రమేశ్	సీసీఎస్ వరంగల్	మామూనూరు
ఎం.రవికుమార్	మామునూరు	ఐజీపీ మల్టీజోన్-1
ఎం. శివకుమార్	ఇంతేజార్‌గంజ్	సీసీఎస్ వరంగల్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు సిద్ధం

- జేఎన్ఎస్‌లో నేటి నుంచి రెండు రోజుల పాటు క్రీడలు
- అండర్-14, 16, 18, 20 బాలబాలికల విభాగాల్లో పోటీలు
- 33 జిల్లాల నుంచి 1,100 మంది అథ్లెట్లు రాక
- 100 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు హాజరు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 6: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7,8 తేదీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించడానికి హనుమకొండ జేఎన్ఎస్‌లోని అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్ ముస్తాబవుతోంది. ఆదివారం జేఎన్ఎస్‌లో క్రీడాపోటీల నిర్వహణ ఏర్పాట్లను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, 20 బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే అథ్లెట్లకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,100 మంది అథ్లెట్లు, 100 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారన్నారు. అదేవిధంగా కోచ్‌లకు, టెక్నికల్ అఫీషియల్స్‌కు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బస, భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని, అదేవిధంగా పారా ఒలంపిక్స్‌లో కాంస్య పతాక విజేత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన జీవంజి దీప్తి విశిష్ట అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు.


సింథటిక్‌ట్రాక్‌పై సాధన చేస్తున్న అథ్లెట్లు

పలు క్రీడాంశాలలో పోటీలు

అండర్-14 బాలబాలికలకు ఏబీసీ ట్రైయాథ్లిన్, అండర్-16 విభాగంలో 60, 600 పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, అండర్-18 విభాగంలో 100, 200, 400, 1000, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, అండర్-20 విభాగంలో 100, 200, 400, 800, 1500, 3000 పరుగు పందెం, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, హ్యామర్‌త్రో, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు జరగనున్నాయి.

ప్రాణాలు గిల గిల

- రేకుల షెడ్డుపై పిడుగుపాటు
- వెంకటాపురం శివారులో ఇద్దరి మృతి
- మరో ఐదుగురికి గాయాలు

ఐనవోలు, అక్టోబరు 6: ప్రకృతి ప్రకోపానికి వారు బలయ్యారు. విధి వారిపై పగపట్టినట్లు చేసింది. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉండగా, అందరినీ ఒకచోటికి చేర్చి అందులో ఇద్దరి ప్రాణాలను కబళించింది పిడుగుపాటుతో తల్లుల కళ్లఎదుటే ఇద్దరు మృత్యువాతపడిన హృదయవిదారక సంఘటన ఐనవోలు మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..


రాజుయాదవ్(ఫైల్)


శ్రావణి(ఫైల్)

వెంకటాపురానికి చెందిన తల్లీ కొడుకులు కుకట్ల కోమల, రాజుయాదవ్‌తో పాటు తల్లీకూతుళ్ల దౌతుబాజి ఇందిరాబాయి, శ్రావణిలు, బంధువులైన దౌతుబాజి శ్రీనివాస్, విజయ, రాధాబాయిలు గ్రామ శివారు కట్టుకాల్వ సమీపంలో ఉన్న తమ పత్తి చేలలో పత్తిని ఏరేందుకు వెళ్లారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో ఉరుములతో కూడిన అకాలవర్షం ప్రారంభమైంది. వీరి చేలకు సమీపంలో దౌతుబాజి ఉపేందర్ అనే రైతు పశువుల కోసం వేసిన రేకుల షెడ్డు ఉండటంతో ఒకరి తరువాత ఒకరు అందులోకి వెళ్లి తలదాచుకున్నారు. అప్పటికే రెండుసార్లు పిడుగుపాటు శబ్దం రావడంతో భయంభయంగా ఉన్నారు. ఇంతలోనే భీకరశబ్దంతో వారు తలదాచుకున్న రేకులషెడ్డు పిడుగు పడడంతో అందరూ స్పృహ తప్పిపడిపోయారు. కొంత సేపటికి దౌతుబాజి శ్రీనివాస్ తేరుకొని మిగిలినవారిని లేపాడు. కానీ రాజుయాదవ్(25) శ్రావణి(17) ఎంతకీ లేవలేదు. అందరూ హాహాకారాలు చేయడంతో కొద్ది దూరంలో ఉన్న గొర్రెల కాపర్లు, రైతులు పరిగెత్తుకు వచ్చారు. అప్పటికే రాజుయాదవ్ మెడభాగంలో కాలిన తీవ్రగాయంతో మృతిచెందాడు. శ్రావణి ఎలాంటి గాయం లేకుండా మృతిచెంది ఉంది. ఈ ప్రమాదంలో రాజుయాదవ్ తల్లి కోమల కూడా తీవ్రంగా గాయపడింది. శ్రావణి తల్లి ఇందిరాబాయితోపాటు మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరితోపాటు షెడ్డులో ఉన్న రెండు ఆవులు, లేగదూడకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జఫర్‌గడ్ ఎస్సై రాంచరణ్ సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాలను వర్ధన్నపేట మార్చురీకి తరలించారు. అక్కడ మృతుల కుటుంసభ్యులు, బంధువుల రోదనలతో దద్దరిల్లింది.

విషాదం

ఐలయ్య - కోమల దంపతులకు రాజుయాదవ్ ఒక్కగానొక్క కుమారుడు. ముగ్గురు అక్కల వివాహాలు అయ్యాయి. పదో తరగతి వరకు చుదువుకున్న రాజు.. తమకున్న 3 ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచాడు. ఇటీవల కొత్త ఇంటిని నిర్మించుకున్నారు. రాజును ఒక ఇంటివాడిని చేయాలని తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తుండగా అంతలోనే తిరిగిరానిలోకాలకు వెళ్లాడు. అదేవిధంగా దౌతుబాయి రాంబాబు- ఇందిరాబాయి దంపతులకు ఒక కుమారుడు శ్రీకాంత్, కూతురు శ్రావణిలు ఉన్నారు. తండ్రి రాంబాబు మూడేళ్ల కిందట మృతిచెందగా, కుమారుడు కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచాడు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో హాస్టల్లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. తల్లితోపాటు పత్తి ఏరేందుకు వెళ్లి మృత్యువాతపడింది. ఈ ఇద్దరు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.


రాజుయాదవ్, శ్రావణి మృతదేహాల వద్ద బంధువుల రోదనలు





ప్రమాదపుటంచున ప్రయాణం



గీసుగొండ నుంచి పోతురాజుపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయ బావి పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా ఉంది. బావి పక్కనే ఉన్న రోడ్డుపై బుంగ పడి ఆందోళన కరంగా ఉంది. ప్రయాణికులు ఎవరైనా అటువైపు నుంచి వస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బావిని, రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- ఫొటోలు : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

గుంటగుంటకు సర్వే సాధ్యమేనా..?

● డిజిటల్ క్రాప్ సర్వేపై ఏఈవోల ఆందోళన ● ఉన్న సిబ్బందితో పనిచేయడం కుదరదని నిరసన
● ఏజెన్సీల ద్వారా సర్వే చేపట్టాలని విజ్ఞప్తి ● 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

హసన్‌పర్తి, అక్టోబరు 6: రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వేను ఏఈవోలు బహిష్కరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఏఈవోలపై ఒత్తిడి తేవడంపై 17 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నిరసనలో భాగంగా జిల్లా వ్యవసాయాధికారులు, జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ని కలిసి విస్తరణాధికారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

పని ఒత్తిడితో సతమతం

ఇప్పటికే గ్రామ స్థాయిలో సహాయకులు లేకున్నా వ్యవసాయ విస్తరణాధికారులు ఏడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విజయవంతంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే రైతు బంధు, రైతు బీమా వంటి 49 రకాల విధులు నిర్వహిస్తూ సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో డీసీఎస్ విషయంలో సాగులో ఉన్న కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూములలో ప్రస్తుతం ఉన్న 26 వందల మంది ఏఈవోలతో డిజిటల్ క్రాప్ సర్వే చేయించాలని చూడడం సరికాదని ఏఈవోలు అంటున్నారు. కాగా, ఈ సర్వే కోసం 12 వేల మంది సిబ్బంది అవసరం ఉంటుందని, కానీ కేవలం 26 వందల మంది వ్యవసాయ విస్తరణాధికారులతోనే సర్వే చేయించాలని ప్రభుత్వం చూస్తోందన్నారు.

వేధింపులు

ఒక రైతుకు తనకున్న వ్యవసాయ భూమిలో వేస్తున్న పంటల నమోదులో గుంటగుంటకు సర్వే చేసి రిపోర్టు ఇవ్వడం విస్తరణాధికారులకు సాధ్యమయ్యే పనికాదన్న విమర్శలున్నాయి. 60 శాతం మహిళా సిబ్బంది ఉన్న ఈ శాఖలో ప్రతీ గుంటకు ఫొటో క్యాప్చర్‌తో పాటు పంట నమోదు, ఇతర వివరాలను నమోదుచేయడం సాధ్యమయ్యేపని కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే డిజిటల్ క్రాప్ సర్వే సమస్యకు పరిష్కారం చూపకుండా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులకు హాజరవుతున్నప్పటికీ వారికి సాధారణ సెలవుగా పరిగణిస్తూ మెమోలు జారీ చేస్తున్నారని తలలు పట్టుకుంటున్నారు.




మంత్రి తుమ్మలకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జాక్ నేతలు

రాష్ట్ర వ్యాప్త నిరసనలు

రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేపై తీసుకున్న నిర్ణయంతో ఏఈవోలపై అదనపు పనిభారం పడుతోందని, వెంటనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సర్వే పనులు చేయించాలని కోరుతూ ఏఈవోలు రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఏఈవోల సమస్యను పట్టించుకోకుండా జాప్యం చేస్తుండడంతో నిరసనలు 17వ రోజుకు చేరుకున్నా యి. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఆందోళనలు తీవ్రం కాకుండా వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని జాక్ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఏజెన్సీకి అప్పగించాలని డిమాండ్

కేంద్ర ప్రభుత్వ విధివిధానాల ప్రకారం ప్రతీ రాష్ట్రం వివిధ ఏజెన్సీల ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బంది పర్యవేక్షణలో ఈసర్వేలు చేయించాల్సిందిగా ఆదేశాలు న్నాయి. ఆ ప్రకారమే మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిస్సా వంటి రాష్ట్రాలలో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సర్వేలు కొనసాగుతున్నాయి. కానీ తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే చాలీచాలని ఏఈవోలతో ఈ సర్వే నిర్వహించాలని చూడడం పట్ల తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏజెన్సీల ద్వారా వివిధ రాష్ట్రాలలో చేపడుతున్న సర్వే వివరాలను ఇప్పటికే వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులకు, కలెక్టర్లకు, ప్రభుత్వ ప్రతినిధులకు, వ్యవసాయ శాఖ మంత్రికి, డైరెక్టర్‌కు వివరించినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఏఈవో జాక్ నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలపై పెరుగుతున్న ఒత్తిడిపై సానుకూల దృక్పథంతో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా సర్వే నిర్వహించి ఏఈవోలపై పనిభారాన్ని తగ్గించాలని జాక్ నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఎస్సారెస్పీ కెనాల్‌కు బుంగ

టెక్స్‌టైల్ పార్కు ముప్పు

ఎస్సారెస్పీ ప్రధానకాలువతో పాటు ఉపకాలువలకు నీరు వదలటంతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ప్రధాన కాలువ వద్ద పలుచోట్ల బుంగలు ఏర్పడ్డాయి. దీంతో కాలువ స్టీనింగ్ శిథిలమై కాలువలో ప్రవహించే నీరు బయటికి వచ్చే ప్రమాదం పొంచి ఉంది. నీటి ప్రవాహం పెరిగితే టెక్స్‌టైల్ పార్కులోకి కాలువ వరద నీరు చేరే అవకాశం ఉంది. ఇక్కడే కాకతీయ కెనాల్ పొడవునా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం ఇదేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే స్థానిక రైతులు కోరుతున్నారు.

- ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

సీతాఫలం.. యమ పిరం..

● నగరంలో కిలో రూ.200పైనే.. ● ఇబ్బందుల్లో వినియోగదారులు



హనుమకొండలో రోడ్డు పక్కన సీతాఫలాలను విక్రయాలు చేస్తున్న ప్రజలు

బాలసముద్రం, అక్టోబరు 6: శీతాకానికి ముందే సీతాఫలాలు నగరానికి చేరుకున్నాయి. ప్రతీ సంవత్సరం శీతాకాలంలో మూడు నెలల పాటు సీతాఫలాల విక్రయాలు నగరంలో జోరుగా సాగుతుంటాయి. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్, నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు సీతాఫలాలను డబ్బాలలో పెట్టి విక్రయాలు జరుపుతుంటారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సీతాఫలాల విక్రయాలు మొదలయ్యాయి. బుధవారం పండ్లు కొనుగోలు చేయడానికి ఆయా ప్రాంతాలకు వచ్చిన ప్రజలు ధరలను చూసి వెనుదిరిగారు. ప్రస్తుతం సీతాఫలాలు ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. మంచి ఫలాలకు కిలో ధర రూ.200 నుంచి రూ.250 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో కొందరు కొనుగోలుదారులు వారు అడిగిన కాడికి ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి నగరానికి..

సీతాఫలాలను జనగామ జిల్లా, సిద్దిపేట, ఇతర జిల్లాల నుంచి ఎడ్ల బండ్లు, ప్రత్యేక వాహనాల్లో తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు. సీజన్ కావడంతో ప్రజలు కొనుగోలు చేయడానికి ముందుకొచ్చినప్పటికీ ధరలను చూసి జంకుతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండాల్సిన ధరలు ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు కొనుగోలు చేయలేకపోతున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం సీతాఫలాలకు డిమాండ్ పెరిగిందని స్థానిక ప్రజలు తెలుపుతున్నారు. ఒకవైపు అధిక వర్షాలు కురువడంతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సీతాఫలాలను కొంత మంది సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలు పెంచి విక్రయాలు జరుపుతున్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. చిన్న సైజు ఉన్న సీతాఫలాలు కిలోకు రూ.150 ఉండగా, పెద్ద సైజులో ఉన్నవి కిలో ధర రూ.200 నుంచి రూ.250 వరకు పలుకుతోంది.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట, అక్టోబరు 6: కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్ ల మధ్య శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతదేహా న్ని రైల్వేపోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి.

మృతుడి వయస్సు 30 - 35, ఎత్తు 5.5, ఛామన ఛాయ రంగు, కుడివైపు చాతిపైన ఎస్, ఎడమ వైపు బీ అనే ఇంగ్లీష్ అక్షరాల పచ్చబొట్టు ఉంది. పొట్టపై పుట్టమచ్చ ఉంది. మృతుడిని గుర్తించడానికి వీలు లేకుండా తల నుజ్జు నుజ్జు అయ్యింది. బట్టలు చిరిగి ఉన్నాయి. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహా న్ని ఎంజీఎంలో భద్ర పర్చామని. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లోనైనా 87126 58609, 94400 27342 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

దేవీ శరన్నవరాత్రి పూజల్లో పాల్గొన్న ఎంపీ

కాజీపేట, అక్టోబరు 6: కాజీపేట రహమత్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవ పూజలు ఘనంగా జరిగాయి. అనంతరం అన్నదానం జరిగింది. ఈ పూజలకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు పాక వేదప్రకాశ్ కుమారులు 20 డాలర్ నోట్లను అమ్మవారికి మెడలో వేశారు. పాక రాజయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులు పాక వేదప్రకాశ్, పాక సాయి ప్రకాశ్, రాజిరెడ్డి, పాము రాజేశ్ కుమార్, నాగుల కృష్ణ, ఉదయ్, ప్రమోద్, తోపాటు స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఎంపీ సన్మానం

కాజీపేట : కాజీపేట సీఎస్ఐ చర్చిలో ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్స వం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కడియం కావ్య హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్లు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాద వ్, విజయ శ్రీ రజాలీ, కాంగ్రెస్ నాయకులు మైసారపు సిరిల్ లారెన్స్, గోల్కొం డ రాంబాబు, సిలువేరు విజయ భాస్కర్‌తో పాటు చర్చి సభ్యులు పాల్గొన్నారు.

సీఎం వైఖరికి నిరసనగా 9న చలో కలెక్టరేట్

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్

హనుమకొండ టౌన్, అక్టోబరు 6: ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి వైఖ రిని నిరసిస్తూ ఈ నెల 9న చలో కలెక్టరేట్ నిరసన కార్యక్రమానికి పిలుపు నిచ్చినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ తెలిపారు. ఆది వారం నయీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయ న మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఇప్పటివరకు ఇచ్చి న ప్రతీ జాబ్ నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాలు కేటాయిస్తా మన్న సీఎం రేవంత్‌రెడ్డి.. డీఎస్సీలో ఎస్సీ వర్గీకరణ లేకుండా అమలు చేసి మా దిగ జాతికి నమ్మక ద్రోహం చేశాడన్నారు.

మాల నాయకుల బ్లాక్‌మెయిల్‌కు భయపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. మాదిగల చేతిలో భారీమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ద్రోహానికి నిరసనగా మాదిగ విద్యార్థులు, ఉద్యోగు లు ఈ నెల 9న అంబేద్కర్ నుంచి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీలో నల్లబ్యాడ్జీలతో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎర్ర రాము, మంద స్వరాజ్, బొక్క రాజేశ్, ఆలువాల ఎల్లేశ్, సిలువేరు బిక్షపతి, ఎర్ర బాబు, మట్టెల అనిల్, దామెర అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ధర్మసాగర్, అక్టోబరు 6: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ధర్మసాగర్ మండలం నారాయణగిరి జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో ఆదివారం జరిగింది. పాఠశాలలో 1995-1996 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యా ర్థులు 28 తర్వాత సుమారు 76మంది ఒకే వేదికపై కలుసుకున్నారు. పాఠశా లలో పనిచేసి విద్యార్థుల మౌలిక సేవలందించి మృతి చెందిన పూర్వ ఉపాధ్యా యుడు కుంకల మోహన్‌రెడ్డి, ఇతర సిబందికి నివాళులు అర్పించారు. అనం తరం పాఠాలు బోధించిన పూర్వ ఉపాధ్యాయులను శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చదివిన ఆనాటి చిలిపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరితోఒకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపా ధ్యాయులు రాధకృష్ణ, మధుసూ దన్‌రావు, జనార్దన్‌రెడ్డి, రామబ్రహ్మం, మహేం ద్రచారి, శ్రీనివాసరావు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌లో వైకుంఠధామం

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న భీమారం గ్రామస్థులు
- బిల్లులు రాక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

రాంనగర్, అక్టోబరు 6: భీమారం వైకుంఠధామం చిన్న చినుకుపడినా నీటిమయంగా మారుతోంది. వర్షం నీరు నిలిచి దహన సంస్కారాలు చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. వర్షాకాలంలో మృతి చెందిన వారి దహన సంస్కారాలు రోడ్డుపై చేయాల్సి వస్తోంది. దహన వాటికలు లేక పోవడంతో బురదలోనే కాల్చాల్సి వస్తోంది. ఆవరణలో గతంలో నిర్మిం చిన రూములు శిథిలావస్థకు చేరుకున్నాయి. చెరువు నీరు వైకుంఠధా మం స్థలంలోకి రావడంతో పందులు, కుక్కలకు నిలయంగా మారింది.

పనుల్లో జాప్యం

2021లో భీమారం తాళ్లవనంలో వైకుంఠధామం ఏర్పాటు చేశారు. రెం డు ఎకరాలకు పైగా ఉన్న ఈ స్థలంలో వైకుంఠధామం నిర్మించేందుకు మొదటి దఫా రూ.18లక్షలు, రెండోదపా రూ.50లక్షలు కేటాయించారు. 2022లో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్.. బిల్లులు రావడం లేదనే సాకుతో అర్ధాంతరంగా పనులు నిలిపి వేశాడు. రేట్లు పెంచి నిధులు ఇస్తే పనులు చేస్తానని చెబుతున్నట్లు తెలిసింది. గత బీఆర్ఎస్ సర్కారు నిధులు కేటాయించినా చేసిన పనులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు చెల్లించడం లేదనే విమర్శలున్నాయి. దీనిపై ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేటర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి..



బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ శ్మశాన వాటిక పనులు నిలిపివేశాడు. బిల్లులు ఇస్తేనే పను లు చేస్తానని కాంట్రాక్టర్ చెబుతున్నాడు. ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ గుండు సుధారాణి దృష్టికి తీసు కెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తా. త్వరలోనే పనులు పూర్తి చేయించి భీమారం గ్రామస్థులకు శ్మశానవాటిక అందుబాటులోకి వచ్చేలా సహకరిస్తా..

జక్కుల రజిత వెంకటేశ్వర్లు, కార్పొరేటర్



నీళ్లలో వైకుంఠ ధామం



మృతదేహాలను ఖననం చేస్తున్న దారి

మహాలక్ష్మి అలంకరణలో రుద్రేశ్వరీదేవి



పూజ చేస్తున్న నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ దంపతులు

హనుమకొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయిస్తంభాలగుడిలో రుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగం గా ఆదివారం నాలుగోరోజు అలయ ప్రధానార్చకుడు గంగు ఉపేం ద్రశర్మ ఆధ్వర్యంలో నిత్యాహ్నికం, చతుస్థానార్చన, శ్రీ చక్రచార్చన, చతుశష్టి ఉపచార పూలు నిర్వహించారు. అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. లక్ష కుంకుమార్చన, అనంతరం అమ్మవా రికి కమలపుష్ప వాహనసేవ నిర్వహించారు. యాగశాలలో మహా చండీ యాగం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. పూజల్లో పాల్గొన్న ప్రముఖుల్లో నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ దంపతులు ఉన్నారు. మామిడాల రమేష్, పులి రజ నీకాంత్, గుజ్జ సంపత్‌రావు సౌమ్య దంపతులు, శ్రీఖర్, తదితరులు భక్తులకు సేవలు అందించారు. సాయంత్రం సుహాసిని పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా దొంతగారి వెం కటేశ్వర్లు బుర్రకథ కాలక్షేపం భక్తులను అలరించింది.

దుర్గామాత సన్నిధిలో ముస్లిం అన్నదానం

హనుమకొండ చౌరస్తా: శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా హనుమకొండ గుడిబండల్‌లోని అభయాంజనేయస్వామి ఆల యం లో ప్రతిష్ఠించిన దుర్గమాత మండపం వద్ద మాజీ డిప్యూటీ మేయ ర్ ఖాజా సిరాజోద్దీన్ అన్నదానం నిర్వహించాడు. మహాకా ళిదేవి అలంకరణలో ఆదివారం ప్రజలకు దర్శనమిచ్చిన అమ్మవా రిని సిరా జుద్దీన్ ముందుగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిం చి తన భక్తిభావాన్ని చాటుకొని అనంతరం అన్నదానం నిర్వహిం చాడు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, స్థానికులు స్టాలిన్, దేవులపల్లి అమర్, భాస్కర్, అమ్మవారి భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 6: నగర ప్రజల సమస్యలు నేరు గా తెలుసుకునేందుకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవా రం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవ చ్చని తెలిపారు. బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరి ష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

రెడ్డి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కిషన్‌రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 6: తె లంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్‌గా జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డిని నియమించినట్లు తెలం గాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లా సంజీవరెడ్డి తెలిపారు. హనుమకొండ హం టర్‌రోడ్‌లోని అభిరామ్‌గార్డెన్‌లో ఆదివారం జిల్లా రెడ్డి సంఘం ము ఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కిషన్ రెడ్డిని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ సం దర్భంగా కిషన్‌రెడ్డికి నియామక పత్రం అందజేసి శాలువా కప్పి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు చందుపట్ల నర్సింహారెడ్డి, రావుల నర్సింహారెడ్డి, కేతిడి దామోదర్ రెడ్డి, గంట సంజీవరెడ్డి, రాజారపు సంజీవరెడ్డి, పులి వీరారెడ్డి, విజయ ప్రకాశ్ రెడ్డి, వీసం సురేందర్ రెడ్డి, నంద్యాల కృష్ణారెడ్డి, పరకాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంజీవరెడ్డి, కట్ట రఘు పాల్‌రెడ్డితో పాటు జిల్లాలోని వివిధ మండలాల రెడ్డి సంఘం నాయకులు, రెడ్డి కులస్థులు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకమయ్యే పండుగ బతుకమ్మ



అడ్వకేట్స్ కాలనీలో దాండియా ఆడుతున్న మహిళలు



నిట్‌లో..



బతుకమ్మ వేడుకల్లో కుటుంబసభ్యులతో దాస్యం వినయ్‌భాస్కర్

బాలసముద్రం, అక్టోబరు 6: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయా లకు అద్దంపట్టే పండుగ బతుకమ్మ పండుగని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బతుకమ్మ సంబురా లను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మన బతు కు చిత్రాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. మహిళలు, యువతులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో వచ్చి ఆనందంగా బతుకమ్మ ఆడా రు. ఈ కార్యక్రమంలో దాస్యం వినయ్‌భాస్కర్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: రామప్ప శివాలయంలో ఆదివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా హసన్‌పర్తికి చెం దిన వేములవాడ పరపతి సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఏకరీతి దుస్తులు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆటపాటలతో అల రించారు. ఈ సందర్భంగా పరపతి సంఘం అధ్యక్షుడు నాగమల్ల సుధీర్, సభ్యులు శ్రీధర్‌సరిత, పావుశెట్టి కిరణ్‌రాధిక, గుండమీది రాజేందర్ విజయ, చకిలం చంద్రశేఖర్, బొక్క కుమార్ పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్: కేయూ దూరవిద్య కేంద్రం మైదానంలో కేయూ వాకర్స్ అసోసియేషన్ నేతృత్వంలో ఆదివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కేయూ వాకర్స్ అసోషియేషన్ బాధ్యులు దేశిని లక్ష్మినారాయణ, డాక్టర్ నల్లాని శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుంట చుట్టూ ఇళ్లు.. రోగాలు ఫుల్లు..



ఇళ్ల మధ్యలో ఉన్న కుంట

- దుర్వాసన, దోమలు, ఈగలతో విస్తరిస్తున్న వ్యాధులు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు
- ఎమ్మెల్యే దృష్టిసారించాలంటున్న స్థానికులు

కాజీపేట, అక్టోబరు 6: చుట్టూ నివాస గృహాలు.. మధ్యలో ఓ మురికి కుంట.. అందులో పిచ్చి మొక్కలు. దీంతో విపరీతమైన కం పు, వాసన, దోమలు, చీమలు పుడుతున్నాయి. ఈ కారణంతో చు ట్టు పక్కల ఉన్న స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మురుగు నీరు నిల్వ ఉండటంతో బోర్లలోకి మురుగు చేరి అందు లోంచి వచ్చే నీరు కూడా గబ్బు వాసన వస్తోంది. స్థానికులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడు తున్నారు. పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో అందులోంచి పాములు ఇండ్లలోకి వస్తున్నాయి. ఈ బాధలు తట్టుకోక స్థానికులు ఇండ్లు ఖాళీ చేస్తు న్నారు. ఇదెక్కడో కాదు.. కాజీపేట 62వ డివిజన్ ఎఫ్‌సీఐ పక్కన రహ్మత్‌నగర్‌లోని దుస్థితి. ఇదెప్పుడో వర్షాలు పడినప్పుడే కాదు.. ఏడాది పొడుగునా ఇదే పరిస్థితి. వర్షం పడితే మరి ఘోరంగా ఉం టుందని స్థానికులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. గతంలో సోమిడి నుంచి వచ్చే డ్రెయినేజీ నీరు చేరడంతో ఈ నీటిని ఎఫ్‌సీఐ నుంచి బయటకు వెళ్లేవి, ఎఫ్‌సీఐ సిబ్బంది ఈ నీటిని రాకుండా అడ్డుకట్ట వేయడంతో సమస్య జటిలమైంది.

ఈ విషయంపై స్థానిక కార్పొరేటర్, మున్సిపాలిటీ గ్రీవెన్స్‌లో పలుమార్లు విన్నవించినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థాని క కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌ను వివరణ ఇచ్చారు. ఎఫ్‌సీఐ పక్కనుంచి నూతన డ్రెయి నేజీ నిర్మించాలని, అందుకు నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌కు పలుమార్లు విన్నవిం చినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మునిసిపల్ కమిష నర్ ఆ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రూ. 24 లక్షల బాణసంచా పట్టివేత

హనుమకొండ టౌన్, అక్టోబరు 6: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పర్వ తగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఇంట్లో నిల్వ చేసిన రూ.24,07,630 విలువ చేసే బాణసంచాను ఆదివారం సీజ్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. తదుపరి చర్యల కోసం టపాసులు, నిందితుడు కొత్త రవితేజను స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

జవహర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి ప్రభాకర్

వడ్డెపల్లి, అక్టోబరు 6: హనుమకొండ మండలం గోపాల్‌పూర్‌లోని జవహర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికల అధికారులు పులి ప్రభాకర్, ఎంపీ గిరిధర్ పర్యవేక్షణలో జరిగాయి. అధ్యక్షుడిగా బైరి సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా యతిరాజుల సునీల్, కార్యదర్శిగా కొత్తపల్లి అమర్, కోశాధికారిగా మట్టపల్లి రణధీర్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మ ట్టపల్లి సాంబయ్య, కంటె సత్తయ్య, ఎమ్డీ షేక్ అమీద్, తమ్మల శోభారాణి, ఆర గ్నైజింగ్ సెక్రెటరీలుగా పులి శ్రీనివాస్, పులి రాజేష్, ఎల్లావుల లింగమూర్తి, రావు లపల్లి రమ, సంయుక్త కార్యదర్శులుగా గుడికందుల అనిల్, ఉడుతబోయిన కిర ణ్‌కుమార్, మునుకుంట్ల ప్రతాప్, సుమజ, గిద్దె పద్మ, ముఖ్య సలహాదారుడిగా బండి హరీష్ ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు.

ఆకాశవాణి వ్యాఖ్యాతల సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన వరంగల్ రేడియో వ్యాఖ్యాత సంఘం కమిటీ సభ్యులు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 6: వరంగల్ జిల్లా ఆకాశవాణి రేడియో వ్యాఖ్యాతల సంఘం ఎన్నికలు ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో జరిగా యి. రెండోసారి అధ్యక్ష, కార్యదర్శులుగా మోటె చిరంజీవి, అర్షం సదానందం ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు పరిశీలకుడిగా డాక్టర్ పసుల ఎల్లయ్య వ్యవ హరించగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా డాక్టర్ పి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గాదె శ్యామ్, బి.చైతన్య, సి.స్వప్న, సహాయ కార్య దర్శులుగా ఎం.స్రవంతి, రామకృష్ణాచారి, గౌరవ అధ్యక్షుడిగా పల్లె నాగేశ్వర్‌రావు, గౌరవ సలహాదారులుగా డాక్టర్ ఎల్లయ్య, డాక్టర్ మగ్దూం, వాణిశ్రీ, ఓదెల కృష్ణ, డాక్టర్ డి.చంద్రశేఖర్‌రావు ఎన్నికల కాగా, ప్రచార కార్యదర్శులుగా సందెల కిశోర్, గడ్డం శోభారాణి, సాంస్కృతిక కార్యదర్శులుగా బి.సుమలత, జె.శ్రీనివాస్, సమ న్వయకర్తలుగా కె.భాగ్య, జి.వాణి, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఎం.శ్యామల, జి. స్వాతి, సంధ్యారాణి, సతీష్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీని సం ఘం సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రవి

బాలసముద్రం, అక్టోబరు 6: హనుమకొండలోని జిల్లా ప్రజా పరిషత్ సమా వేశ మందిరంలో ఆదివారం పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సం ఘం ఎన్నికలు ఎన్నికల అధికారి ఈ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల్లో అధ్యక్షు డుగా కోడం రవి, ప్రధాన కార్యదర్శిగా చాట్ల రవికుమార్ ఎన్ని కైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.సునీల్ కుమార్, కె.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా బి.సత్యనా రాయణరెడ్డి, పి.అర్పిత, వి. పల్లవి, జి.రమేష్, జి.రజినీదేవి, కోశాధికా రిగా ఎమ్డీ ఇక్బాల్, జేఏసీ మెంబర్‌గా ఏ. వసంతరామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం. కరుణ కుమారి, సీహెచ్. వేణుగోపాల్, పి.క ళాజ్యోతి, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం.పూర్ణచందర్, డి.ప్రవీణ్, పి.జయరాం, బి.వెంకటేశ్వర్లు, ఈసీ మెంబర్లుగా బి.ప్రదీప్, కె.శ్రీనివాస రావు, ఎమ్డీ అబ్దుల్‌రఫిక్, భాగ్యలక్ష్మి, కె. చంద్ర శేఖర్, ఎమ్డీ ఇస్తార్ మహ్మద్ ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన అభినందన సమావేశంలో రాష్ట్రశాఖ అధ్య క్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

ఎన్నో రోజులుగా పోరాటం చేస్తున్న పర్యవేక్షకులకు గెజిటెడ్ హోదా కల్పించేం దుకు, పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేం దుకు కృషి చేస్తున్నట్లు వివ రించారు. అదేవిధంగా సాంఘిక భద్రత కింద ఏళ్ల తరబ డి ఎదురుచూస్తున్న వారికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి నందకుమార్ మాట్లాడుతూ.. అడహక్ ప్రమోషన్ పొంది న సీనియర్ సహా యకులకు రెగ్యులరైజ్ చేసేందుకు రాష్ట్రస్థాయిలో చర్చలు జరుపు తున్న ట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనగామ, ములుగు, వరంగల్, భూపాలప ల్లి జిల్లాల అధ్యక్షులు చింత విక్రం, జి.అనిల్, యుగేందర్, విజయపాల్‌రెడ్డి, మోజెస్ ప్రవీణ్‌కుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘానికి ఎన్నికైన కమిటీ సభ్యులు

మూసీ ప్రక్షాళనపై మీ కార్యాచరణ ఏంటి?

- ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా కూల్చివేతలా..?
- రూ.1.50 లక్షల కోట్ల ప్రాజెక్టు కాంట్రాక్టు ఎవరికిచ్చారు
- అఖిలపక్షం పెడితే చర్చకు సిద్ధం: ఎంపీ ఈటల



హైదరాబాద్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన అంశంలో ప్రభుత్వ కార్యాచరణ ఏమిటో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. రూ.1.50 లక్షల కోట్ల మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారని, ఎఫ్‌టీఎల్ నిర్ధారించకుండా కూల్చివేతలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. అసలు మూసీ ప్రక్షాళనకు డీపీఆర్ ఉందా ? అని నిలదీశారు. మూసీ ప్రక్షాళన అంశంపై ముఖ్యమంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం ఎక్కడ పెట్టినా చర్చకు సిద్ధమని ఈటల పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఆయన ఆదివారం ఓ బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వ చర్యలతో ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏం చేశారని, రూ.కోట్ల విలువైన ఇంటిని కూలగొట్టి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వడం ఏంటని ఆ లేఖలో ప్రశ్నించారు. సబర్మతి నది ప్రక్షాళనకు రూ.2 వేల కోట్లు, నమోగంగ ప్రాజెక్టుకి 12 ఏళ్లలో రూ.22వేల కోట్లు ఖర్చుపెడితే మూసీ ప్రక్షాళనకు లక్షా 50 వేల కోట్లు ఎందుకు ఖర్చు అవుతున్నాయి ? అని ఈటల అడిగారు. పట్టా భూముల్లో ఇల్లు కట్టుకున్నవారికి ప్రత్యామ్నాయం ఏం చూపిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూల్చివేతల కంటే ముందు హైదరాబాద్‌లో ఉన్న చెరువులను శుభ్రం చేయాలని సూచించారు. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వ ఇచ్చిన పట్టా భూముల్లో, ప్రభుత్వం అనుమతించిన లేఅవుట్లలో ఇల్లు కట్టుకున్న నిరుపేదలను కూల్చివేతలతో భయపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నానని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తోన్న నోటీసులు ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోయారు. ముఖ్యమంత్రికి అపరిమిత అధికారాలు లేవనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, చట్టం, రాజ్యాంగం ప్రకారం వ్యవహరించాలని హితవు పలికారు. ఫణిగిరి కాలనీ, మారుతీ నగర్, చైతన్యపురి, ప్రజయ్ ఇంజనీరింగ్ సిండికేట్ లాంటి ప్రాంత వాసులతో తాను స్వయంగా మాట్లాడానని ఈటల తెలిపారు. ఇల్లు కోల్పోయిన వారి ఆవేదనను చెబుతున్న నేతలను ముఖ్యమంత్రి కాలకేయులతో పోల్చడం ఏంటని మండిపడ్డారు.

నేడు గాంధీభవన్‌కు మంత్రి తుమ్మల

- 'ముఖాముఖి'లో వినతులు స్వీకరించనున్న మంత్రి
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కు 'అలయ్ బలయ్' ఆహ్వానం

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో సోమవారం జరగనున్న 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు.. పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రతి వారంలో బుధ, శుక్రవారాలు ఈ కార్యక్రమం నిర్వహించాలని టీపీసీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. అయితే టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ జిల్లా పర్యటనల నేపథ్యంలో గత బుధ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం జరగలేదు. దీంతో శుక్రవారం జరగాల్సిన కార్యక్రమాన్ని టీపీసీసీ సోమవారం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే.. మంత్రితో ముఖాముఖిలో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని పార్టీ నేతలు, ప్రజలకు మహేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. విజయ దశమి సందర్భంగా ఈ నెల 13న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి రావాలంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం మహేశ్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలిసి దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆహ్వాన పత్రం అందించారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అచిన్ వనాయిక్, తాషీ, రోహిత్, తదితరులు

పాలస్తీనాది తిరుగులేని సంకల్పం

- ఇజ్రాయెల్ దాడులకు ఏమాత్రం వెరవని ధీరత్వం
- ప్రపంచంలో ఆధిపత్య ధోరణే ఎక్కువగా ఉంది
- ప్రముఖ రాజనీతి శాస్త్రజ్ఞుడు అచిన్ వనాయక్
- ట్రాన్స్ వ్యక్తుల పట్ల వివక్ష తగదు: తాషీ చోడుప్
- ఎన్ కౌంటర్లను ఖండించిన మానవ హక్కుల వేదిక

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్ దాడుల్లో పాలస్తీనా జనాభాలో 8 శాతం మంది మరణించగా, మరో 8 శాతం మందికి పైగా పాలస్తీనియన్లు క్షతగాత్రులయ్యారని ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు, రచయిత, ప్రొఫెసర్ అచిన్ వనాయిక్ పేర్కొన్నారు. అయినప్పటికీ, తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలన్న దృఢ సంకల్పం నుంచి పాలస్తీనా దేశస్తులు అడుగు కూడా వెనక్కి వేయలేదని కొనియాడారు. పాలస్తీనాపై మారణహోమాన్ని ఇజ్రాయెల్ పౌర సమాజం సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఎంతో మంది ఆ దేశ పౌరులు పాలస్తీనాకు సంఘీభావంగా వీధుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పాలస్తీనా సమాజం సైతం హమాస్ ధోరణిని ఎండగడుతోందని, అయితే, అవేవీ బహిర్గతం కావడం లేదని చెప్పారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో మానవ హక్కుల నేత బాలగోపాల్ 15వ స్మారక సదస్సు ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. పాలస్తీనాలో ఇజ్రాయెల్ సృష్టిస్తోన్న మారణ హోమం అంశంపై అచిన్ వనాయిక్ కీలకోపన్యాసం చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దమనకాండను ఐక్య రాజ్య సమితిలో సైతం ఖండించకుండా భారత్ వ్యూహాత్మక మౌనం ప్రదర్శించిందని.. దీనికి మోదీ ప్రభుత్వ మతవాద రాజకీయ వైఖరే ప్రధాన కారణమని విమర్శించారు. ఒకవైపు మారణ హోమాన్ని సృష్టిస్తూనే, తమ దేశానికే ప్రమాదం పొంచి ఉన్నదంటూ మిగతా దేశాల నుంచి సానుభూతి పొందటానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం వింత వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆధిపత్య ధోరణే ఎక్కువగా ఉందని అన్నారు. సామాజిక ఉద్యమాల్లో ట్రాన్స్ జెండర్లతో పాటు వివిధ లైంగిక అస్తిత్వాలు కలిగిన వ్యక్తుల హక్కులను భాగం చేయడం అంశం మీద ఎల్జీబీటీక్యూ హక్కుల ఉద్యమ కారిణి తాషీ చోడుప్ మాట్లాడారు. ట్రాన్స్ వ్యక్తులను థర్డ్ జెండర్‌గా సంబోధించడం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మనుషులంతా ఒక్కటే అనే ప్రజాస్వామిక దృక్పథానికి ఫస్ట్, సెకండ్, థర్డ్ జెండర్ల విభజన పూర్తి విరుద్ధమని అన్నారు. పలు సందర్భాల్లో న్యాయస్థానాల్లో జడ్జిలు సైతం ట్రాన్స్ వ్యక్తుల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఉదాహరణలతో వివరించారు. ట్రాన్స్ జెండర్లను ట్రాఫిక్ వలంటీర్లుగా నియమిస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆమె విమర్శించారు. వారిపై ఉన్న వివక్షను పోగొట్టడానికి చర్యలు చేపట్టకుండా.. విద్య, ఉపాధి అవకాశాలు కల్పించకుండా వలంటీర్ల పోస్టులతో ఒరిగేదేమీ లేదని చెప్పారు.

పోలీసులపై హత్యా నేరం మోపాలి..

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్లను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మానవ హక్కుల వేదిక ప్రకటించింది. 31 మంది ప్రాణాలు బలిగొన్న పోలీసు అధికారులపై హత్యానేరం మోపాలని డిమాండ్ చేసింది. దీన్ని ఎదురు కాల్పులుగా నమ్మబలకడాన్ని తప్పుబట్టింది. ఇదే కార్యక్రమంలో ఆవిష్కృతమైన బాలగోపాల్ వ్యాస సంపుటాలు.. "రిజర్వేషన్ల వర్గీకరణ ప్రజాస్వామిక దృక్పథం" పుస్తకాన్ని వనపాకల దిలీప్ పరిచయం చేశారు. బీల కోసం బతుకు కోసం- సోంపేట హరిత ఉద్యమ చరిత్రను వై. కృష్ణమూర్తి, బస్తర్ డివిజన్‌లో సెక్యూరిటీ అండ్ ఇన్ సెక్యూరిటీ- నిజ నిర్ధారణ నివేదిక పుస్తకాన్ని చంద్రశేఖర్ పరిచయం చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కె.రామచంద్రమూర్తి, వేమన వసంతలక్ష్మి, మానవ హక్కుల వేదిక నేతలు జీవన్ కుమార్, రోహిత్, తిరుపతయ్య, హరికృష్ణ, గుత్తా రోహిత్, ప్రొఫెసర్ హరగోపాల్, వసంత కన్నబిరాన్ పాల్గొన్నారు.

ఎవరు అడ్డొచ్చినా ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్షాళన చేయాలనుకుంటున్నా. ఇందులో యువ ఇంజనీర్లు భాగస్వామ్యమై ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి. గతంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు నిర్వాసితులు కాలేదా? మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను కొట్టించారు కదా? మూసీ పరివాహక ప్రాంతాల్లో పదివేల కుటుంబాలున్నాయి. నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సలహా ఇవ్వండి. నష్ట పరిహారం ఎలా ఇద్దామో చెప్పండి. ఇప్పటికే గుడిసెల్లో ఉన్నవారిని డబుల్ బెడ్రూమ్ ఇళ్లల్లోకి తరలిస్తూ.. దారి ఖర్చులకు కూడా రూ.25 వేలు ఇస్తున్నాం. బఫర్ జోన్‌లో ఉన్నవారిని ఎలా ఆదుకోవాలన్న దానిపై ఆలోచిస్తున్నాం.

10 వేల కోట్లు ఖర్చు చేయగలిగితే..

నువ్వు(కేసీఆర్) రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినవ్. రూ.5 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్లు మూసీలో ఉన్న పేదలకు ఖర్చు చేయగలిగితే.. వాళ్లకు ప్రభుత్వ స్థలాల్లో కాలనీ, అపార్టుమెంట్లు, మంచి ఇళ్లు కట్టించి, హాస్పిటల్, పాఠశాలలు, కాలేజీలు కట్టించవచ్చు. మీకు రూ.2 వేల కోట్ల విలువ చేసే వెయ్యెకరాల ఫామ్‌హౌస్ ఉంది. మీ పార్టీ ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయి. పార్టీ పెట్టినపుడు 15 రూపాయలేవు.. ఇప్పుడు ఇన్ని కోట్లు మీ ఖాతాలకు రావడానికి పేదోళ్ల త్యాగం కారణం కాదా? ఈ ప్రభుత్వం మనందరిది. ఉద్యోగాలు సాధించిన వారంతా బాధ్యతతో పనిచేయండి. మనం చేసే నిర్మాణం పూర్తయితే వాళ్లు చేసిన దోపిడీ అంతా ప్రజలకు తెలుస్తుందని.. ముందుకు సాగనియ్యకుండా ప్రయత్నం చేస్తున్నారు. బుల్డోజర్ నా మీదుగా పోవాలంటే.. నా మీదుగా పోవాలంటూ హరీశ్‌రావు, కేటీఆర్.. ఇలా అందరూ పోటీ పడుతున్నారు. మీకోసం ఎన్ని బుల్డోజర్లు కొనాలె? పైసలు యాడున్నయి? మూసీ అంచున ఉండే దోస్తులకు ఒకటే సూచన. హరీశ్, కేటీఆర్, రాజేందర్ ఎవరైనా వస్తే పట్టుకొని ఒక వారం రోజులు పేదోళ్ల మధ్యన ఉంచండి. వాళ్ల కష్టాలు తెలుస్తయి. వాళ్లకు ఏం మేలు చేయాలో అప్పుడు అర్థమవుతుంది. ఏం చేసినా తప్పుబట్టాలని, కాళ్ల మధ్య కట్టె పెట్టాలని కొంతమంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. మనం పైసలు పెట్టి పని చేస్తే.. తెలంగాణ బాగుపడితే.. గతంలో వాళ్లు చేసిన దోపిడీ ప్రజలకు అర్థమవుతుందని అన్నింటికీ అడ్డుకుంటున్నారు.

వందేళ్ల అనుభవం..!

వందేళ్ల అనుభవం ఓవైపు ఉంటే.. పదేళ్ల దుర్మార్గమైన అనుభవం మరోవైపు ఉంది. కాంగ్రెస్ పాలనకు, బీఆర్ఎస్ పాలనకు ఎంతో వ్యత్యాసం ఉంది. గత ప్రభుత్వం 2017లో నోటిఫికేషన్ ఇచ్చి ప్రిన్సిపాళ్లను, పీఈటీలను ఎందుకు నియమించలేదు? 2019 పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన వినోద్‌కుమార్‌కు, కవితకు ఆరు నెలలు తిరగకుండానే పదవులు కట్టబెట్టారు. వారి కుటుంబానికి ఒక నీతి, మన కుటుంబాలకు మరో నీతి ప్రదర్శించారు. ఇదే ఆ కుటుంబం రీతి. వివిధ శాఖల్లో కొన్ని ఉద్యోగాలకు 2017లో నోటిఫికేషన్ ఇస్తే.. మరికొన్ని రెండేళ్ల కిందట నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ, ఉద్యోగ నియామకాల గురించి మాత్రం పట్టించుకోలేదు. వివిధ న్యాయస్థానాల్లో కేసులుంటే వాటికి పరిష్కారం చూపించలేకపోయారు. కొందరు ఎనిమిదేళ్లు, మరికొందరు రెండేళ్లుగా నిరీక్షించి గత ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయారు. నేనిచ్చిన పిలుపుతో మీరంతా కాంగ్రెస్‌కు అండగా నిలబడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగులు.. కాంగ్రెస్ కార్యకర్తల కన్నా ఎక్కువగా శ్రమించడం వల్లే 65 మంది ఎమ్మెల్యేలతో అధికారం చేపట్టాం. ఇచ్చిన మాట ప్రకారం.. పదేళ్లలో చేపట్టని నియామకాలకు పరిష్కారం చూపి పది నెలల్లో 60 వేల ఉద్యోగ నియామకాలు పూర్తిచేశాం. యువ ఇంజనీర్ల పర్యవేక్షణంలో 360 కి.మీ రీజనల్ రింగ్‌రోడ్డు, రేడియల్ రోడ్డు, ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ నిర్మాణం, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ ద్వారా పలు నిర్మాణాలు చేపట్టనున్నాం.

ముఖం చెల్లక ఆయనెక్కడున్నారో..?

ప్రతి ఒక్కరూ ముసుగు తొడుక్కుంటారు. ఆయనకు (కేసీఆర్‌ను ఉద్దేశించి) తెలంగాణ అనే ముసుగు.. రక్షణ కవచంలా కొంతకాలం ఉంది. ఉద్యమం కోసం మీరంతా చేతులెత్తి దండం పెట్టారు. అది వారి గొప్పతనం కాదు.. తెలంగాణ ఉద్యమం గొప్పతనం.. విద్యార్థులు, నిరుద్యోగుల త్యాగం. ఇవాళ ముసుగు తొలగిపోయింది కాబట్టి ముఖం చెల్లక ఆయన ఎక్కడున్నారో! భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వరకు మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సమయంలో కట్టిన ప్రాజెక్టులు ఎన్ని వర్షాలు పడినా, వరదలు, తుఫాన్లు, ఉప్పెనలు వచ్చినా.. చెక్కుచెదరలేదు. కాళేశ్వరం కడితే ఏం జరిగిందో చూశారు. కాళేశ్వరం కట్టిన వాళ్లను ఆదర్శంగా తీసుకుంటరా? గతంలో నిర్మించిన ప్రాజెక్టుల ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకుంటరా? రూ.38 వేల కోట్ల అంచనాలున్న ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు.. పేరు మారి రూ.లక్షన్నర కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు అయింది. దానికి రూ.లక్ష కోట్లు చెల్లించారు. మూడో టీఎంసీకి ఇంకా పనులు పూర్తికాలేదు. ఇక మల్లన్నసాగర్‌లో రిజర్వాయర్ నిర్మించిన చోట భూమిలో వర్టికల్ చీలిక ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు చెబుతున్నారు. 50 టీఎంసీల నీళ్లు నింపినరోజు అది కుంగిపోయి భూకంపం వచ్చి ఊర్లకు ఊర్లు తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని చెప్పారు. గత ప్రభుత్వం 15 టీఎంసీల కంటే ఎక్కువ నీళ్లు నింపలేదు.


శిల్పకళావేదికలో నిర్వహించిన 'ఉద్యోగాల పండుగ'లో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, తుమ్మల, కోమటిరెడ్డి, కొండా సురేఖ తదితరులు

రాజేందరన్నా వాళ్లకు బానిసత్వం చూపించకు!

అంగి మారినా ఈటల రాజేందర్‌కు ఆ వాసన మాత్రం మారినట్టు కనబడటంలేదు. మంచి పనుల్లో ఆయన కలిసి వస్తారనుకున్నాం. మూసీపై ముందురోజు హరీశ్, కేటీఆర్ మాట్లాడితే.. మరుసటిరోజు రాజేందర్ జిరాక్సు తెచ్చి మాట్లాడారు. కనీసం భాష అయినా మార్చుకో రాజేందరన్నా! ఇంకా వాళ్లకు బానిసత్వం చూపించాల్సిన అవసరంలేదు. వాళ్లు నిన్ను మెడలు పట్టి గెంటేసినప్పుడు తెలంగాణ సమాజం నీ పక్కన నిల్చున్నది. ఆ దొంగల పక్కన నిల్చోకు. తెలంగాణ ప్రజల పక్కన ఉండు. నేను ఢిల్లీకి వెళ్తున్నా. రేపు మోదీ దగ్గరకు వెళ్దాం.. సబర్మతి రివర్ ఫ్రంట్ కోసం 64 వేల కుటుంబాలను ఆయన బయటకు పంపారు. రూ.25 వేల కోట్లు మూసీ రివర్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ కోసం మోదీని అడుగుదాం. ఎందుకియ్యరు? మనం పన్ను కడతలేమా? సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్, అన్నీ మీరే గెలిస్తిరి. మీకు బాధ్యతలేదా?" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ చేరిన సీఎం రేవంత్

- ఉగ్రవాద నియంత్రణ సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- వరద, ఇతర సాయాలపై కేంద్ర మంత్రులను కలిసే అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద నియంత్రణ అంశంపై కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగే సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీ వెళ్లారు. ఆదివారం సాయంత్రమే ఆయన దేశ రాజధాని చేరుకున్నారు. సీఎంతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, హోం శాఖ ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సు అనంతరం ముఖ్యమంత్రి పలువురు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం ఉంది. భారీ వర్షాలు, వరదలు వల్ల రాష్ట్రంలో జరిగిన నష్టానికి అదనపు సాయం కోరడంతోపాటు, రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చిస్తారు. కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్ దొరికితే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వివిధ శాఖల మంత్రులు కూడా సోమవారం ఢిల్లీ వెళతారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర మంత్రులు తమను కలిసేందుకు సమయం ఇవ్వకపోతే సీఎం రేవంత్ సోమవారం రాత్రే రాష్ట్రానికి తిరుగు ప్రయాణమవుతారు. కాగా, హరియాణా, జమ్మూకశ్మీర్ ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వెల్లడైన నేపథ్యంలో.. పార్టీ పెద్దలను కలిసి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు చెబుతారని సమాచారం. అలాగే, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ, హైడ్రా కార్యకలాపాలు, మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల దుమారం తదితర అంశాలపై కూడా పార్టీ పెద్దలతో సీఎం చర్చించే అవకాశముంది.

రుణమాఫీపై తప్పుదారి పట్టిస్తున్నారు

- 50% రైతులకూ రుణమాఫీ జరగలేదు
- సీఎం రేవంత్‌కు హరీశ్ బహిరంగ లేఖ



హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ విషయంలో తెలంగాణ రైతులతో పాటు యావత్ దేశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుదారి పట్టించారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన సీఎంకు బహిరంగ లేఖ రాశారు. రుణమాఫీకి సంబంధించి తాను సమాచార హక్కుచట్టం కింద గత నెల 25న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సేకరించిన వివరాలను పొందుపరిచారు. రాష్ట్రంలో లక్షలోపు రుణం ఉన్న రైతులు 5,74,137 మంది కాగా, కేవలం 2,99,445 మంది రైతులకు మాత్రమే రుణ మాఫీ జరిగిందన్నారు. అలాగే లక్ష నుంచి లక్షన్నర మధ్య రుణం ఉన్న రైతులు 2,62,341 మంది కాగా, ఇప్పటివరకు 1,30,915 మంది రైతులకే రుణమాఫీ అయిందన్నారు. ఎస్‌బీఐ నుంచి అందిన డేటా ప్రకారం సుమారు 5.5 లక్షల మంది రైతులుంటే, వారిలో సుమారు 50% మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఇతర బ్యాంకులకూ దాదాపు ఇలాంటి పరిస్థితులు ఉండే అవకాశం ఉందన్నారు. 2లక్షలకు పైనున్న రుణాలను రైతులు చెల్లించిన తరువాత మాఫీ చేస్తామని ప్రకటించారన్నారు. చాలా మంది రైతులు ఈ మొత్తాన్ని చెల్లించారని, అయినప్పటికీ ఎస్‌బిఐ నివేదిక ప్రకారం రుణమాఫీ జరగలేదన్నారు. చాలా మంది రైతులు ముఖ్యమంత్రి మాటలను నమ్మి వారి పంట రుణమాఫీకి అర్హులు కావడానికి ప్రైవేటు రుణాలను అధిక వడ్డీకి తీసుకున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. పంట రుణమాఫీకి 31 విభిన్న షరతులను పెట్టి చాలా మంది రైతులను అర్హత కోల్పోయేలా చేశారని ఆయన ఆరోపించారు. రుణమాఫీ చేసినట్లు దేశం మొత్తం తప్పుడు ప్రచారం చేసే ముందు, రైతులకు ఇచ్చిన మాఫీ హామీని పూర్తి చేయాలని సీఎంను హరీశ్ డిమాండ్ చేశారు. అలాగే పంట రుణానికి సంబంధించి తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. 6 గ్యారెంటీలతోపాటు రైతు డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ డిక్లరేషన్లపై కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలంటూ ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు.

రైతుల మృతికి రేవంతే కారణం: కేటీఆర్

ఒకేరోజు ముగ్గురు అన్నదాతలు బలి కావడానికి రేవంత్ సర్కారే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. దసరా పండుగవేళ వ్యవసాయాన్ని దండుగలా మార్చిన రేవంత్‌కు రైతన్నల చేతిలో దండన తప్పదంటూ ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు.

మోదీజీ.. రుణమాఫీ లెక్కలివిగో..

(మొదటిపేజీ తరువాయి)

దశ	మాఫీ తేదీ	రైతుల ఖాతాలు	బదిలీ చేసిన నగదు	రైతుల కేటగిరీ
ఒకటో దశ	18 జులై 2024	11,34,412	రూ. 6,034.97 కోట్లు	లక్ష వరకు
రెండో దశ	30 జులై 2024	6,40,823	రూ. 6,190.01 కోట్లు	1.50 లక్షల వరకు
మూడో దశ	15 ఆగస్టు 2024	4,46,832	రూ. 5,644.24 కోట్లు	2 లక్షల వరకు
మొత్తం		22,22,067	17,869.22 కోట్లు	

బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. తెలంగాణలో రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీ ఇచ్చిందని, ఈనాటికీ రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ విమర్శలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం స్పందించారు. "మీరు చేసిన ప్రకటన చూసి ఆశ్చర్యపోయాను. వాస్తవ విరుద్ధంగా ఉన్న మీ ప్రకటన చాలా బాధ కలిగించింది" అని రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖను ట్విటర్‌లో పోస్ట్ చేశారు. రుణమాఫీపై వాస్తవాలు, గణాంకాలను లేఖలో వివరించారు. 22.22 లక్షల మంది రైతులకు రూ.17,869 కోట్ల పైచిలుకు నిధులు విడుదల చేసి, 2 లక్షల వరకు రుణవిముక్తులను చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో పని చేస్తోందని తెలిపారు. రైతులపై ఆర్థిక భారాన్ని, అప్పుల ఒత్తిడిని తగ్గించి.. రాష్ట్ర వ్యవసాయ ఉత్పాదకతకు దోహదపడేలా వారికి అండగా నిలబడుతున్నట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రూ.2 లక్షలకు మించి రుణ బకాయిలున్న అన్నదాతలు కూడా ఉన్నారని.. వారు 2 లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని చెల్లించిన తర్వాత, వారికి కూడా రూ.2 లక్షలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చినట్లు స్పష్టంచేశారు. రాష్ట్రంలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేందుకు రూ.31 వేల కోట్లు వెచ్చించనున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 'రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మీ మద్దతు చాలా అవసరం. రైతుల సంక్షేమానికి, రాష్ట్రంలో వ్యవసాయరంగ అభివృద్ధికి మీ సహాయ సహకారాలు ముఖ్యం. రైతుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా, కష్టపడి పనిచేసే రైతాంగంలో విశ్వాసాన్ని పెంపొందించడానికి మీరు, మేము కలిసి కృషి చేద్దాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానికి విజ్ఞప్తి చేశారు. పూర్తి పారదర్శకత కోసం రుణమాఫీకి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంకితభావంతో చేస్తున్న ప్రయత్నాలు రైతుల సంక్షేమానికి దోహదపడతాయని దృఢంగా నమ్ముతున్నట్లు సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో రైతుల సంక్షేమాన్ని ప్రోత్సహించే ప్రయత్నంలో భాగస్వాములు కావాలని, పూర్తి సహకారం అందించాలని ప్రధానమంత్రి మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు.



చదువుల తల్లికి ఆర్థిక కష్టం

- ఎంబీబీఎస్‌లో సీటు వచ్చినా... వెళ్లలేని పరిస్థితి
- వెలుగులోకి తెచ్చిన ఏబీఎన్- ఆంధ్రజ్యోతి
- స్పందించిన మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్

ఖమ్మం, అక్టోబరు 6: అమ్మనాన్న లేకున్నా ఆసక్తితో చదివింది. అమ్మమ్మ, తాతయ్యల వద్ద ఉంటూనే వైద్యురాలు కావాలనే కసితో కష్టపడి చదివి ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించింది. సీటు సంపాదించినప్పటికీ కాలేజీలో చేరేందుకు కూడా అవసరమైన డబ్బులు లేక ఇబ్బందిపడుతోంది. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం దుద్దిపుడి గ్రామానికి చెందిన శ్రీహర్షిత అంబేద్కర్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేసి, మరో సంవత్సరం లాంగ్‌టర్మ్ తీసుకొని నీట్‌లో ర్యాంకు సంపాదించి వనపర్తి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో సీటు కూడా దక్కించుకొంది. అయితే తనను పెంచిన అమ్మమ్మ తాతయ్యలు పేదవారు కావడంతో ఆర్థిక సాయం చేయమని దాతలను కోరింది. ఈ విషయాన్ని ఏబీఎన్- ఆంధ్రజ్యోతి చానెల్ వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు తనయుడు యుగంధర్ ఆమెకు అండగా ఉంటానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చారు.

విద్యలో ప్రపంచంతో పోటీ

రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

- పైలట్ ప్రాజెక్టుగా 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు
- దసరా ముందు రోజు భూమి పూజ
- వచ్చే దసరాకు స్కూళ్ల నిర్మాణం పూర్తి: భట్టి విక్రమార్క


సచివాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తెలంగాణలో విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతామని, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, సౌకర్యాలు కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని రకాల రెసిడెన్షియల్ స్కూళ్లను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు, వీటిని ఇకపై 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'గా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం రూ.5000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం సచివాలయంలో యంగ్ ఇండియా స్కూళ్లకు సంబంధించిన వివరాలను వీడియో ప్రజెంటేషన్ ద్వారా మీడియాకు వివరించారు. కార్యక్రమాన్ని ఇదే వేదిక నుంచి ఆరంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రస్తుతం విడివిడిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు ఇకపై ఒకే క్యాంపస్‌లో ఉంటాయని చెప్పారు. దీనివల్ల సమాజంలోని అన్ని వర్గాల పిల్లలు ఒకేచోట ఉండి విద్యాభ్యాసం చేస్తారన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను పైలట్ ప్రాజెక్టుగా ముందు 20 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొదలుపెడుతున్నామని, ఈ దసరా ముందురోజు భూమి పూజ చేసి.. వచ్చే దసరా నాటికి వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ స్కూళ్లు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, అచ్చంపేట, తిరుమలగిరి, తుంగతుర్తి నియోజక వర్గాల్లో తొలిదశ పనులు మొదలవుతాయని భట్టి విక్రమార్క వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తాము చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 6.29 లక్షల మంది విద్యార్థులు లబ్ధిపొందుతారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలోని పాఠశాలల స్థితిగతులు మార్చేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు.

దేవీ నవరాత్రులు

నేటి అలంకరణ

శ్రీ మహాచండీదేవి

ఆశ్వీయుజ శుద్ధ పంచమి, సోమవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఐదో రోజున విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ మహాచండీదేవిగా దర్శనమిస్తారు. దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాలక్ష్మీ, మహాకాళీ, మహాసరస్వతుల త్రిశక్తి స్వరూపిణిగా శ్రీమహాచండీ



అమ్మవారు ఉద్భవించారు. ఆమెలో అందరు దేవతలు కొలువై ఉన్నారు. అందుకే శ్రీమహాచండీ దేవిని ప్రార్థిస్తే సకల దేవతలను ప్రార్థించినట్టేనంటారు పెద్దలు. శ్రీమహాచండీ అనుగ్రహం వల్ల విద్య, కీర్తి, సంపదలు లభిస్తాయి. శత్రువులు మిత్రులుగా మారతారు. ఏ కోరికలతో భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తారో ఆ కోరికలన్నీ సిద్ధిస్తాయనేది భక్తుల విశ్వాసం.

నైవేద్యం: కదంబం, చక్కెర పొంగలి, పులిహోర, లడ్డూ, రవ్వకేసరి, కట్టె పొంగలి

వేడుక



నేడు అలిగిన బతుకమ్మ

బతుకమ్మ వేడుకల్లో ఆరో రోజైన ఆశ్వయుజ శుద్ధ పంచమి (సోమవారం) నాడు అలిగిన బతుకమ్మగా వ్యవహరిస్తారు. పూర్వకాలంలో బతుకమ్మలను పేర్చే సమయంలో మాంసం ముద్ద తగిలి అపచారం జరిగిందట. అందుకని ఈ రోజు బతుకమ్మ అలిగి ఏదీ తినదంటారు. కాబట్టి ఈ రోజు పూలతో బతుకమ్మలను తయారు చెయ్యరు. నైవేద్యం కూడా ఏదీ సమర్పించరు. బతుకమ్మ అలక తీరాలని మహిళలు ప్రార్థిస్తారు.

గ్యారంటీ కస్టమ్స్!

హామీ ఇస్తేనే కస్టమ్ మిల్లింగ్‌కు వడ్లు.. అప్పుడే మిల్లర్లను నియంత్రించవచ్చని భావన

- ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల్లో 100% గ్యారెంటీ
- దీన్నే అనుసరించాలని సర్కారు యోచన
- సీఎం ఆదేశాలతో పౌరసరఫరాల కసరత్తు

25% గ్యారెంటీకే అంగీకరించని మిల్లర్లు!



హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీ తీసుకున్న తర్వాతే కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యాన్ని అప్పగించాలని సర్కారు ఇప్పటికే నిర్ణయించింది. ధాన్యం విలువలో 25 శాతం బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలని కూడా అధికారులు స్పష్టం చేశారు. దీనిని మిల్లర్లు వ్యతిరేకిస్తున్నారు. సీఎంఆర్ తీసుకోబోమని స్పష్టం చేస్తున్నారు. కానీ, కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు అప్పనంగా ఇవ్వకూడదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే, ఇతర రాష్ట్రాల తరహాలో 100 శాతం బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిసా ప్రభుత్వాలు 100 శాతం బ్యాంకు గ్యారెంటీ ఇస్తేనే మిల్లర్లకు ధాన్యం ఇస్తున్నాయి. మన రాష్ట్రంలో కూడా 100 శాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పౌర సరఫరాల కార్పొరేషన్‌కు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఈ అంశంపై అధికారులు మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. అయితే, 25 శాతం బ్యాంకు గ్యారెంటీకే అంగీకరించని మిల్లర్లు.. 100 శాతం బ్యాంకు గ్యారెంటీకి ఒప్పుకొంటారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మొత్తంమీద ధాన్యానికి బ్యాంకు గ్యారెంటీపై ఉత్కంఠ నెలకొంది.

ఇతర రాష్ట్రాల్లో..

ఆంధ్రప్రదేశ్‌లో బోనస్ సిస్టమ్ లేదు. అక్కడ కనీస మద్దతు ధరకే ధాన్యం కొంటున్నారు. కానీ, మిల్లర్ల నుంచి వంద శాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిసాలో కూడా 100 శాతం గ్యారెంటీ తీసుకొని మిల్లర్లకు ధాన్యం అప్పగిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిసాల్లో క్వింటాకు రూ.3,100 చొప్పున ధాన్యం సేకరిస్తున్నారు. దీంతో అక్కడ బ్యాంకు గ్యారెంటీ విధానాన్ని అమలు చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించింది. క్వింటా రూ.2,800 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రకటించింది. దీంతో ఇక్కడా 100 శాతం బ్యాంకు గ్యారెంటీ అమలు చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్తులు తాకట్టు పెట్టి బ్యాంకు గ్యారెంటీ లెటర్ తెస్తే.. మిల్లర్లకు బాధ్యత, భయం ఉంటాయని.. నిబంధనల మేరకు కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను అందిస్తారనే ప్రతిపాదన వచ్చింది. ఇప్పటికే ఖరీఫ్ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో బ్యాంకు గ్యారెంటీపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోనుంది. అదే క్రమంలో బ్యాంకు గ్యారెంటీ ఇచ్చినప్పటికీ డిఫాల్టర్లకు ధాన్యం ఇవ్వకూడదనే అంశంపైనా చర్చిస్తున్నట్లు సమాచారం.

మధ్యంతర గోదాములకు ధాన్యం!

మిల్లర్లు అడిగినా, అడగకపోయినా, సామర్థ్యం లేకపోయినా ధాన్యం దించేయకుండా మధ్యంతర (ఇంటర్మీడియట్) గోదాముల్లో ధాన్యం నిల్వ చేయాలనే ప్రతిపాదన కూడా ప్రభుత్వం ముందుకు వచ్చింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన తర్వాత సెంటర్లలో నిల్వ చేసే అవకాశం లేకపోవడంతో గత్యంతరం లేక మిల్లుల్లో ధాన్యం దింపాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మధ్యంతర గోదాములు ఏర్పాటు చేసుకొని నిల్వ చేయడమే మేలనే ప్రతిపాదన వచ్చింది. అప్పుడు ధాన్యం రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉంటుంది. ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు మిల్లింగ్ చేయించుకోవచ్చు. ఈ సీజన్‌లో 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మధ్యంతర గోదాములకు తరలించాలనే అంశంపై చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో 1,287 గోడౌన్లు ఉన్నాయి. మొత్తం సామర్థ్యం 65 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. ప్రస్తుతం 36 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు, ఎరువుల నిల్వలు ఉన్నాయి. ఇంకా 26 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వలు పట్టే జాగా ఖాళీగా ఉంది. దీనికి తోడుగా మరికొంత ప్రైవేటు స్థలం తీసుకొని మధ్యంతర గోదాముల్లో ధాన్యం నిల్వచేసే అంశంపై కసరత్తు జరుగుతోంది. అయితే జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో సన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేయించి, దొడ్డు ధాన్యాన్ని మాత్రం గోదాములకు తరలించే సూచనలు కనిపిస్తున్నాయి.

సన్నధాన్యం మిల్లింగ్‌పై మిల్లర్ల మడతపేచీ

సన్నధాన్యం మిల్లింగ్ చేస్తే వచ్చే బియ్యం పరిమాణంపై మిల్లర్లు పేచీ పెడుతున్నారు. దొడ్డు బియ్యం వచ్చినట్లుగా 67 శాతం సన్నబియ్యానికి రాదని, 58- 60 శాతం మేరకే వస్తుందని చెబుతున్నారు. సన్న ధాన్యం మిల్లింగ్ చేస్తే నష్టపోతామని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. క్వింటా ధాన్యం తీసుకొని, 67 కిలోల బియ్యం ఇవ్వడం ద్వారా 7 కిలోలు నష్టపోతామని, దానికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎఫ్‌సీఐ మార్గదర్శకాలకు అనుగుణంగానే కస్టమ్ మిల్లింగ్ చేయాలని, ఒక్కో రాష్ట్రానికి ఒక్కో నిబంధన ఉండదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ మిల్లర్లకు స్పష్టంచేశారు. నష్టపరిహారం ఇవ్వకుండా ధాన్యం ఇస్తే తీసుకునేది లేదని మిల్లర్లు ప్రభుత్వానికి సంకేతాలు పంపుతున్నారు.

ఇడ్లీ బండికీ రిజిస్ట్రేషన్

(మొదటి పేజీ తరువాయి)

నమోదు కావాల్సిందే. దీనిని తొలుత హైదరాబాద్‌లో అమలు చేయనున్నారు. దశలవారీగా జిల్లాల్లోని వ్యాపారులకూ వర్తింపజేయనున్నారు. రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ ఈ మేరకు కసరత్తు పూర్తి చేశారు. రాష్ట్రంలో వీధి వ్యాపారులు వేలల్లో ఉన్నా ఒక గుర్తింపు లేదు. వారు అందించే ఆహారం నాణ్యతపై అనేక అనుమానాలుంటాయి. ఇలాంటివారిని క్రమబద్ధీకరించడంతో పాట ఎఫ్ఎస్ఎస్ చట్టంలోకి తీసుకురావాలని ఆహార భద్రతా విభాగం నిర్ణయించింది. దేశంలోనే తొలిసారి వీధి ఆహార వ్యాపారులందరికీ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. అయితే, రిజిస్ట్రేషన్ కోసం వీరంతా ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. ఆహార భద్రతా విభాగం అధికారులే.. అల్పాహారాన్ని అందించే బండ్ల వద్దకు వస్తారు. విక్రేతల ఆధార్ కార్డు ఆధారంగా అప్పటికప్పుడే రిజిస్ట్రేషన్ పూర్తి చేసి ధ్రువపత్రం జారీ చేస్తారు. కేవలం రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. దీనిని ఏటా చెల్లించాల్సి ఉంటుంది. వాస్తవానికి ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేయాలనుకున్నా.. వ్యాపారుల్లో బాధ్యత, జవాబుదారీతనం పెంపునకు నామమాత్ర రుసుము తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా, రిజిస్ట్రేషన్‌తో సరిపెట్టకుండా.. ఆహార పదార్థాల పరిశుభ్రత పాటించడంలో ప్రాథమిక శిక్షణ అందించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. భారత జాతీయ వీధి వ్యాపారుల సంఘం (ఎన్ఏఎస్‌వీఐ) సహకారం, నెస్లే ఇండియా స్పాన్సర్‌షిప్‌తో ఇప్పటికే హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా 3 వేల మందికి శిక్షణ ఇచ్చారు. ఆహార తయారీలో మంచి పద్ధతులతో పాటు ముడి పదార్థాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. శిక్షణ తర్వాత నెస్లే ఇండియా యాప్రాన్, గ్లోవ్స్, హెడ్‌క్యాప్, టవల్ తదితరాలతో కూడిన కిట్‌ను అందిస్తారు. శిక్షణ తాలూకు ధ్రువపత్రాలను జారీ చేస్తారు. కాగా, రిజిస్ట్రేషన్‌తో వ్యాపారులకు గుర్తింపు వస్తుంది. వినియోగదారుల్లో- ఆహార పదార్థాల నాణ్యతపై నమ్మకం కలుగుతుంది. వ్యాపారులపై అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం లభిస్తుంది. జీహెచ్ఎంసీ, మునిసిపల్, పోలీసు విభాగాల నుంచి వేధింపులు కూడా ఉండవు.

ముద్ర రుణాలు వస్తాయి..



రిజిస్ట్రేషన్ ద్వారా వ్యాపారులకు గుర్తింపుతో పాటు ముద్ర రుణాల వంటివి వచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నాం. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రయోగాత్మకంగా ఇప్పటికే కొంతమందికి శిక్షణ, ధ్రువపత్రాలు ఇచ్చాం. సుమారు 25-30 వేలమంది వీధి ఆహార వ్యాపారులు ఉంటారని అంచనా. వారందర్నీ ఎఫ్ఎస్ఎస్ యాక్టులోకి తెస్తాం.

-ఆర్వీ కర్ణన్, రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్

ఈబీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరేంటి?

- ఈబీసీ సంక్షేమ సంఘం నిలదీత

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ల విషయంలో అధికార కాంగ్రెస్ తన వైఖరేంటో స్పష్టం చేయాలని ఈబీసీ సంక్షేమ సంఘం ఆదివారం డిమాండ్ చేసింది. అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లపై కొందరు ఫిర్యాదులిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. కుల విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఓ ప్రకటనలో మండిపడింది. ఈబీసీల జోలికొస్తే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి హెచ్చరించారు. ఈబీసీల అభ్యున్నతికి తెలంగాణతో పాటు దేశంలో ప్రత్యేక ఈబీసీ కార్పొరేషన్, ఈబీసీ స్టడీ సర్కిల్స్, ఈబీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

'గాంధీ' నుంచి డిశ్చార్జి అయిన ఆదివాసీ మహిళ

అడ్డగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల ఘటనలో తీవ్ర గాయాలపాలై గాంధీ ఆస్పత్రిలో 40 రోజుల పాటు చికిత్స పొందిన ఆసిఫాబాద్‌కు చెందిన ఆదివాసీ మహిళ ఆదివారం డిశ్చార్జి అయ్యారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని గాంధీ వైద్యులు ప్రకటించారు. డిశ్చార్జి సమయంలో అక్కడే ఉన్న మంత్రి సీతక్క.. ఆమెను సొంతూరికి పంపేందుకు ప్రత్యేక కారును ఏర్పాటు చేశారు. కాగా, మంత్రి సీతక్క ఆరుసార్లు ఆస్పత్రికి వచ్చారని, అలాగే ప్రతిరోజూ ఫోన్‌లో యోగక్షేమాలు కనుక్కోవడంతో పాటు వైద్యఖర్చులకు సహాయం చేశారని, తమ కుటుంబం ఎప్పుడూ రుణపడి ఉంటుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

లడ్డూ వివాదానికి సిట్ ముగింపునివ్వాలి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



తిరుమల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ప్రసాదం విషయంలో జరుగుతున్న గందరగోళానికి సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన సిట్ బృందం ముగింపునివ్వాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వేంకటేశ్వరస్వామి ప్రసాదం విషయంలో వచ్చిన గందరగోళానికి సుప్రీం కోర్టు తొందరగానే తెరదించిందన్నారు. దీనిపై ఏర్పాటు చేసిన సిట్.. విచారణను వేగవంతంగా చేయాలన్నారు.

బ్యాక్‌లాగ్‌కు చెక్

- ముందు స్కూల్ అసిస్టెంట్.. తర్వాత ఎస్‌జీటీల జాబితా
- రెండిటికీ ఎంపికైతే వారికి స్కూల్ అసిస్టెంట్ కొలువు
- ఎస్జీటీ పోస్టుకు రెండో స్థానంలో ఉన్న అభ్యర్థికి చాన్స్
- టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా నేడు
- 9న సీఎం రేవంత్ చేతులమీదుగా నియామక పత్రాలు

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రక్రియలో 'బ్యాక్‌లాగ్'కు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించి, ఫలితాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. సర్టిఫికెట్ల పరిశీలనకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి.. ఆదివారంతో ఆ ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు. అనంతరం 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయడంపై అధికారులు దృష్టి పెట్టారు. మొదట స్కూల్ అసిస్టెంట్, తర్వాత ఎస్‌జీటీ అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. దీనివల్ల ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపిక కాకుండా చూడవచ్చని భావిస్తున్నారు. ఎవరైనా రెండు పోస్టులకూ ఎంపికైతే.. స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఇచ్చి.. ఎస్‌జీటీ జాబితా నుంచి ఆ అభ్యర్థి పేరును తొలగిస్తారు. ఎస్‌జీటీ పోస్టుకు రెండో స్థానంలో ఉన్న అభ్యర్థిని ఎంపిక చేస్తారు. దీనివల్ల బ్యాక్‌లాగ్ (పోస్టులు భర్తీ కాకుండా మిగిలిపోవడం) లేకుండా చూడవచ్చని అధికారులు భావిస్తున్నారు. అభ్యర్థుల జాబితా సిద్ధమైన తర్వాత వారికి ఈ నెల 8న ఈ-మెయిల్, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చే అవకాశం ఉంది. వారు ఈ నెల 9న ఎల్బీ స్టేడియంకు రావాల్సి ఉంటుంది. అక్కడ 33 జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లలో నియామక పత్రాలు అందించనున్నారు. 9న సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దాదాపు పదివేలకు పైగా ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను ఆయా జిల్లా కలెక్టర్లు పూర్తి చేశారన్నారు. సోమవారం సాయంత్రంలోగా తుది జాబితాను పాఠశాల విద్యా కమిషనర్ జిల్లా కలెక్టర్లకు అందజేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులు 9న మధ్యాహ్నం 2 గంటల్లోపే ఎల్బీ స్టేడియంకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. వారిని హైదరాబాద్ తీసుకొచ్చేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, ప్రతి బస్సులో ఒక పోలీసు కానిస్టేబుల్, సమన్వయ అధికారిని నియమించాలని ఆదేశించారు. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులూ వచ్చే అవకాశం ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులను ఎల్బీ స్టేడియం సమీపంలోనే దించేందుకు, బస్సుల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికాకు మంత్రి జూపల్లి

రేపు లాస్‌ఏంజెల్స్, 9,10న లాస్‌వెగాస్

11న అట్లాంటాలో జరిగే కార్యక్రమాలకు మంత్రి హాజరు



హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఐమెక్స్-2024 పేరిట లాస్‌వేగాస్‌లో జరుగనున్న అతిపెద్ద వాణిజ్య ప్రదర్శనలో పాల్గొనేందుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అమెరికా వెళ్లారు. దుబాయ్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఆయన ఆదివారం అమెరికా చేరుకున్నారు. సోమవారం వాషింగ్టన్ డీసీ వెళతారు. 8న లాస్‌ఏంజెల్స్, 9,10న లాస్‌వెగాస్, 11న అట్లాంటాలో నిర్వహించే పర్యాటక ప్రోత్సాహక కార్యక్రమాలు, రోడ్‌షోల్లో మంత్రి పాల్గొంటారు. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే సరఫరాదారులు, కొనుగోలుదారులను ఒకచోట చేర్చే అంతర్జాతీయ గమ్యస్థానంగా ఐమెక్స్ నిలవనుంది. అమెరికా ఐమెక్స్ అతిపెద్ద వాణిజ్య ప్రదర్శనలో అమెరికా, ఇండియా, కెనడా, మెక్సికో, బ్రెజిల్, దుబాయ్ సహా పలు దేశాలు పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో మంత్రి జూపల్లి పాల్గొని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటక రంగంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చిస్తారు. అలాగే అక్కడ ఉన్న ప్రవాసీ తెలంగాణ కుటుంబాలు నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో మంత్రి జూపల్లి పాల్గొంటారని, 12న ఆయన భారత్ తిరిగి చేరుకొంటారని అధికారులు పేర్కొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

నా పాత్ర ఎంతో ప్రత్యేకం

'ఈగల్', 'డబుల్ ఇస్మార్ట్' చిత్రాల బ్యూటీ కావ్య థాపర్ కథానాయికగా నటించిన సినిమా 'విశ్వం'. శ్రీనువైట్ల దర్శకత్వంలో గోపీచంద్ కథానాయకుడిగా టీ.జీ.విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మించారు. ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను కావ్య థాపర్ మీడియాతో పంచుకున్నారు. "ఇందులో నా పాత్ర ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. నాది నెగెటివ్ ఛాయలున్న పాత్ర. ఆద్యంతం వినోదం పంచుతుంది. చాలామంది కమెడియన్స్ ఇందులో నటించారు. ఈ సినిమా కోసం శ్రీనువైట్ల చాలా కష్టపడ్డారు. గోపీచంద్‌తో నటించడం మర్చిపోలేని అనుభవం. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది" అని చెప్పారు.



నవంబరులో దేవకి నందన



'హీరో' ఫేమ్ అశోక్ గల్లా నటించిన చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. నవంబరు 14న ఈ చిత్రం విడుదలవనుంది. ఈ సందర్భంగా నిర్మాత బాలకృష్ణ మాట్లాడుతూ "కథ, మాటలు, పాటలు.. ఇలా అన్నీ చక్కగా కుదిరిన చిత్రమిది. తప్పకుండా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని పంచుతుంది" అని అన్నారు. "ఈ సినిమాకు ప్రశాంత్ వర్మ అద్భుతమైన కథ అందించారు. ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని దర్శకుడు అర్జున్ చెప్పారు. "ఇదో యూనిక్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. ప్రతీ పాత్ర ప్రత్యేకంగా ఉంటుంది" అని హీరో అశోక్ గల్లా తెలిపారు.

మిస్టర్ సెలబ్రిటీ మెప్పిస్తోంది



పరుచూరి సుదర్శన్ హీరోగా రవికిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ సెలబ్రిటీ'. చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మౌత్ టాక్‌తో ప్రేక్షకాదరణ పొందుతుండడం సంతోషాన్ని కలిగిస్తోందని చిత్రబృందం ఆదివారం నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో తెలిపింది.

ఓ అభిమాని కోరిక



సినీ పాత్రికేయుడు, నటుడు సురేశ్ కొండేటి కథానాయకుడిగా 'అభిమాని' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'ఓ అభిమాని కోరిక' అనేది ట్యాగ్‌లైన్. రాంబాబు దోమకొండ దర్శకత్వంలో ఎస్‌కే రహ్మాన్, కంద సాంబశివరావు నిర్మిస్తున్నారు. శనివారం దర్శకుడు కె. రాఘవేంద్రరావు చేతుల మీదుగా గ్లింప్స్ విడుదల చేశారు. యమలోకం నేపథ్యంలో సాగే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు. సంగీతం: డ్రమ్స్ రాము.



దీపావళికి రానున్న నిఖిల్

హీరో నిఖిల్ సిద్ధార్థ్, దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. 'సప్త సాగరాలు దాటి' ఫేమ్ రుక్మిణీ వసంత్ కథానాయిక. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాకు "అప్పుడో ఇప్పుడో ఎప్పుడో" అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సినిమాను దీపావళికి విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రంలో దివ్యాంశ కౌశిక్, హర్ష చెముడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎడిటర్: నవీన్ నూలి, సినిమాటోగ్రఫీ: రిచర్డ్ ప్రసాద్. కాగా, సుధీర్ వర్మ దర్శకత్వంలో నిఖిల్ 'స్వామిరారా', 'కేశవ' సినిమాల్లో నటించిన సంగతి తెలిసిందే.

మీ మధ్య ఉన్న తేడా అదే

● ప్రకాష్ రాజ్‌పై నిర్మాత వినోద్ కుమార్ ట్వీట్



తన సొంత రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి డిపాజిట్ కోల్పోయిన ఓ జోకర్... విజేతలు కూర్చొన్న వేదికను పంచుకోవడం గర్వంగా భావిస్తున్నారంటూ సినీ నటుడు ప్రకాష్ రాజ్‌ను ఉద్దేశించి కోలీవుడ్ నిర్మాత ఎస్.వినోద్ కుమార్ ట్వీట్ చేశారు. శనివారం చెన్నైలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ప్రకాష్ రాజ్ పాల్గొని 'మన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సమానత్వం గురించి మాట్లాడుతుంటారు. మరొకరు ఉన్నారు 'స'కారం (సనాతన ధర్మం) గురించి మాట్లాడుతారంటూ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేరు ప్రస్తావించకుండా సెటైర్లు వేశారు. దీనిపై నిర్మాత వినోద్ కుమార్ ట్వీట్ చేశారు. 'నీ పక్కన కూర్చొన్న ముగ్గురు వ్యక్తులు ఎన్నికల్లో విజయం సాధించారు. నీవేమో డిపాజిట్లు కూడా కోల్పోయావు. మీ మధ్య ఉన్న తేడా అదే. ఒక సినిమా షూటింగులో మాకు ఒక్కమాట కూడా చెప్పకుండా క్యారవాన్ నుంచి వెళ్ళి, రూ.కోటి నష్టం వాటిల్లేలా చేశావు. అలా చేయడానికి కారణం ఏమిటి? జస్ట్ ఆస్కింగ్? కాల్ చేసి జరిగిందంతా చెప్తానన్నావ్. కానీ ఇప్పటివరకు కాల్ చేయలేదు' అని పేర్కొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

పైనుంచి ఆదేశాలు అందాయా...

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎమ్జీఆర్ సేవలను స్మరించుకుంటూ శనివారం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌పై ప్రకాశ్‌రాజ్ స్పందించారు. 'హఠాత్తుగా ఎమ్జీఆర్‌పై ఎందుకింత ప్రేమో... పై నుంచి ఆదేశాలు అందాయా..'అంటూ ఆదివారం వ్యంగంగా ట్వీట్ చేశారు.

ఐన్‌స్టీన్‌కు కూడా కష్టమే

మంత్రి కొండా సురేఖ ఆరోపణలపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'కొండా సురేఖ తుపాకి గురిపెట్టింది కేటీఆర్‌కు, కాల్చింది మాత్రం నాగార్జున, నాగచైతన్యను, క్షమాపణ చెప్పిందేమో సమంతకు...ఐన్‌స్టీన్ కూడా ఈ ఈక్వేషన్‌ను పరిష్కరించలేడేమోనని నా డౌట్' అంటూ ఆయన ట్వీట్ చేశారు.

మళ్లీ వీఆర్వోల సేవలు

ప్రతి రెవెన్యూ గ్రామానికీ రెవెన్యూ అధికారి.. కొత్త రెవెన్యూ చట్టం రాకముందే పునరుద్ధరణ

» స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లతో భేటీలో..

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి



డిప్యూటీ కలెక్టర్లతో ముఖాముఖిలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ వీఆర్వో, వీఆర్ఏల సేవలను వినియోగించుకోనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని, కొత్త రెవెన్యూ చట్టం రాకముందే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఆదివారం రాష్ట్రంలోని 272 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీఐలో మంత్రి పొంగులేటి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలతో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని ఆరోపించారు. మళ్లీ అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉద్యోగులను, మేధావులను సంప్రదించి వారి సూచనలు, సలహాలు స్వీకరించామన్నారు. తెలంగాణ కొత్త రెవెన్యూ చట్టాన్ని దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా తీసుకువస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణితో ఎదురైన కష్టాల నుంచి విముక్తి కల్పించేలా దీనిని రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. కొత్త చట్టానికి సంబంధించి నల్లగొండ జిల్లాలోని తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూముల రికార్డులు టాంపరింగ్‌కు గురి కాకుండా డిజిటలైజేషన్ చేయనున్నట్లు ప్రకటించారు.

ఉద్యోగులందరికీ శిక్షణ..

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారితోపాటు సర్వీసులో ఉన్న ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఉద్యోగులకు జాబ్ చార్ట్ రూపొందించాలని, దీనిపై కమిటీని ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఉద్యోగుల సంబంధించి పదోన్నతుల వంటి ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఇక రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను కొత్తగా తీసుకువస్తామని, అలాగే 17 మంది సీనియర్ అదనపు కలెక్టర్ క్యాడర్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను పూర్వ స్థానాలకు బదిలీ చేయడానికి దసరాలోపే నిర్ణయం తీసుకుంటామన్నారు. వాహనాల అద్దెలను ఈ నెలాఖరు వరకు 50 శాతం క్లియర్ చేస్తామన్నారు. గత ప్రభుత్వం మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను పెంచింది తప్ప.. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదని మంత్రి ఆరోపించారు. దాదాపు 200 మండలాలకు సొంత భవనాలు లేవన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, తెలంగాణ స్టేట్ సివిల్ సర్వీసెస్ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి భాస్కర్‌రావు, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో

పాలపిట్ట పండుగ

హైదరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న పాలపిట్ట పండుగ, వన్యప్రాణి వారోత్సవాల్లో జంతు, ప్రకృతి ప్రేమికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దసరా సెలవుల సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో జంటనగరాల నుంచే కాకుండా పరిసర ప్రాంతాల నుంచి జంతుప్రేమికులు తరలివచ్చారని ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ తెలిపారు. విజయదశమి సందర్భంగా తెలంగాణలో పాలపిట్టను దర్శించడం శుభప్రదంగా భావిస్తారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా అడవుల్లో లభ్యమయ్యే వివిధ రకాల ఔషధమొక్కలు వాటి ప్రాధాన్యాన్ని డాక్టర్ వీర కిషోర్ సందర్శకులకు వివరించారు. పాములు, పర్యావరణంలో వాటి ప్రాముఖ్యాన్ని, వాటిపై మూఢ నమ్మకాలు, వివిధ పాములు కాటు వేసినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యులు శ్రీని, రాకేష్ వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

హైదరాబాద్ ● సోమవారం 7 అక్టోబరు 2024

diksuchi@andhrajyothy.com

ప్రపంచం కాలుష్య భరితమైపోతోంది. కర్బన ఉద్గారాలు అధికమవుతున్నాయి. మానవాళి ఆరోగ్య భద్రత ప్రమాదంలో పడింది. ప్రపంచ దేశాలను మేలుకొలిపిన పరిణామాలివి. వాతావరణంలో కర్బన ఉద్గారాలను అవి సంకల్పించాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలోనూ శీతాకాలం వచ్చిందంటే దట్టంగా అలముకునే కాలుష్య మేఘాలు ఏటా వార్తలకెక్కుతున్నాయి. ధూళి కణాలు పొగమంచుతో కలిసి ప్రజలను శ్వాసకోశ సమస్యల బారిన పడేసి వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. పంజాబ్, హరియాణ రైతులు పంట నూర్పిళ్ల అనంతరం వాటిని తగలపెట్టడం, పరిశ్రమలు వెదజల్లే పొగలు, వాహనాల నుంచి వెలువడే పొగలు ఇందుకు కారణం.



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

పీఎం ఈ-డ్రైవ్

పర్యావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ముఖ్యంగా వాహనాల విషయంలో కేంద్రం అనేక పథకాలను ప్రవేశపెడుతోంది. పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాల సంఖ్యను క్రమంగా తగ్గించడానికి సంకల్పించి ఒక్కొక్కటిగా పథకాలను ప్రవేశపెడుతూ వస్తోంది. 2015 ఫేమ్(ఎఫ్ఏఎంఈ) తొలిదశతో మొదలైన ఈ పథకాల పరంపర, తరవాత ఫేమ్-2, ఫేమ్-3 దశలను అధిగమించి ప్రస్తుతం పీఎం ఈ-డ్రైవ్ వరకు వచ్చింది. దేశంలో తిరుగుతున్న పెట్రోలు, డీజిల్ ఇంధన వాహనాలను క్రమంగా తగ్గించి రోడ్లపై విద్యుత్ వాహనాల సంచారం పెంచడానికి అనువుగా ఈ పథకాలు రూపుదిద్దుకున్నాయి.

దేశంలో 2016లో గల విద్యుత్ వాహనాల(ఈవీ-ఎలక్ట్రిక్ వెహికిల్స్) సంఖ్య కేవలం 4,800. అయితే అప్పటికే చైనాలో వాటి సంఖ్య 4.8 లక్షలు. కేంద్రం వివిధ పథకాల ద్వారా ప్రకటించిన రాయితీల వల్ల వినియోగదారులు ఈవీల పట్ల ఆకర్షితులు కావడంతో దేశంలో వాటి సంఖ్య ఇప్పటికి 30 లక్షలకు చేరడం శుభపరిణామం. కానీ చేయాల్సింది ఎంతో ఉంది. 2015 నాటికి దేశంలో గల ఈవీలు కేవలం వందల్లోనే. ప్రజలకు ఈవీలపై అవగాహన పెంచి, అపోహలను తొలగించి, కొనుగోళ్లకు రాయితీలివ్వడం, రిజిస్ట్రేషన్ ఫీజు, పన్ను వెసులుబాట్లు కల్పించడం వంటివి ఫేమ్-1లో ప్రధానంగా ఉన్నాయి.

దేశంలో 2016లో గల విద్యుత్ వాహనాల(ఈవీ-ఎలక్ట్రిక్ వెహికిల్స్) సంఖ్య కేవలం 4,800. అయితే అప్పటికే చైనాలో వాటి సంఖ్య 4.8 లక్షలు. కేంద్రం వివిధ పథకాల ద్వారా ప్రకటించిన రాయితీల వల్ల వినియోగదారులు ఈవీల పట్ల ఆకర్షితులు కావడంతో దేశంలో వాటి సంఖ్య ఇప్పటికి 30 లక్షలకు చేరడం శుభపరిణామం.

ఫేమ్(ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్) పథకం

2015లో మొదలై, 2019లో ముగిసింది. దీనికి రూ.795 కోట్లను కేటాయించారు. దాదాపు 2.8 లక్షల ఈవీలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. ఈవీలకు ప్రోత్సాహం, బస్సుల మంజూరు, మౌలిక సౌకర్యాల కల్పన, గిరాకీ(డిమాండ్) పెంచడం ఈ పథకం ప్రధాన నిర్దేశిత లక్ష్యాలు. తొలిరోజుల్లో హైబ్రీడ్ అంటే విద్యుత్, పెట్రోల్ రెండింటి మీద నడిచే వాహన వినియోగానికి ప్రోత్సాహం కలిపించారు. క్రమేణా ఈవీల ఉత్పత్తి పెరగడంతో హైబ్రీడ్ విధానం మందగించింది. జాతీయ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ ప్లాన్(ఎన్ఈఎంఎంపీ)లో ఫేమ్ ఒక భాగం.

2019లో తొలిదశ గడువు ముగిశాక, ఫేమ్-2 ఆరంభమైంది. 2024, మార్చి 31కి దీని గడువు పూర్తయింది. తరవాత జూలై 31 వరకు పథకాన్ని పొడిగించారు. రెండోదశకు పదివేల కోట్లు ప్రత్యేకించారు. ఈ పథకం ద్వారా ఎనిమిది లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు, 76,200 త్రిచక్ర వాహనాలు, 12,400 ఫోర్ వీలర్స్, 4,600 ఎలక్ట్రిక్ బస్సులకు లబ్ధి చేకూరింది.

పీఎం ఈ-డ్రైవ్ పథకం(పీఎం ఎలక్ట్రిక్ డ్రైవ్ రివల్యూషన్ ఇన్ ఇన్నోవేటివ్ వెహికిల్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీమ్)

ఫేమ్ పథకం మలిదశ కూడా పూర్తి కావడంతో ఈవీ విధానంలో కేంద్రప్రభుత్వం గేర్ మార్చింది. ప్రజల్లో అవగాహన పెరిగి, అమ్మకాలు మెరుగుపడటంతో, కొనుగోలుదారులకు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని పథకానికి భారీ పరిశ్రమల శాఖ మరిన్ని మెరుగులు దిద్ది ఈ-డ్రైవ్‌ను 2024 సెప్టెంబరు 11 నుంచి అమలులోకి తెచ్చింది. తొలి రెండేళ్లకు రూ.10,900 కోట్ల నిధులు కేటాయించారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, అంబులెన్స్‌లు, ట్రక్కులు, ఇతర ఈవీల కోసం రూ.3,679 కోట్లు దీనికి ప్రత్యేకించారు. 28 లక్షల ఈవీల కొనుగోలుదారులకు దీనివల్ల ప్రయోజనం చేకూరుతుంది. 24.79 లక్షల ద్విచక్ర వాహనాలు, 3.16 లక్షల త్రీవీలర్స్, 14,208 బస్సులు కూడా ఈవీలుగా రోడ్లపైకి రానున్నాయి. అంబులెన్స్‌లకు రూ.500 కోట్లు, ట్రక్కుల కోసం రూ.500 కోట్లు, బస్సులకు రూ.4,931 కోట్లు అందుబాటులో ఉంచారు. ప్రజా రవాణా కోసం కొనుగోలు చేయడానికే కాకుండా వాటి నిర్వహణకు గాను రూ.3,434 కోట్లను కేటాయించారు.

ఫేమ్‌లోని లోపాలను సరిదిద్దారు. గతంలో విదేశాల నుంచి నేరుగా తెచ్చుకున్న ఈవీలకు కూడా రాయితీలు అందచేశారు. విమర్శలు రావడంతో ఇలాంటి వాటిని తొలగించారు. అలా రాయితీలు పొందిన కంపెనీలు ఆ డబ్బును తిరిగి చెల్లించాలి. చెల్లించని ఆటోమొబైల్ కంపెనీలను ఈ పథకం నుంచి దూరంగా ఉంచుతున్నారు. దేశవ్యాప్తంగా 88,500 ప్రదేశాల్లో ఈవీ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు నిధులు ఇవ్వనున్నారు. విడి భాగాలు తయారీ పరిశ్రమలకు ఉత్పత్తి ఆధారంగా ప్రోత్సాహకాలు(పీఎల్ఐ) కల్పించనున్నారు. ద్విచక్ర వాహనాల మార్కెట్‌లో 10 శాతం, త్రిచక్ర వాహన విపణిలో 15 శాతం 2026 మార్చి నాటికి ఒడిసిపట్టడమే లక్ష్యంగా ఈ-డ్రైవ్ పనిచేస్తుందని కేంద్రమంత్రి హెచ్.డి.కుమారస్వామి తెలిపారు. అయితే ఇంతకాలం ఉన్న నాలుగు చక్రాల వాహనాలకు(కార్లకు) ఈ పథకాన్ని వర్తింపచేయకపోవడం చర్చనీయాంశం అవుతోంది. కార్ల కొనుగోలుపై ఉన్న జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడమే అందుకు కారణమని చెబుతున్నారు. హైబ్రీడ్ వాహనాలకు రాయితీలను కూడా తీసేశారు. ఫేమ్ పథకంలో అనుచితంగా కొన్ని ఆటోమొబైల్ కంపెనీలు లబ్ధి పొందాయన్న ఆరోపణలు వచ్చాయి. దేశవాళీ ఉత్పత్తి కొనుగోళ్ల కోసం ఉద్దేశించిన పథకంలోని రాయితీలను కొన్ని కంపెనీలు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వాటికి అందుకున్నాయన్నది ఆరోపణ. తాజా ఈ-డ్రైవ్ పథకంలో ఈమేరకు సవరణలు తీసుకువచ్చారు.

ఇకపై ఈవీ కొనగానే డీలర్ ఒక ఈ-ఓచర్‌ను కొనుగోలుదారుకు అందచేస్తారు. ఇది ఆధార్ నంబరుతో లింక్ అయి ఉంటుంది. ఈ ఓచర్‌ను పీఎం ఈ-డ్రైవ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని తన ఖాతాకు నగదు బదిలీ రూపంలో ప్రోత్సాహకాన్ని కొనుగోలుదారు అందుకోవచ్చు. ఈవీలకు అవసరమైన విడి భాగాలను స్థానికంగా తయారుచేయాలి. దశలవారీగా ఈ ఆలోచనను ముందుకు తీసుకువెళ్లాలన్నది ఈ పథక మరో లక్ష్యం. విడి భాగాలను సమకూర్చుకుని స్థానికంగా కూర్పు చేసి, వాహనం తయారు చేసినప్పుడు ప్రోత్సాహకం అందాలి. పంపిణీదారులు విడిభాగాలను దిగుమతి చేసుకోవడం వరకు అనుమతి ఉంటుంది. కాని మొత్తం వాహనం దిగుమతి చేసుకుని ప్రోత్సాహకం అడగడం గతంలో మాదిరిగా ఇప్పుడు కుదరదు.

స్థానిక తయారీదారులు ప్రైమ్ మినిస్టర్ పోర్టల్(పీఎంపీ)లో నమోదు చేసుకుని తమ ప్రోత్సాహకాలు ఇకపై సులభంగా పొందవచ్చు. 2025-26 నుంచి ద్విచక్ర వాహనాలకు రూ.5,000, త్రిచక్ర వాహనాలకు రూ.25వేలు నగదు ప్రోత్సాహకం ఉండనుందని అధికారులు చెబుతున్నారు. ఈవీ తయారీదారులపై చెక్ ఉండటానికి రెండేళ్లకు ఒకసారి ఇన్స్‌స్పెక్షన్ కొత్త పథకంలో ఉంటుంది.

2015లో కనీసం అయిదువేల ఈవీలు లేని దేశంలో నేడు 30 లక్షల ఈవీలు తిరుగుతున్నాయి. 150 కోట్ల జనాభా గల భారత దేశంలో ఈ సంఖ్య స్వల్పమే అయినా దేశంలో కాలుష్యాన్ని తగ్గించడానికి గణనీయంగా కృషి జరగాల్సి ఉంది.

ఈవీల గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి, వాటి వినియోగాన్ని అలవాటు చేయడానికి ఫేమ్ పథకం ద్వారా ప్రాథమికంగా కృషి జరిగింది. 2015లో కనీసం అయిదువేల ఈవీలు లేని దేశంలో నేడు 30 లక్షల ఈవీలు తిరుగుతున్నాయి. 150 కోట్ల జనాభా గల భారతదేశంలో ఈ సంఖ్య స్వల్పమే అయినా దేశంలో కాలుష్యాన్ని తగ్గించడానికి గణనీయంగా కృషి జరగాల్సి ఉంది. 30 లక్షల ఈవీల వినియోగదారులు అసంతృప్తికి గురైతే మళ్లీ పెట్రోల్ ఇంధనం వైపు మొగ్గు చూపుతారు కదా! అందువల్లే ఈ-డ్రైవ్‌లో స్థానిక తయారీ, ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు, విడిభాగాల తయారీకి ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల్లో మరింత అవగాహన పెంచడానికి ప్రజా రవాణాలో వీటిని ప్రవేశపెడుతున్నారు. ఇప్పటికే ఆర్టీసీ వంటి సంస్థలు కూడా ఎలక్ట్రిక్ బస్సులను రోడ్లపై తిప్పుతున్నాయి. ఎలాంటి శబ్దం లేకుండా, కాలుష్యం అనే మాటకు తావులేకుండా ఇవి రోడ్లపై సంచరిస్తున్నాయి. పెట్రోల్ బంకులు మాదిరిగానే కొన్ని ఆర్టీసీ బస్టాండ్స్‌లో రీచార్జింగ్ పాయింట్లు కూడా ఏర్పాటుచేశారు. పీఎం ఈ-బస్ సేవ కింద రాష్ట్రాల ఆర్టీసీలకు విద్యుత్ బస్సుల పంపిణీకి కేంద్రం ముందుకు వస్తుంది. 2028-29 లోపు ఈ విభాగంలో 38వేల విద్యుత్ బస్సులు రోడ్లపైకి రానున్నాయి. ఇందుకు 3,345 కోట్ల రూపాయలు ప్రత్యేకించారు.

ఇప్పటికి కూడా పెట్రోల్, డీజిల్‌తో నడిచే కార్లదే హవా. కానీ భయాలు, అపోహలు తొలగించితే ఈవీలదే భవిష్యత్తు రాజ్యం. బ్యాటరీలు పేలిపోవడం, వేగ నియంత్రణ వంటి విషయాల్లో భయాలు పాత మాట. పరిశోధన-అభివృద్ధిపరంగా ఈవీలు ప్రజల నమ్మకాన్ని క్రమంగా చూరగొంటున్నాయి. చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు అనేకమందికి కొత్త ఉపాధిమార్గం కానుంది. ఈ-డ్రైవ్‌లో చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు రెండువందల కోట్లు వెచ్చించనున్నారు. హంగులతో, చౌక ధరలతో ఈవీలు ముందుకువచ్చే రోజులు మరెంత దూరంలో లేవు. మార్కెట్‌లో ఈవీలు చొచ్చుకుపోవాలి. ఆంగ్లంలో పెనెట్రేషన్ శాతం అంటారు. ఈ శాతం ఇండియాలో ఇప్పుడు 6.5 శాతమే ఉంది. అంటే వంద వాహనాలు అమ్ముడవుతుంటే వాటిలో ఈవీలు కేవలం ఆరున్నరే ఉంటున్నాయి. అదే చైనాలో ఇది 27 శాతం. అమెరికాలో 55, ఐరోపాలో 48 శాతంగా ఉంది. దక్షిణకొరియాలో పెనెట్రేషన్ 10 శాతం.

కార్లలో ఇంధన నిల్వకు ట్యాంక్ ఉంటుంది. దీనిలో పెట్రోల్ లేదా డీజిల్ నింపుతాం. ఈవీల్లో ఇంధనం నిల్వ బ్యాటరీయే. లిథియం మూలకం దీనికి అవసరం. అలాగే ఎలక్ట్రిక్ మోటారు ఇంజన్ మాదిరిగా ఈవీల్లో ఉంటుంది. వాహన ధరను ఈ రెండే ప్రధానంగా ప్రభావితం చేస్తాయి. ఈవీల ధర తగ్గించడానికి, మరింత భద్రంగా అవి తయారుకావడానికి ప్రపంచవ్యాప్తంగా పరిశోధన-అభివృద్ధి ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. అవి కూడా సానుకూల ఫలితాలనే ఇస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈవీల డ్రైవింగ్ జాగ్రత్తలు కూడా ప్రజల్లోకి వేగంగా వెళ్తున్నా... పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు కూడా మధ్య తరగతి వర్గాల వారిని ఈవీల వైపు ఆకర్షితులను చేస్తున్నాయి. సౌర విద్యుత్ అందుబాటులోకి వస్తుండటంతో ఒకరకంగా సమీప భవిష్యత్తులోనే నామమాత్రం ధరకు దూర ప్రయాణాలు కూడా చౌక కాబోతున్నాయి. దీనివల్ల మానవ సంచారం పెరిగి, ప్రగతి అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు పడతాయి. ప్రభుత్వపరంగా కూడా ఆచితూచి అడుగులు వేయాలి. పరిణామ క్రమం ఉపాధి అవకాశాలను దెబ్బతీయకుండా సాగాలి. ప్రస్తుతం ఆటోమొబైల్ రంగంలోని ఉపాధి దెబ్బతినకుండా విద్యుత్ వాహనరంగం క్రమేణా ముందుకు రావాలి. భవిష్యత్తు విద్యుత్ వాహనాలదే. ఇప్పటికే అమెరికా, ఐరోపా దేశాల్లో ఈవీలు అధిక సంఖ్యలో తిరుగుతున్నాయి. మిగిలిన దేశాలదీ అదే బాట అవుతుంది. మరోవైపు కాలుష్య రహిత సమాజం ఆరోగ్య భద్రతకు ఊతమిస్తుంది. ఈవీల విషయంలో జరుగుతున్న ఆర్ అండ్ డి మెరుగైన ఫలితాలు అందచేస్తే మానవాభివృద్ధి దిశగా అది పెద్ద ముందడుగే అవుతుంది.

ఇటీవల విజయవాడ వరదల్లో డ్రోన్ల ద్వారా ప్రజలకు ఆహారాన్ని అందచేశారు. రేపటి రోజున అదే డ్రోన్ల సాయంతో అక్కడకు చేరుకోవచ్చు. భవిష్యత్తులో డ్రోన్ల ప్రయాణాలు చూడవచ్చు. కార్లు నడపడం మాదిరిగా డ్రోన్ల డ్రైవింగ్ రేపటి కల కావచ్చు. కోరుకున్న ప్రదేశానికి గాలిలోకి ఎగిరి, కోరుకున్న ప్రదేశంలో దిగే సౌలభ్యం ఆవిష్కారం కాగల రోజులు భవిష్యత్తు తరం ముందున్నాయి. మార్పు నిత్య సత్యం. నిత్య కృత్యం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

హైదరాబాద్ రాజ్యంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ

భారతదేశంలో 1948 సెప్టెంబరు 17న విలీనమయ్యేంత వరకు హైదరాబాద్ అనేక రాజ వంశాలకు రాజధానిగా భాసిల్లింది. అప్పటి వరకు హైదరాబాద్ రాజ్యం లేదా హైదరాబాద్ సంస్థానంగా పేరుపొందింది. భారతదేశంలో విలీనమయ్యాక 1956 వరకు హైదరాబాద్ రాష్ట్రంగా పిలిచేవారు.

1550లో కుతుబ్‌షాహీల వంశపాలన ఆరంభమైంది. ఇబ్రహీం కులీ కుతుబ్‌షా మొదటి పాలకుడు. ఈయన కుమారుడైన మహ్మద్ కులీ కుతుబ్‌షా 1580 నుంచి 1612 వరకు పరిపాలించారు. ఈ కాలంలోనే హైదరాబాద్ నగరానికి శంకుస్థాపన జరిగింది. హైదరాబాద్‌కు ఉత్తర, పశ్చిమాల్లో కన్నడ, మరాఠా ప్రాంతాలు ఉండేవి. దక్షిణ, తూర్పు భాగాల్లో తెలంగాణ ఉంది.

హైదరాబాద్ రాజ్య(రాష్ట్ర) జనాభా

1881లో హైదరాబాద్ రాష్ట్ర జనాభా 9.8 మిలియన్లు. 1951లో అది 18.7 మిలియన్లు. 1891లో మొత్తం కార్మికుల్లో వ్యవసాయ కార్మికుల వాటా 10.9 శాతం కాగా 1941లో 41.4 శాతంగా ఉంది. రైతుల వాటా 1891లో 87.2 శాతం ఉండగా 1941లో 47.9 శాతంగా ఉంది. 1951లో తిరిగి వ్యవసాయ కార్మికుల వాటా 25.2 శాతంగా, రైతుల వాటా 71.4 శాతంగా ఉంది. అంటే వ్యవసాయ కార్మికుల వాటా 1891-1941 కాలంలో పెరిగి, 1941-51 కాలంలో తగ్గింది. ఇక రైతుల వాటా 1891-1941 కాలంలో తగ్గగా 1941-51 కాలంలో పెరిగింది. 1948లో హైదరాబాద్ ఇండియాలో విలీనంకావడం వల్ల భూ సంస్కరణలు అమలు జరిగి రైతుల వాటా పెరిగిందని విశ్లేషకులు పేర్కొంటారు.

సాలార్‌జంగ్ సంస్కరణలకు పూర్వదశ పాలన

హైదరాబాద్ రాష్ట్రంలో సాలార్‌జంగ్ ప్రధానిగా ఉన్నప్పుడు అనేక సంస్కరణలు అమలుచేశారు. మీర్-తురబ్-అలీఖాన్‌ను సాలార్‌జంగ్‌గా పిలిచేవారు. 1853లో సాలార్‌జంగ్ ప్రధాని కాక పూర్వం పాలన పూర్తిగా సంప్రదాయబద్ధంగా ఉండేది.

కేంద్ర పాలన వ్యవస్థలో 'దఫ్తర్-ఎ-మాల్', 'దఫ్తర్-ఎ-దివానీ', 'దారుల్-ఇన్షా' కార్యాలయాలు ఉండేవి. రాజ్య ఆదాయ వ్యయాలను దఫ్తర్-ఎ-మాల్, జాగీరుల కేటాయింపులను దఫ్తర్-ఎ-దివానీ చూసేవి. రాజ్య అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు 'దారుల్ ఇన్షా' చూసేది.

నగరాల్లో మూడురకాల కార్యాలయాలు ఉండేవి. దీనిలో రెండు న్యాయవ్యవస్థకు సంబంధించినవి కాగా ఒకటి పోలీసు వ్యవస్థ. తాలూకా స్థాయిలో 'ముఫసిల్' కార్యాలయాలు ఉండేవి. తాలూకాదార్లు శిస్తు వసూలు బాధ్యతను కలిగి ఉండేవారు. తాలూకాదార్లు వసూలు చేసే శిస్తులో గరిష్ఠంగా ఎనిమిది శాతం వేతనంగా ఇచ్చేవారు. తాలూకాదార్లు వంశపారంపర్యంగా కొనసాగేవారు. వీరు ఇతరులకు శిస్తు వసూలు బాధ్యతలను అప్పగించారు. వారు రికార్డులను సరిగా రాయక శిస్తును ఎక్కువగా అనుభవిస్తూ ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని, దాంతో ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోవడానికి కారణమయ్యారని విమర్శకులు పేర్కొంటారు.

సాలార్‌జంగ్ సంస్కరణలు

వంశపారంపర్యంగా వచ్చిన తాలూకాదార్లలో అవినీతిపరులను, అసమర్థులను, వారి మధ్యవర్తులను తొలగించారు. వారిస్థానంలో నూతన తాలుకాదార్లను తక్కువ వేతనంతో నియమించారు. వీరికి సహాయంగా ప్రభుత్వ ఉద్యోగులను అనుసంధానం చేశారు. శక్తిసామర్థ్యం, విశ్వాసం, ప్రవర్తనల ఆధారంగా తాలూకాదార్ల నియామకం చేపట్టారు. తాలూకాదార్ల అధికారులను బదిలీ చేశారు. రకరకాల జాగీర్దార్ల(దేశ్‌ముఖ్‌ల) నుంచి భూమిని వెనక్కి తీసుకుని దివానీ ప్రాంతంలో కలిపివేశారు. అలా అప్పటి విలువ ప్రకారం రూ.66.2 లక్షల ఆదాయం గల 30వేల చదరపు మైళ్ల భూమిని దివానీ ప్రాంతంలో కలిపారు.

ఆర్థికాభివృద్ధి

సాధారణంగా వ్యవసాయరంగం అభివృద్ధి చెందితే వ్యవసాయ మిగులు మిగతా రంగాలకు మూలధనంగా మారి వ్యవసాయేతర పారిశ్రామిక, సేవారంగాలు అభివృద్ధి చెందుతాయి. వ్యవసాయరంగ అభివృద్ధిలో భూ సంబంధాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అసఫ్ జాహీ వంశ పాలన కాలంలో 1724 నుంచి 1857 వరకు హైదరాబాద్ రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థగానే ఉన్నది. ఆ తరవాత కాలం(1857-1948)లో పారిశ్రామికీకరణకు కొంత అవకాశం లభించింది.

అందులో 13వేల చ.మై. తనఖా జాగీర్లు, నాలుగువేల చ.మై. కుదువబెట్టిన తాలుకాలు, 2,900 చ.మై. జత్ జాగీర్లు, బ్రిటిష్‌వారి నుంచి తిరిగిపొందిన 8,100 చ.మై., షోలాపూర్ ప్రాంతపు 2,000 చ.మై. ఉంది. ఫలితంగా 1861కి ముందు ఖల్సా(దివానీ) ప్రాంతపు మొత్తం విస్తీర్ణం 40వేల చ.మై. కాగా 1881 సంవత్సరంలో 71,600 చ.మై.గా ఉంది. ఈ విస్తీర్ణానికి ప్రధాన కారణం ముందే చెప్పినట్లుగా తనఖా జాగీర్లను కలుపుకోవడం, 1861 తరవాత బ్రిటిష్‌వారు నిజాంకు తిరిగి ఇచ్చిన భూములు(జిల్లాలు).

పైన తెలిపినవిధంగా సాలార్ సంస్కరణల్లో మొదటిది భూమిశిస్తుకు సంబంధించింది కాగా రెండోది వ్యాపార సంబంధితం. 1860లో సుంకాల శాఖను ఏర్పాటుచేసి ఎగుమతులు, దిగుమతులపై పన్నులను తొలగించారు. ఉప్పుపై ఉన్న అనేకరకాల పన్నులను రద్దు చేశారు. పన్నులను క్రమబద్ధీకరించారు. పన్నుల విధింపు, వసూళ్ల బాధ్యతను సుంకాల శాఖకు అప్పగించారు. 1855లో నగరాల్లో ప్రభుత్వ ఖజానా ఏర్పాట్లు చేశారు. ఈ ఖజానాలు తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పించేవి. అయితే ముఫసిల్ ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారుల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు.


1878లో నీటిపారుదల శాఖను ఏర్పాటు చేశారు. ఈ శాఖను సదర్-ఉల్-మిహాం పర్యవేక్షించేవారు. ఈ శాఖ ప్రధానంగా చెరువుల మరమ్మతును చూసేది. తాలూకాదారులు జిల్లాల్లో నీటిపారుదల వ్యవస్థను పర్యవేక్షించేవారు.

పలురకాల శాఖల స్థాపన

1878లో నీటిపారుదల శాఖను ఏర్పాటు చేశారు. ఈ శాఖను సదర్-ఉల్-మిహాం పర్యవేక్షించేవారు. ఈ శాఖ ప్రధానంగా చెరువుల మరమ్మతును చూసేది. తాలూకాదారులు జిల్లాల్లో నీటిపారుదల వ్యవస్థను పర్యవేక్షించేవారు. తహసీల్దార్లు తమ పరిధిలో నీటిపారుదల వ్యవస్థను చూసేవారు.

భారతీయ భౌగోళిక శాఖ అధికారి బ్లన్‌ఫోర్డ్ నిజాం రాజ్య పరిధిలో విరివిగా బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని ప్రకటించడంతో 1870లో బొగ్గు నిక్షేపాల వెలికితీతకు ఒక బృందాన్ని ఏర్పాటుచేశారు. 1871లో ఈ బృందానికి ఒక సూపరింటెండెంట్‌ను అధిపతిగా నియమించారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా 1871లో భారతీయ భౌగోళిక సర్వేశాఖ అధికారి డబ్ల్యూకింగ్ సింగరేణి ప్రాంతపు బొగ్గు నిక్షేపాలను కనుగొన్నారు. ఫలితంగా సింగరేణి బొగ్గు కంపెనీ ఏర్పాటుకు దారితీసింది. 1864లో నిజాం రాజ్యంలోని అన్ని నగరాల్లో ప్రభుత్వ లెక్కలను పరిశీలించడానికి సాధారణ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, దాని అధిపతిగా అకౌంటెంట్ జనరల్‌ను నియమించారు. ఇదే సంవత్సరంలో సైనిక శాఖను ఏర్పాటుచేశారు. అలాగే సుంకాల శాఖను క్రమబద్ధీకరించి సరిహద్దుల్లో సుంకాలశాఖ భవనాలను నిర్మించారు.

1869లో ప్రజాపన్నుల గిడ్డంగిని స్థాపించారు. 1867లో బోర్డ్ ఆఫ్ రెవెన్యూను రద్దు చేసి 'ప్రజా పనుల శాఖ'ను స్వతంత్రంగా ఏర్పాటుచేసి దానికి చీఫ్ ఇంజనీర్‌ను నియమించారు. 1871లో అటవీశాఖ పరిధిలోకి గనులు, రాతి గనులను తీసుకువచ్చారు. 1875లో ప్రతి రాష్ట్ర భాగంలో, జిల్లాలో ఇనాం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇదే సంవత్సరంలో సర్వే నిర్ధారణశాఖ(సర్వే అండ్ సెటిల్‌మెంట్ డిపార్ట్‌మెంట్)ను స్థాపించారు. 1878లో గజిటీర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. 1881 జనాభా లెక్కల కోసం 1880లో నిజాం ప్రభుత్వ జనాభా లెక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజా పనులు, ప్రజా నిబంధనలు, వైద్యం, పురపాలక, గ్రామీణ రోడ్ల పర్యవేక్షణకు 1869లో 'సదర్-ఉల్-మిహాం ముతమ్రీకల్‌'ను ఏర్పాటుచేశారు.



డా.ఎం.ఏ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల

రీజనింగ్

టీజీపీఎస్సీ / ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

నంబర్ రిపీట్ టెస్ట్

పార్ట్-2

1. L నుంచి T వరకు గల అక్షరాలకు 1 నుంచి 9 వరకు గల అంకెలను ఇచ్చారు. కాని అదే వరుస కాదు. P అనగా 4. P, T ల మధ్య భేదం 5. N, Tల మధ్య భేదం 3. అయితే N విలువ ఎంత?

ఎ) 4 బి) 8 సి) 6 డి) 5

సమాధానం: (సి)

వివరణ: L నుంచి T వరకు గల సంఖ్యలకు 1 నుంచి 9 వరకు గల అంకెలను మాత్రమే ఉపయోగించాలి.

వీటిలో P అనగా 4. P, Tల మధ్య భేదం '5' అని ప్రశ్నలో ఉన్నది. కాబట్టి 'T'ని 9గా భావిస్తే P, T మధ్య భేదం అనగా 4, 9ల మధ్య భేదం '5' అవుతుంది. ఇప్పుడు T అనగా 9 అని తెలిసింది. అదే విధంగా N, Tల మధ్య భేదం '3' అని ప్రశ్నలో ఉంది. ఇప్పుడు N విలువను 6గా తీసుకొంటే N, Tల మధ్య భేదం అనగా 6, 9 ల మధ్య భేదం '3'కు సమానమవుతుంది. కాబట్టి N విలువ '6' అవుతుంది.

2. 3849072165 ఈ సంఖ్యలో మొదటి స్థానంలోని అంకె ఆరోస్థానంలోకి, ఆరోస్థానంలోని అంకె మొదటి స్థానానికి, రెండో స్థానంలోని అంకె ఏడో స్థానంలోకి, ఏడోస్థానంలోని అంకె రెండో స్థానంలోకి ఈ విధంగా మొత్తం పై సంఖ్య మారింది. మార్చగా ఏర్పడిన నూతన సంఖ్య ప్రకారం కుడి నుంచి 6వ సంఖ్య ఏది?

ఎ) 6 బి) 0 సి) 5 డి) ఏదీకాదు

సమాధానం:(సి)

వివరణ: ప్రశ్నలో తెలిపిన విధంగా ఇచ్చిన సంఖ్యలోని అంకెలను మార్చగా ఏర్పడే నూతన సంఖ్య 7216538490. దీని ప్రకారం కుడి అనగా 0 నుంచి మొదలుపెట్టిన ఆరోస్థానంలో ఉండే అంకె '5' అవుతుంది.

3. 3849072165 ఈ సంఖ్యలో మొదటి స్థానంలోని అంకె రెండో స్థానంలోకి, రెండో స్థానంలోని అంకె మొదటి స్థానంలోకి, మూడోస్థానంలోని అంకె నాలుగో స్థానంలోకి, నాలుగో స్థానంలోని అంకె మూడోస్థానంలోకి ఈవిధంగా మొత్తం పై సంఖ్య మారింది. మార్చగా ఏర్పడే నూతన సంఖ్య ప్రకారం ఎడమ నుంచి 8వ సంఖ్య ఏది?

ఎ) 8 బి) 4 సి) 2 డి) ఏదీకాదు

సమాధానం:(సి)

వివరణ: ప్రశ్నలో తెలిపిన విధంగా జాగ్రత్తగా పరిశీలిస్తే ఇచ్చిన సంఖ్యలో ప్రతి రెండు మారతాయని అర్థం. ఆ విధంగా మార్చగా ఏర్పడే నూతన సంఖ్య 8394701256. దీనిలో ఎడమ అనగా '8' నుంచి మొదలు పెట్టిన ఎనిమిదో స్థానంలోని అంకె '2' సమాధానం అవుతుంది.

4. 1 నుంచి 100 వరకు సంఖ్యల్లో 6తో భాగితమయ్యే సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే చివరి నుంచి 11వ స్థానంలో వచ్చే సంఖ్య ఏమిటి?

ఎ) 60 బి) 66 సి) 54 డి) 48

సమాధానం: (బి)

వివరణ: 1 నుంచి 100 వరకు గల సంఖ్యలలో 6తో భాగితమయ్యే సంఖ్యల అవరోహణ క్రమం కింది విధంగా ఉంటుంది.

96, 90, 84, 78, 72, 66, 60, 54, 48, 42, 36, 30 24, 18, 12, 6, వీటిలో చివరి నుంచి 11వ స్థానంలో వచ్చే సంఖ్య 66.

5. సంఖ్య 85674293లోని బేసి సంఖ్యల విలువను ఒకటి తగ్గించి సరిసంఖ్యల విలువను ఒకటి పెంచగా ఏర్పడే నూతన సంఖ్యలోని అన్ని అంకెల మొత్తం విలువ ఎంత?

ఎ) 42 బి) 44 సి) 45 డి) 46

సమాధానం: (బి)

వివరణ: ప్రశ్నలో తెలిపిన విధంగా ఇచ్చిన సంఖ్యలోని బేసి అంకెల విలువను ఒకటి తగ్గించి, సరి అంకెల విలువను పెంచగా ఏర్పడే నూతన సంఖ్య 94765382. ఈ సంఖ్యలోని అన్ని అంకెల మొత్తం 9+4+7+6+5+3+8+2 = 44.

6. కింది సంఖ్యలను ముందుగా తిప్పిరాసి తదుపరి వాటిని అవరోహణ క్రమంలో రాస్తే మొదటి నుంచి మూడోసంఖ్యలో చివరి అంకె ఏమిటి?

683, 389, 415, 627, 386, 492

ఎ) 2 బి) 6 సి) 3 డి) 5

సమాధానం: (సి)

వివరణ: ఇచ్చిన సంఖ్యలలోని అంకెలను తిప్పి రాయగా

386, 983, 514, 726, 683, 294

పై సంఖ్యలను అవరోహణ క్రమంలో రాయగా

983, 726, 683, 514, 386, 294

పై వరుస క్రమంలో మొదటి నుంచి మూడో సంఖ్యలో చివరి అంకె. 3.

7. కింది సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే తరవాత రెండో సంఖ్యలోని మూడో అంకెకు, మూడో సంఖ్యలోని రెండో అంకెకు మధ్య భేదం ఎంత?

894, 362, 465, 679, 423, 156, 248



ఎ) 2 బి) 3 సి) 6 డి) 7

సమాధానం: (బి)

వివరణ: ఇచ్చిన సంఖ్యల అవరోహణ క్రమం కింది విధంగా ఉంటుంది.

894, 679, 465, 423, 362, 248 156

పై సంఖ్యల్లో రెండో సంఖ్యలోని మూడో అంకె 9. మూడో సంఖ్యలోని రెండో అంకె 6. 9, 6ల మధ్య భేదం 3.

8. కింది సంఖ్యల్లో మొదటి, చివరి అంకెలను తారుమారు చేస్తే తదుపరి ఏర్పడే కొత్త సంఖ్యల్లో రెండో పెద్ద సంఖ్య ఏది?

ఎ) 652 బి) 865 సి) 259 డి) 487

సమాధానం:(డి)

వివరణ: ప్రశ్నలోని ఐచ్ఛికాలలో ఇచ్చిన సంఖ్యలలో మొదటి చివరి అంకెలను తారుమారు చేయగా ఏర్పడే నూతన సంఖ్యలు 256, 568, 952, 784 వీటిలో మొదటి పెద్ద సంఖ్య 952, రెండో పెద్ద సంఖ్య 784. అనగా 487 సమాధానం అవుతుంది.

9. 9 నుంచి 60 వరకు గల సంఖ్యలలో 9తో భాగింపబడుతూ 3చే భాగించబడని సంఖ్యలు ఎన్ని?

ఎ) 3 బి) 4 సి) ఏమిలేవు డి) ఏదీకాదు

సమాధానం:(సి)

వివరణ: 9తో భాగించబడే ప్రతి సంఖ్య కూడా 3తో భాగించబడుతుంది. కాబట్టి సమాధానం 'ఏమిలేవు' అవుతుంది.

10. 100 నుండి 1000 వరకు సంఖ్యలలో పదుల స్థానంలో '2' ఎన్ని సార్లు వస్తుంది?

ఎ) 10 బి) 50 సి) 9 డి) 90

సమాధానం:(డి)

వివరణ: 120 నుంచి 129, 220 నుంచి 229, 320 నుంచి 329, 420 నుంచి 429, 520 నుంచి 529, 620 నుంచి 629, 720 నుంచి 729, 820 నుంచి 829, 920 నుంచి 929 ఈ విధంగా మొత్తం 90 స్థానాలలో '2' వస్తుంది.

11. 1 నుంచి 50 వరకు సంఖ్యలలో 6తో భాగించబడుతూ 4తో భాగించబడని సంఖ్యలు ఎన్ని?

ఎ) 4 బి) 5 సి) 3 డి) 2

సమాధానం:(ఎ)

వివరణ: 1 నుంచి 50 వరకు గల వాటిలో 6చే భాగించబడే సంఖ్యలు 6, 12, 18, 24, 30, 36, 42, 48. వీటిలో 4చే భాగించబడని అంకెలు 6, 18, 30, 42 అనగా '4' ఉంటాయి.

12. కింది సంఖ్యలను ఆరోహణ క్రమంలో రాస్తే తరవాత మధ్య సంఖ్య మధ్య అంకెను తెలపండి?

624, 835, 783, 452, 596

ఎ) 2 బి) 4 సి) 3 డి) 5

సమాధానం:(ఎ)

వివరణ: ప్రశ్నలో ఇచ్చిన సంఖ్యలకు ఆరోహణ క్రమం కింది విధంగా ఉంటుంది.

452, 596, 624, 783, 835

వీటిలో మధ్య సంఖ్య 624. ఈ 624లో మధ్య అంకె '2' సమాధానం అవుతుంది.

13. కింది సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే తదుపరి మధ్య సంఖ్య యొక్క మధ్య అంకెను తెలపండి?

786, 493, 352, 649, 736, 218, 624

ఎ) 4 బి) 9 సి) 2 డి) 7

సమాధానం:(సి)

వివరణ: ప్రశ్నలో ఇచ్చిన సంఖ్యలకు అవరోహణ క్రమం కింది విధంగా ఉంటుంది.

786, 736, 649, 624, 493, 352, 218

వీటిలో మధ్య సంఖ్య 624. ఈ 624లో మధ్య అంకె 2.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ